
ఆంధ్రసచిత్రవార పత్రిక

40 పైసలు
17-5-68





CIBA
పట్టువంటి మృదుత్వము, కోమలము వంటి
వసంతము వలెనూతనత్వం...
ప్రత్యేకమైన పరిమళము కలిగినది
Binaca
Talc
బినాకా
దుర్గంధమును మాపి
మృదుత్వము
కల్గుచేయు టాల్కు.

ఉత్తరాలు

ముఖచిత్రం

26—4—68లో సంచికలో "వైజయంతి మాల" ముఖచిత్రం ఎంతో ఆకర్షణీయంగా వుంది మన తెలుగు తారల ముఖచిత్రాలు చూచి చూచి విసిగిపోయిన మాకు ఈ వారం ముఖచిత్రం కాస్త రిలీఫ్‌ను ఇచ్చింది "ఒక వారం విపరీతం"లో మీరు వేస్తున్న కార్టూన్‌లు మమ్ములను నవ్వులలో ముంచెత్తున్నాయి అంటే నమ్మండి

కె నరసింహాచార్యులు, (ఇచ్ఛాపురం)

* *

3—5—68 పత్రిక ముఖ చిత్రం కె ఆర్ విజయ ఎంతో ఆకర్షణీయంగా ఉంది హృదయం చిగిర్చింది చీకటి కడుపున కాంతి సీరియల్స్ బాగున్నవి ఇంకా కథలు కార్టూన్‌లు కూడా బాగున్నవి.

మరిసెట్టి నాగేశ్వరరావు, (పిఠాపురం)

కథలు

శ్రీ యర్రంసెట్టి శాయిగారి కథ 'టి సి' అమోఘం చదువుతూ నవ్వుకొనుటకు ఎంతో బాగున్నది కాని, అవినీతిని ప్రోత్సహించు చున్నదని తెలుపుటకు విచారించ చున్నాను స్ట్రిక్ట్ (నిజాయితీ) గా వుంటే ఉద్యోగము వూడిపోతుందనే భావన కలిగేటట్లు గా "కథ" శ్రీ శాయిగారు ఎందుకు వ్రాశారో బహుశ "కామిక్"గా కథను వ్రాసి వుంటారు గాని, ముగింపులో అవినీతి ప్రోద్బలము స్ఫురించు చున్నదని తెలుపుతున్నందుకు వారు వ్యధపడరని ఆశించ చున్నాను. కథలో మాత్రం గంచి హాస్యరసం వుంచినందుకు వారికిదే ధన్యవాదములు తెలుపు చున్నాను

వానపల్లి బాలాజీరావు (చినగంజాము)

* * *

26—4—68 నాటి ఆంధ్ర సచిత్ర వార పత్రికలో ప్రచురింపబడిన "పార్వతి" కథ అతి సహజంగా ఉంది కథ చదువుతూ రెండుసార్లు కన్నీళ్లు కార్చాను ఇంత చక్కటి కథ వ్రాసిన రాయ్యూరు శేషరత్నంగారిని నా హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను అంతటి ఉత్తమ కథలను మా పత్రిక ద్వారా పాఠకుల కందచేస్తున్న మీరు కూడ అభినందనీయులే

ఇదే సంచికలో ప్రచురింపబడిన "కాకాసురుడు" గురుద్యోగపర్వం చాలా తమాషాగా కడుపుబ్బ నవ్వ వచ్చేట్లుంది.

ప్రమోద్ అవధాని (మంథెన)

* * *

అనేక కొత్త శీర్షికలతో మన పత్రిక ఎంతో బాగుంటున్నదీ పెద్దకథ— గురుద్యోగపర్వం— సీరియల్ కథలు ఎంతో ఆసక్తికరంగా యున్నాయి

చుండూరు దుర్గారావు, (చిలకలూరిపేట)

సీరియల్స్

ఈనాటి వరకూ వెలువడిన శ్రీమతి ఆనందారామంగారి రచనలన్నీ చదివాను ప్రస్తుతం 'ఆంధ్ర సచిత్రవార పత్రికలో' 'సీరియల్'గా ప్రచురిత మవుతూన్న "చీకటి కడుపున కాంతి" మరొక నూతన పంథాలో సాగిపోతూంది రచయిత్రి భావాలు చదువరుల హృదయాలను స్పందింప జేయగల వన్నిస్తుంది మనసులో చెరిగిపోని అనుభూతి కల్గించగలిగే శక్తి వాటికుందని నా నమ్మకం

ముఖ్యంగా కథలోని 'వారిజ' పాత్ర చిత్రీకరణ ఉదాత్తంగా వుంది సున్నిత మనస్కుడుగా 'రామచంద్ర' పాత్ర అతి సహజంగా రూపు దాల్చింది మొదటినుంచీ ఆసక్తిజనకంగా వుండి చివర ఎలా ముగుస్తుందో అని ఆత్రుతకల్గిస్తోంది రచయిత్రికి నా అభినందనలు

డాక్టర్ కె కమల, (వైజాగ్)

* * *

అచ్యుతవల్లిగారు వ్రాసిన మూడుముళ్ళు సీరియల్ చాలా బాగుంది. నిజంగా కామేశ్వరిని చూచినట్టు అనిపించుతుంది చదువుతున్నంతసేపు నిజంగా చూస్తున్నట్టున్నది

నూరంపల్లి మంగతాయి (విశాఖపట్టణము)

* * *

ఈ మధ్య పత్రిక చాలా బాగుంటూంది కె రామలక్ష్మిగారి "హృదయం చిగిర్చింది" సీరియల్, సి ఆనందారామంగారి "చీకటి కడుపున కాంతి" సీరియల్ చాలా బాగున్నాయి ఈ సీరియల్స్ కొరకు పత్రిక కొరకు ఎదురు చూచుచూ గడుపుతున్నాము.

జానకి (రాజమండ్రి)

* * *

మీరు ప్రచురిస్తున్న సీరియల్సు "చీకటి కడుపున కాంతి" "హృదయం చిగిర్చింది" చాలా ఆసక్తికరంగా వున్నాయి. రచయిత్రి శ్రీమతి రామలక్ష్మిగారు కథను చాలా క్రొత్త తరహాలో ప్రారంభం చేసారు. గురుద్యోగ పర్వంలో వుద్యోగుల కష్టసుఖాలను, పై ఆఫీసర్లు క్రింది వుద్యోగులను చూసే విధానం, చాలా చక్కగా వున్నాయి లంచాలు తినే ఆఫీసర్లకు, వుద్యోగులకు యీ కథ ఒకవిధమైన కనువిప్పు కలుగ చేయవచ్చును యిటువంటి సీరియల్స్, కథలు ప్రచురించుటవలననే పత్రిక దినదినాభివృద్ధి చెందుతోందని చెప్పడం అతిశయోక్తి కానేరదు యిటువంటి సీరియల్సు, కథలు ప్రచురిస్తున్నందుకు మీకు నా అభివందనములు.

అయిలవరపు వెంకట రమణమూర్తి,
ట్యూటింగు (సేఫ్)

ఒకవారం విపరీతం

26—4—68 వ సంచికలో ఒకవారం విపరీతంలో, 5 వేల మిలియన్ల ఎలకలు సాలీనా నూరు కోట్ల ఆహారధాన్యాలు స్వాహా చేస్తున్నాయనీ వ్రాశారు ఏమిటి ఆ మారు కోట్లు? టన్నులా? ధాన్యపు గింజలా?.......... లేక

కె వి యల్ నారాయణ, (భవానీపాట్నా) ●

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం 17–5–'68
కీలకనామ సం॥ వైశాఖ బహుళ షష్ఠి
సంపుటము. 60 సంచిక: 36


స్థాపితము:
1908

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1

పోస్టు ద్వారా

సంవత్సర చందా	26 00
6 మాసముల చందా	13 00
3 మాసముల చందా	6 50

విషయానుక్రమణిక


రంధ్రాన్వేషణ
కల్పితమైన రిపోర్టులు
తిమ్మారెడ్డి విషయం
నువ్వింకా చావలేదూ?
తరుణోపాయం
పరిస్థితి
ఒకటి దాటాం: ఇంకొ చాలా వున్నాయి
వియత్నాం పోరుల

శ్రీకృష్ణ

నాలుగవ ప్రణాళిక : కొన్ని సూచనలు

బడ్జెటు రెండవ అంకంకూడా పూర్తి అయింది ఇక చర్చలు ప్రారంభం అవాలి గ్రాంట్ల కోరికలమీద జరిగే చర్చల స్థాయి పోయిన ఏటిస్థాయికన్నా తక్కువగా ఉంది ఎందుకోగాని ప్రభుత్వం చర్చల కార్యక్రమంలో రాష్ట్రాలకి సంబంధించిన విషయాలనే ఉంచారు; ఉదాహరణకి నీటి పారుదల, విద్యుచ్ఛక్తి, ఆహారం, వ్యవసాయం వగయిరా పెట్రోలియమ్, పారిశ్రామికాభివృద్ధి సంగతులని జాబితాలో మారుమూలలో ఎక్కడో వేశారు. ప్లానింగ్ కమిషన్, ఆర్థికశాఖ గురించిన ప్రసక్తి అసలే లేదు. ఒక నెల సమావేశం అయి ముఖ్యమయిన పనులు ఏమేమి చేశారంటే, సరయిన సమాధానం రాదు. తమ బత్తేల హెచ్చింపుకోసం అడిగే సభ్యులకి ఇతర కర్చులు తగ్గించమని కోరే అవకాశం ఎక్కడ ఉంటుంది?

నాల్గవ ప్రణాళికని (డ్రాఫ్టురూపంలో) చర్చిస్తున్నారు. పెరుగుదల రేటుగురించి వాగ్వివాదాలు జరుగుతున్నాయి ప్లానింగ్ కమిషన్‌వారు 6 శాతం కావాలంటున్నారు. దీనికి సరిగా అదనంగా 250 కోట్ల రూపాయలు అవసరం అని వారి అభిప్రాయం. ఉప ప్రధానమంత్రి పన్నుల విధింపుకి ఇంకా అవకాశం ఉందంటున్నారు. దుబారా కర్చుకి కూడా ఇంకా అవకాశం ఉందన్నా ఫరవాలేదు.

కొత్త పన్నుల వసూలు రాజకీయాలకి సంబంధించిన విషయం అని ప్లానింగ్ కమిషన్ వారంటారు. కేంద్ర మంత్రి వర్గం, రాష్ట్ర ముఖ్యమంత్రులు ఇందులో పాల్గొనాలంటారు. ఉత్పత్తి పెరిగినకొద్దీ కొత్త ఆర్థికావకాశాలు పెరుగుతాయంటారు. ఈ ఉత్పత్తి అధికంగా వ్యవసాయంలోనే ఉంటుంది. మరి వ్యవసాయోత్పత్తిమీద పన్నులు వేస్తారా? ఏకాంగ్రెసు రాజకీయవాది దానికి అంగీకరిస్తాడు?

బలిమేళ జలవిద్యుచ్ఛక్తి ప్రాజక్టు సంగతి తీసుకోండి ఇది ఆంధ్ర, ఒరిస్సాల ఉమ్మడి ప్రాజక్టు. దానికోసం రష్యన్లతో 1964 లో ఒప్పందం ఒకటి చేసుకున్నారు రష్యా దానికి కావలసిన సామగ్రి 1968 కి సరఫరా చెయ్యాలి. అయితే, ఈ ప్రాజక్టు 1971 కి గాని సిద్ధం అయ్యేట్లు లేదు. ఆనకట్టకి కావలసిన సామగ్రి కొంత దేశంలోనే తయారవుతుంది. దానిని కొనే స్తోమత ఈ రెండు ప్రభుత్వాలకీ లేదు. రష్యన్లని వారు తయారు చేసిన సామగ్రిని ఇంకా మూడు సంవత్సరాలు ఉంచుకోమని అడుగుతున్నారు. అయితే మన ప్రభుత్వం ఈ ప్రాజెక్టు 1968 కి పూర్తి అవుతుందని రష్యాకి హామీ ఇచ్చింది.

ఇది మచ్చుకి చెప్పాను. ఇటువంటివి ఇంకా ఎన్నో ఉన్నాయి. రాష్ట్రప్రభుత్వాలు అన్నిటికీ కేంద్రసహాయంకోసం చూస్తాయి కేంద్ర విద్యాశాఖమంత్రి తమ శాఖ గురించి ఇదే ధోరణిలో మాట్లాడుతున్నారు. విద్యాభివృద్ధి ప్రణాళికలకోసం రాష్ట్రాలకి కేంద్రమే సహాయం చెయ్యాలని ఆయన అభిప్రాయం.

* * *

ప్రణాళికా—నిపుణులు దేశానికి 1961కి 50000 ఇంజనీర్లు, 1975–76 కి 275,000 ఇంజనీర్లు (పట్టభద్రులు) అవసరం అని అంచనా వేశారు. డిప్లొమా హోల్డర్ల సంఖ్యలు 54000, 310000 ఉంటాయని కూడా ఊహించారు.

1968 లో 803 మంది గ్రాడ్యుయేట్లకి, 2384 మంది డిప్లొమావారికి ఉద్యోగాలు లేవని అంచనా. ప్రణాళిక అంచనాలు ఇలా ఉంటాయి.

ఆర్థికాభివృద్ధి పెరుగుదల రేటు 10 శాతం ఉండాలి. గత 15 సంవత్సరాలలో 3 శాతం మాత్రమే ఉంది. ఈ భేదం పోయినప్పుడే ఉద్యోగాల కొరతకూడా పోతుంది.

ఇంజనీరింగు కళాశాలల నిర్మాణంలో తొందరపడి ఏదయినా నిర్ణయానికి వచ్చారా అంటే అదీ లేదు. విదేశ నిపుణుల సలహా కూడా తీసుకున్నారు

రాంచీ హెవీ ఇంజనీరింగ్ యూనిట్ నష్టంమీద నడుస్తోందంటే నీటి ఎద్దడులవల్ల కాదుకదా!

ప్లానింగ్ కమిషన్ తన అభివృద్ధి పథకాన్ని సమీక్షించింది (సమీక్ష సారాంశం ఈ కింద ఇవ్వబడింది):

'వ్యవసాయంలో ఏటా 5 శాతం పెరుగుదల ఉండవచ్చు. పరిశ్రమలలో పెరుగుదల 8–10 శాతందాకా ఉండవచ్చు. ఇది అసాధ్యంకాదు. అంటే, సగటుగా 5–6 శాతం మొత్తం పెరుగుదల ఉండవచ్చు. నాల్గవ ప్రణాళికలో ఏయే పెట్టుబడులు ఎలా వెయ్యాలో స్పష్టంగా అనుకోవాలి. అయితే 1969–74 లో పెద్దామనుకున్న పెట్టుబడి అంచనాలు ఇంతకిముందే తయారయి పోయాయి. ఇక అయిదవ ప్రణాళిక సంగతికూడా ఆలోచించాలి.

'నాల్గవ ప్రణాళికలో స్వశక్తిమీద ఆధారపడే లక్ష్యాన్ని సాధించాలి ఎల్లకాలం విదేశ సహాయంమీద ఆధారపడటం మంచిదికాదు దిగుమతులు తగ్గించి ఎగుమతులు పెంచాలి.

'ఇది తేలికకాదు. ఉత్పత్తి పెరిగిన కొద్దీ దిగుమతులుకూడా పెరుగుతాయి. కొన్ని ముడిపదార్థాలు మనం దిగుమతి చేసుకోనక తప్పదు. ఉదాహరణకి నాన్ ఫెర్రస్ లోహాలు, రాతినూనెలు అందుచేత మొత్తంమీద దిగుమతులనే తగ్గించాలి. అవసరమయిన వాటి దిగుమతులు పెరిగినా తక్కినవాటి దిగుమతులు తగ్గించాలి ఎరువులు, పి ఎల్. 480 ఆహార వస్తువులు వగయిరా.

'ఇక ఎగుమతుల హెచ్చింపు వాల్గవ ప్రణాళికలో వీటిని సాలుకి 7 శాతం చొప్పున పెంచవచ్చు వ్యవసాయోత్పత్తి ఎగుమతి మీదనే ఆధారపడరాదు కాని, కొన్ని ప్రత్యేక వ్యవసాయవస్తువుల ఉత్పత్తి పెంచి వాటి ఎగుమతులని పెంచవచ్చు.

'ఇనుము ధాతువు, ఉక్కు, ఇనుము, యంత్రసామగ్రి, రసాయనిక వస్తువుల ఎగుమతి పెంచే అవకాశం ఉంది. దీనికి కావలసిన రేవు, రవాణా సదుపాయాలని కూడా అభివృద్ధి చెయ్యాలి

'కొంతకాలం వెనుకబడినదేశాలే మన మార్కెట్లుగా ఉన్నా కొన్ని వస్తువులు అభివృద్ధి సాధించిన దేశాలుకూడా కొనవచ్చు

'స్థూలంగా చెప్పాలంటే మన ఉత్పత్తి వద్ధతులవల్ల మన ధరలు చాలా అధికంగా ఉంటున్నాయి అందుచేత ఎగుమతులు దెబ్బతింటున్నాయి

'దేశం మొత్తంమీద పొదుపు, ధనం విలవ చెయ్యటం అవసరం వీటికి కావలసిన పథకాలు తయారు చెయ్యాలి.

'ప్రస్తుతం పరిశ్రమలలో విదేశ సహకారం అనేది చాలా ఉంది. ఈ విషయంలో ఎంతో మార్పు అవసరం. కేవలం పెట్టుబడికోసం విదేశ—సహకారం— భాగస్వాములని పిలుచురాకూడదు. మనకి సాంకేతిక పరిజ్ఞానం తక్కువ అయినప్పుడే ఇది చెయ్యాలి. ఆ విధంగా మన పారిశ్రామికాభివృద్ధిం కూడా చక్కబడుతుంది.'

క్షేమేంద్రుని బృహత్కథామంజరి కథలు

అనువాదం: తిరుమల రామచంద్ర

వాడని ఎర్రతామరల కథ



వత్సరాజా! నర్మసఖుడు వసంతకుడు ఇలా కథ ప్రారంభించాడు: రాజకుమారా! పూర్వం తామ్రలిప్త అనే పట్టణం ఉండేది. ఆ పట్టణంలో ధనగుప్తుడనే బేహారి ఉండేవాడు. అతనికి పుత్రులు లేరు. అతడు బ్రాహ్మణులను పిలిపించి తనకు పుత్రులు కలిగే ఉపాయం చెప్పవలసిందని కోరాడు. వారు 'శ్రేష్ఠీ, పూర్వం సోమకుడనే రాజు ఉండేవాడు. అతనికి ఒకే ఒక కుమారుడు కలిగాడు. అతడు పదివేల జంతువులను యజ్ఞపావకునికి సమర్పించాడు. వందమంది పుత్రులు కలిగారు. అందువల్ల నీవుకూడ యజ్ఞాగ్నిని సంతృప్తి పరుచు. పుత్రులు కలుగుతారు' అని అన్నారు.

ధనగుప్తుడు వారిమాట ప్రకారం పుత్రకామేష్టి జరిపాడు. అతనికి కులోచితుడైన కుమారుడు పుట్టాడు. అతనికి ధనగుప్తుడు గుహసేనుడు అని పేరు పెట్టాడు. ఆ గుహసేనుని చూచి మన్మథుడు కూడ సిగ్గుపడేవాడు. గుహసేనుడు పెద్దవాడై తండ్రికి వ్యాపారంలో తోడుగా ఉండేవాడు.

కొంతకాలం గడిచింది. కుబేరునివంటి ఆ ధనగుప్తుడు ఒక మారు తన కుమారునితోపాటు రత్న వ్యాపారంకోసం ఓడలో సముద్రందాటి బర్బరదేశానికి వెళ్ళాడు. అక్కడ ధర్మగుప్తుడనే వైశ్యునితో అతనికి పరిచయం కలిగింది. ధర్మగుప్తునికి ఒక కుమార్తె ఉంది. ఆమె పేరు దేవస్మిత. ఆమె చాల లావణ్యవతి. ధనగుప్తుడు ఆ కన్యను చూచి, తన కుమారునికి తగిన వధువు అనుకున్నాడు. తన కుమారునికి ఆమెను ఇచ్చి వివాహం చేయమని ధర్మగుప్తుని కోరాడు.

ధర్మగుప్తునికి కుమార్తెమీద ప్రేమ ఎక్కువ. తామ్రలిప్త చాల దూరదేశం. అంతదూరం సంబంధం అంటే భయపడ్డాడు. అందువల్ల దేవస్మితను గుహసేనునికి ఇవ్వడానికి ఇష్టపడలేదు.

కాని, దేవస్మితకు గుహసేనుణ్ణి చూచినది మొదలు అతనినే పెండ్లాడాలనే అభిలాష కలిగింది. అతని రూపం, గుణగణాలు ఆమెను వలపింపజేశాయి. తన చెలికత్తెలద్వారా ధనగుప్తుని విడిది మొదలయిన వృత్తాంతమంతా తెలుసుకొన్నది; తలిదండ్రులను వదలి [illegible]

అయినాసరే, గుహసేనుణ్ని పెండ్లి చేసుకోవాలని నిశ్చయించుకుంది ధనగుప్తుని విడిదికి వెళ్లింది.

ధనగుప్తుడు ఆమె రాకకు చాల సంతోషించాడు ఆమెతో పాటు ఓడలో తామ్రలిప్తకు తిరిగి వచ్చాడు తామ్రలిప్తలో వైభవంగా వారిద్దరికీ వివాహం చేశాడు మన్మథ సుందరుడయిన ఆ గుహసేనుడు, ఆ బాల కురంగలోచన సాంగత్యంతో అమృతాభిషేకం చేసినంతగా సంతోషించాడు.

వృద్ధుడైన ధనగుప్తుడు స్వర్గస్థుడయ్యాడు. గుహసేనుడు తన తండ్రి స్థానంలో వ్యాపారం నిర్వహించవలసి వచ్చింది తండ్రివలెనే ద్వీపాంతరయాత్ర చేసి వర్తకం పెంపొందించుకొమ్మని బంధువులు అతనికి హితవు చెప్పారు. ధనం వృద్ధి చేసుకొనడానికి అదే మార్గమని అతనికి కూడా తట్టింది సముద్రయాత్ర వెళ్లడానికి సిద్ధపడ్డాడు. తన భార్య మాట కూడా తీసుకుందామని ఆమెను చూడడానికి లోపలికి వెళ్లాడు; బంధువుల హితవు చెప్పాడు.

దేవస్మిత ఆ మాట వినగానే వియోగ బాధతో కంపించిపోయింది భర్త ద్వీపాంతరాలకు వెళ్లడం ఆమెకు సుతరామూ ఇష్టంలేదు. ఆమె స్థితి చూచి, గుహసేనుని మనసు ఉయ్యాలవలె ఊగిసలాడింది, వెళ్లాలా వద్దాఅని. లాగే ఆమెను చూపులతోనే చాలసేపు తాగివేసేట్టుగా చూస్తూ వుండిపోయాడు. ఎడబాటు ఏర్పడుతున్నదన్నప్పుడు అనురాగం ఉప్పొంగి మనసు పట్టరానంత అవుతుంది

భర్త ఎలాగూ వెళ్లదలచుకొన్నాడని తెలిసినతర్వాత దేవస్మిత కాటుకకన్నుల నుంచి నీరు ధారగా పయోధరాలపైపడి వాటికి నల్లటి కప్పు పూసినట్లయింది అప్పుడు ఆ ప్రౌఢ నల్లని పయోధరాలతో వానసోనలు కురిపించే వర్షాకాలంలాగ అతనికి కనిపించింది అతనిని అనుసరిస్తూ ఆమె ఇలా అన్నది — 'మీరు వెళ్లిపోతున్నారు. అక్కడ దిగంతాలలో ఎందరో సౌభాగ్య మంజరులవంటి కామినులు ఉంటారు మీరు యౌవన కల్పవృక్షంవంటి వారు ఆ సౌభాగ్యమంజరులు మిమ్మల్ని కదలనీకుండా పెనవేసుకుంటారు.'

గుహసేనుడు మొదలే వియోగ తప్తుడు ప్రియురాలు ఈ మాటలు అనగానే అతనికి ఏమీ తోచలేదు తను పరస్త్రీలవలలో పడనని ఎంత చెప్పినా, ఎన్ని బాసలు చేసినా దేవస్మిత వినిపించుకోదు తండ్రి సంప్రదాయం ప్రకారం ద్వీపాంతర యాత్ర వెళ్లకపోతే బంధువులలో తల ఎత్తడం సాధ్యంకాదు ఏమీతోచక డోలావిలోల హృదయుడై ఆలోచిస్తూ ఉండిపోయాడు దేవస్మితకు మరొక ఆలోచన ఇద్దరినీ ఎప్పుడు నిద్ర తనఒడిలోకి తీసుకుందో తెలియదు.

ఇద్దరూ ఒకే కలగన్నారు కలలో పార్వతీసహితుడైన పరమేశ్వరుడు కనిపించాడు వరదుడైన ఆ దేవుడు వారిద్దరికీ చేరి ఒక ఎర్రతామరపూవు ఇచ్చాడు 'మీరు ఈ ఎర్రదామరను ఎప్పుడూ చేతిలో పట్టుకునివుండండి, మీరు ఎడబాటయి దూరంగా ఉన్నప్పుడు, మీలో ఎవరికైనా ఇతరత్ర అనురాగం కలిగిందా, మరొకరి చేతిలోని పూవు వాడిపోతుంది కలుగకపోతే వాడదు' అన్నాడు పరమేశ్వరుడు.

వారికి మెలకువ వచ్చింది. చూచుకోగా, చేతుల్లో వాడని ఎర్రదామరలున్నాయి. ఇద్దరూ ఆనందించారు దేవస్మిత ఎలాటి అనుమానాలులేక భర్తను ద్వీపాంతర వ్యాపారానికి అనుమతించింది

గుహసేనుడు ఒక మంచిదివాన తన స్నేహితులతోపాటు చాల సరకులతో ఓడ యెక్కి దిగంతాలకు పయనమయ్యాడు; కటాక్ష ద్వీపం చేరాడు, అక్కడ వ్యాపారం ఏరాళంగా చేశాడు అక్కడి వర్తకులతోను అతనికి బాగా పరిచయం ఏర్పడింది అతడు ఎప్పుడూ విడువకుండా ఎర్రదామరను పట్టుకొనివుండడం వారికి కుతూహలం

డాక్టర్ సలహాలు

తొలిగిన మోకాలు ఉపాస్థిని తీసి వెయ్యాలి

మోకాలులో ఉండే ఉపాస్థి తొలిగినప్పుడు దాన్ని తీసివేయడం మంచిది. తొలగకుండఉంటే తీసి వేయాల్సిన అవసరంలేదు. కొన్నిప్పుడు అది తొలిగిందో లేదో ఆపరేషన్ చేస్తేకానీ తెలీకపోవచ్చు. కానీ శస్త్రచికిత్స అవసరం అయినప్పుడు వైద్యునికి ఉపయోగించే కొన్ని సూచనలు ఉన్నాయి

ఒక్కొక మోకాలులో బంధించబడినట్టుండే రెండు ఉపాస్థిలు ఉంటాయి. ఒకటి బయటివైపుకి రెండోది లోపలివైపుకి ఉంటాయి లోపలివైపుకి ఉండే ఉపాస్థే తొలుగుతుంది. అలా అయినప్పుడు కాలికి బంధం వేసినట్లు అయి మనిషినడుస్తున్నట్లయితే ముందుకి పడిపోతాడు. అలా పట్టుకున్నప్పుడు మోకాలు ఝాడించడం వల్లకానీ, ఎవరైనా లాగడం వల్లకానీ సాధారణంగా యథాస్థితికివస్తుంది. అలా చేయడంవల్ల తొలగిన ఉపాస్థి యథాస్థానానికి వెళ్లి 'మామూలుగా కదలిక జరుగుతుంది.

ఉపాస్థి తొలగినప్పుడు కాలు జాపడం కష్టం. అయినా కొన్ని ఇతర పరిస్థితులుకూడా దీనికి కారణాలు కావచ్చు. సమకోణం



కన్నా ఎక్కువగా మోకాలుని వంచలేకపోతే దానికి ఉపాస్థి తొలగడం కాక మరేదో ఇతర కారణం ఉండి ఉండవచ్చు.

హెచ్ ఎల్ హెర్షెన్‌సోన్
(కాపీ రయిట్)

కరిగించింది. కాని అతడు పెద్ద శ్రేష్ఠి కావడంవల్ల ప్రశ్నించలేకపోయారు.

ఒకవాడు వర్తకులంతా మద్యపానం చేశారు. గుహసేనుడకూ మద్యపానం చేశాడు ఆ కైపులో వారికి యుక్తాయుక్తం తెలియలేదు అందువల్ల 'మీ చేతి ఎర్రదామర సంగతి ఏమిటండీ?' అని అడిగారు. మద్యపానమోహితులతో తనకు వాదులాడడం ఉచితం కాదనుకొని గుహసేనుడు ఎర్రదామర రహస్యం తెలిపాడు

యువకులైన వణిక్కుమారులకు ఇది ఉత్సా

...బృహత్కథామంజరి


ర్యంగా తోచింది. గుప్తసేనుని భార్యపేరు దేవస్మిత అని, తామ్రలిప్త స్వస్థలమని మొదలయిన వివరాలు తెలుసుకుని ఆమెను ప్రలోభపెట్టి ఆమె శీలాన్ని నాశం చేద్దామనే దురుద్దేశంతో తామ్రలిప్తకు రహస్యంగా బయలుదేరారు. తామ్రలిప్తచేరి గుప్తసేనుని ఇంటికోసం ఊరంతా గాలించారు. చివరకు ఇల్లు కనుగొన్నారు కాని, ఆమెను చూడడం, మాట్లాడడం, సరసాలాడడం ఎలాగో వారికి ఏమీ తోచలేదు అదే యోచిస్తూ తిరుగుతున్నారు.

వారికి ఒక విజనప్రదేశంలో ఒక ఆశ్రమం కనిపించింది. వారు ఆ ఆశ్రమానికి వెళ్లారు. అక్కడ ఒక వృద్ధ తాపసి కనబడింది. ఆమె పేరు యోగకరండిక వారు ఆమెకు నమస్కరించారు. ఆమె వారికి తనపై నమ్మకం కుదిరేట్టు చేసింది వారు తమ రాకకు కారణం ఆమెకు విన్నవించారు. ఆ వృద్ధ తపస్విని మంచిదికాదు మంత్రతంత్రాలు ప్రయోగించడంలో చతుర వారికి దేవస్మితను పొందడంలో సాహాయ్యం చేయాలనే బుద్ధి దానికి కలిగింది. వారితో ఇలా అన్నది:—

'గుహసేనుని ప్రియభార్య దేవస్మిత నాకు తెలిసినదే ఆమెను మీ వశం చేస్తాను నాకు సర్వవిజ్ఞానశాలిని అయిన శిష్యురాలు ఒకతె ఉంది దాని పేరు సిద్ధికరి. మంత్రతంత్రాలు ఎరిగినట్టిది. పూర్వం ఒకప్పుడు పాలితుడనే ఒక వర్తకుడు దేశాంతరంనుంచి వచ్చాడు సిద్ధికరి అతన్ని మోసగించి, అతని ధనం, మణులు, బంగారం, ముత్యాలు మొదలయినవన్నీ హరించి బయలుదేరింది ఆమె అంత సంపదా మోసుకొని భారంతో వంగి నడుస్తూపోతూ ఉంటే, ఒక శ్వపచుడైన దొంగ, ఆ డబ్బును హరిద్దామని ఆమె వెంటపడ్డాడు. వాడు క్రూరుడు, ధనం కోరుతున్నట్టివాడు. ఆమెను చంప దలం ఆసహించదలచాడు

'సిద్ధికరి ఈ సంగతి గ్రహించింది. ఆ ఆశపోతులో ఇలా అన్నది — అయ్యా, నా భర్త కోపిష్ఠి నన్ను ఇంటినుంచి వెళ్లగొట్టాడు నేను మరెవరినైనా శరణు పొందుదామని వచ్చాను. ఎవ్వరూ నాకు ఆశ్రయమివ్వలేదు ఇక మరణమే శరణ్యమని నిశ్చయించుకున్నాను. చాల దయగల వారుగదా మీరు! ఈ మర్రిచెట్టుకు ఒక తాడు కట్టిపెట్టండి నేను ఉరిపోసుకొని చస్తాను అంతటితో నా దుఃఖాగ్ని చల్లారుతుంది. ఇంతమాత్రం నాకు సహాయం చేయండి.'

'ఆమె మాటలకు ఆ దౌర్భాగ్యుడు చాల మురిసిపోయాడు, అప్రయత్నంగా డబ్బంతా దక్కుతుందని. ఆమె చెప్పినట్లే మర్రి



రంగులరాట్నం



ఇది కంగారూ విభాగానికి చెందింది. అయితే ఆస్ట్రేలియాలో కాక, ఉత్తర అమెరికాలో నివసిస్తుంది. $1\frac{1}{2}$ అడుగుల పొడవుతో, పిల్లిసైజులో ఉంటుంది. చెట్లమీద నివసించే దీనికి, కాళ్లతోకకూడా పట్టుకోడానికి, వీలుగా ఉంటాయి. పగలంతా విశ్రాంతి తీసికొని, రాత్రి వేట ఆరంభిస్తాయి. ఏదయినా సరే తినడానికి అభ్యంతరం లేదు. పళ్లు కాయలు, గింజలు, గుడ్లు,పక్షులు, పురుగులు –అన్నీ దీనికి ఇష్టమే.

దీనిపిల్లలు సుమారు 6–12 వరకు ఉంటాయి. బొత్తిగా అసహాయ స్థితిలోపుట్టి, తల్లి శరీరం మీదకి పాకి, ఒక సంచిలాటి దానిలోకి పోతాయి. ఆ సంచిలోనేతల్లి పాలు తాగుతాయి. అందులోనే కొంతకాలం ఎదిగి తల్లి శరీరం మీదనే ప్రాకుతుంటాయి. ఏ మాత్రం ప్రమాదం అనిపించినా, తల్లి 'సంచి'లోకి పారిపోతాయి.

ఆహారంగాను, చర్మంకోసమని, దీన్ని చాలమంది చంపుతారు. గుడ్లగూబలు, నక్కలు తోడేళ్ల లాటి జంతువులుకూడా దీన్ని చంపుతాయి.

అపోసంకు చిత్రమైన అలవాటు ఒకటి ఉంది. భయం వేసినప్పుడు ప్రమాదం గోచరించినప్పుడు, అకస్మాత్తుగా చచ్చినట్టు పడిపోతుంది. అయితే అది బూటకమో, చెయ్యాలనే చేస్తుందో, భయానికి హడలి అలా బిక్కచచ్చిపోతుందో కాని ఇది ఒక రక్షణ మార్గం అంటారు, అందుకే ప్రజల్లో 'అపోసం నాటకం' అనే నానుడి వచ్చింది!

—జమ్మి కోనేటిరావు

...బృహత్కథామంజరి

చెట్టుకొమ్మకు వెంటనే తాడు కట్టి, వేలాడవేసి 'అమ్మా, ఇదిగో తాడు సిద్ధంగా ఉంది. ఎక్కి త్వరగా ఉరి తగిలించుకో' అన్నాడు. ఆమె ఏమీ తెలియనట్టు 'నాకు ఉరి ఎలా తగిలించుకోవాలో తెలియదు. ఈ విషయంలో మీరు గురువులుగా ఉండి ఈ శిష్యురాలికి చూపండి' అని కోరింది.

'ఆ బుద్ధిలేనివాడు ఆమె మోసం గ్రహించలేకపోయాడు ధనాశతో ఆమెకు ఉరి పోసుకోడం నేర్పడానికి తాడు తన మెడచుట్టూ తగిలించుకొని 'ఇలా తగిలించుకోవమ్మా' అని అన్నాడు సిద్ధికరి అదను చూచి, వెంటనే ఆ దొంగవాళ్ళ్ల పట్టుకొని బలంగా లాగింది. వాడు ఉరి బిగిసి మరణించాడు. ఆమె ఒంటరిగా నడక సాగించింది

'పాలితుని అనుచరులు ఆమె కోసం గాలిస్తూవస్తున్నారు. వారిని ఆమె దూరం నుంచి చూచింది. పారిపోవడానికి దారిలేక పక్కనున్న పెద్ద చెట్టెక్కి దానికి అల్లుకున్న తీగలగుబురులో దాక్కుంది. ఇది పాలితుల అనుచరులలో ఒకడు కనిపెట్టాడు చెట్టెక్కి వెదుకుతుంటూ మెమ్మదిగా ఆమెవద్దకు చేరాడు.

'సిద్ధికరి మరొక యుక్తి చేసింది. 'అబ్బ! మీరే ఎక్కివచ్చారన్నమాట. ఎంత మేలయింది, నా దొరా! మీ కోసమేకదా ఇంతగా కష్టపడడం ఈ ధనమంతా మీదే తీసుకోండి. ఒక్క ముద్దు ఇవ్వండి' అన్నది ఆ వెర్రివాడు మోసపోయాడు. ఆ ప్రణయమంతా నిజమేననుకొని దానిని ముద్దుపెట్టుకొన్నాడు సిద్ధికరి వెంటనే అతని నాలుకను కొరికివేసింది వాడు లల్లా లల్లల్లా అని కేకలు వేస్తూ రక్తం కక్కుకుంటూ కిందపడ్డాడు కింద ఉన్న తక్కిన అనుచరులు 'వీడిని దయ్యం కొట్టింది లేకపోతే రక్తం కక్కుకుని ఎందుకు కిందికి పడుతాడు'' అని అనుకుంటూ భయపడి పరిగెత్తిపోయారు. సిద్ధికరి, అక్కడినుంచి నా ఆశ్రమం చేరింది వంచించి సంపాదించిన ఆ ధనమంతా నాకు అప్పగించింది.

'ఆ శిష్యురాలు చాల గట్టిది. ప్రపం

(63 వ పేజీ చూడండి)



గోళానికి రంధ్రం పొడిచేస్తే....

డాక్టర్ మహీధర నళినీమోహన్

[illegible] నుంచి [illegible] తమను చాలాకాలంగా వేధిస్తున్న ఒక సందేహాన్ని తీర్చవలసిందిగా కోరుతూ ఉత్తరం వ్రాశారు అది ఏమిటంటే—

"భూమి గుండ్రంగా ఉంది దానిపైన ఏదో ఒక బిందువును తీసుకుని, ఆ బిందువునుండి భూకేంద్రం గుండా వెనుక పక్కకు సొరంగం తవ్వడం సాధ్యమా? ఆవిధంగా తవ్వడం సాధ్యమైతే, ఏదో ఒక పక్కనుంచి ఆ సొరంగంలో ఒక వస్తువును వేస్తే ఆ వస్తువు గతి ఏమవుతుంది? సొరంగం మధ్యలో, అనగా సొరంగం చేయకమునుపు గరిమనాభి ఉండే స్థలంలో ఆగిపోతుందా? లేక రెండో పక్కనుండి దూసుకుని అమితవేగంతో అనంత విశ్వంలోకి వెళ్ళిపోతుందా? లేక ఆవిధంగా సొరంగం తవ్వితే భూమి తునాతునకలై పోయే ప్రమాదం ఉందా?

"ఈ సందేహాన్ని ఒకరిద్దరితో చెప్పగా వారు దానిని పిచ్చి వెధవ ప్రశ్నకింద కొట్టి పారేశారు ఈ సందేహాన్ని మీరు నివృత్తి చేయగలరని నమ్ముతున్నాను ఆంధ్ర సచిత్ర వారపత్రిక, తదితర పత్రికలలో పడుతూవుండే మీ వైజ్ఞానిక వ్యాసాలు ఉత్సుకతతో పఠించే చాలామంది పాఠకులలో నేనూ ఒకడిని"

సమాధానం

ఈ పాఠకుడు అడిగినది పిచ్చి ప్రశ్న ఏమీ కాదు చాలా తెలివైన ప్రశ్న ఈ సందేహం ఇది వరకో చాలా మందికే కలిగింది దానికి శాస్త్రజ్ఞులు సమాధానమున్నా చెప్పేరు హేతువాదాన్ని అనుసరించి ఈ ప్రశ్నకు సమాధానం ఏమిటో చూద్దాం


అటువంటి సొరంగం త[illegible] సాధ్యమా అని మొదటి ప్రశ్న దీనికి సమాధానం చెప్పవలసిన వారు భూగర్భ శాస్త్రజ్ఞులు ఇటువంటి సొరంగం తవ్వడం అసాధ్యమని నా అభిప్రాయం ఎందుకంటె

భూమిలోకి తవ్వుకుంటూ వెడితే అంతకంతకు వేడిమి అధికాధికం అవుతూ ఉంటుంది ఇంకా తవ్వుకుంటూ వెడితే ఉష్ణోగ్రత అంతకంతకు హెచ్చి, ఆఖరికి రాళ్ళు, లోహాలూ కూడా కరిగిపోయే స్థితి వస్తుంది అంతవేడిని తట్టుకుని సొరంగం తవ్వగల సాధనం ఉండాలి

భూగోళానికి మధ్యలో సుమారు రెండువేల మైళ్ళ మందాన కరిగిన రకరకాల లోహాలు, ముఖ్యంగా ఇనుము, ఉండి ఉంటుందని శాస్త్రజ్ఞుల విశ్వాసం అంతవేడిని తట్టుకుని రంధ్రం చేయగల సాధనం ఉన్నప్పటికీ ద్రవంలో రంధ్రం ఎల్లా నిలుస్తుంది? కరిగిన లోహ శిలాద్రవాలు సొరంగాన్ని మూసి వెయ్యకుండా భూమికి ఈ వైపునుంచి ఆ వైపుకి గొట్టం ఏదైనా అమర్చాలి ఇక్కడ మరో ఇబ్బంది ఉంది భూమికి మధ్యలో ఖాళీస్థలం ఉంటే భూమికి నచ్చదు గురుత్వాకర్షణ వల్ల నలుమూలలనుంచీ ద్రవ్యం భూకేంద్రం వైపుకి వచ్చి ఆ రంధ్రాన్ని పూడ్చివేయడానికి ప్రయత్నిస్తుంది వదరపు టంగుళానికి అనేక లక్షల పౌనుల ఒత్తిడితో నొక్కి వేస్తూ ఉంటే తట్టుకోగల బలమైన గొట్టం దింపాలి అంత వేడిలో కూడా కరిగిపోకుండా వంకర్లు పోకుండా నిలబడగల పదార్థంతో ఆ గొట్టాన్ని చేయాలి ఇటువంటి గొట్టం చేసి భూమిలోకి దించడం సాధ్యమవునా కాదా అన్న ప్రశ్నను ఇంజనీర్లను అడగాలి భవుతిక విజ్ఞాన శాస్త్రం అటువంటి సొరంగం ఏర్పరచడానికి అభ్యంతరాలు ఏమీ చెప్పదు

అటువంటి సొరంగం ఒకవేళ తయారు చేయగలిగితే భూమి తునాతునకలై పోతుందా అని మరొక ప్రశ్న అటువంటి ప్రమాద మేదీ జరగదు ప్రమాదం అంటూ జరిగితే భూమి కుంచించుకుని గొట్టాన్ని నలిపివేయడం, తద్వారా భూకంపాలు వంటివి రావడానికి అవకాశాలున్నాయి

నిజంగా అటువంటి సొరంగం తవ్వలేక పోయినప్పటికీ, అటువంటిది ఒకటి ఉందని వూహించుకుంటే ఏంపోయింది?



[illegible] అందులో ఒక వస్తువును జారవిడిస్తే ఏమవుతుంది అన్నది అసలు ప్రశ్న పాఠకుడు వూహించినట్లు అది భూకేంద్రం దగ్గర టక్కున ఆగిపోదు, రెండోవైపునుంచి బయటికి అమిత వేగంతో దూసుకుపోదు మరి ఏమవుతుంది? అసలో కండె లాగ ఆ వస్తువు ఆ సొరంగంలో అటునుంచి ఇటూ, ఇటునుంచి అటూ కదులుతూ ఉంటుంది సొరంగంలో గాలిగాని, ఘర్షణ నిచ్చే మరో పదార్థంగాని లేకపోతే, సొరంగం గోడలకు తగులుకోకపోతే అనంత కాలం అనంత పర్యాయములు ఆ వస్తువు ఆ సొరంగంలో అటునుంచి ఇటూ, ఇటునుంచి అటూ వూగిసలాడుతూనే ఉంటుంది!

పరిశోధన చేసి చూడకుండానే ఈ సంగతి ఎలా తెలిసింది అని కొందరు పాఠకులకు సందేహం కలుగవచ్చు పెద్ద క్రర బంతికి సరిగ్గా ఇల్లాగే ఇటువైపునుంచి అటువైపుకి సొరంగంలా చేసి, అందులోనుంచి ఒక చింతగింజను జారవిడిస్తే, రంధ్రంలో నుంచి జారి, రెండోవైపుకి వచ్చేసి కింద పడిపోతుందిగాని, అటూ ఇటూ వూగిసలాడదు కదా, మరి భూమి విషయంలో అయితే ఈ వూగిసలాటకు కారణం ఏమిటని కొందరు అడగ వచ్చు.

క్రరబంతికీ భూగోళానికీ సాపత్యం ఏమీ లేదు క్రరబంతికిగల (గురుత్వ) ఆకర్షణ శక్తి భూగోళంతో పోల్చిచూస్తే స్వల్పాతి స్వల్పం క్రర బంతికి చేసిన సొరంగంలో నుంచి విడిచిన చింతగింజను లాగుతున్న ముఖ్యమైన శక్తి భూమ్యాకర్షణ బలీయమైన భూమికి దగ్గరలో విలుచని ఇటువంటి ప్రయోగం చేయబోతే కుదరదు ఇదే భూమికి చేసిన సొరంగం విషయంలో అయితే ఆకర్షించే ముఖ్యశక్తి భూమ్యాకర్షణే భూమికి దగ్గరలో అంత బలంగా ఆకర్షించగల వస్తువులు మరేవీ లేవు సూర్యుడు, చంద్రుడు, గ్రహాలూ చాలా దూరాలలో ఉండడంచేత భూసొరంగంలో నుంచి మనం జారవిడిచే వస్తువుమీద వాటి ప్రభావం ఇంచుమించు ఏమీలేదనే చెప్పుకోవాలి

వస్తువులన్నీ పరస్పరం ఆకర్షించుకుంటాయనీ, రెండువస్తువులమధ్య దూరం మీద, ఆ వస్తువులలోని ద్రవ్యరాశిమీద, ఈ ఆకర్షణశక్తి ఆధారపడి ఉంటుందని న్యూటన్ తన విశ్వవిఖ్యాత గురుత్వాకర్షణ సిద్ధాంతాన్ని పతిపాదించాడు

పరస్పరాకర్షణశక్తి =

G × (మొదటి వస్తువులోని ద్రవ్యరాశి) × (రెండవవస్తువులోని ద్రవ్యరాశి) ÷ (దూరము × దూరము)

అని సమీకరణం రూపంలో దానిని వ్రాస్తారు. ఇందులో G అనేది ఒక స్థిరమైన సంఖ్య దీనినిబట్టి ఆ రెండు వస్తువుల మధ్య దూరం తగ్గినకొద్దీ పరస్పరాకర్షణ పెరుగుతుంది అని తెలుస్తోంది. అయితే భూసొరంగంలో ఎడిచిపెట్టిన వస్తువు భూకేంద్రం వైపుకి వెడుతూవుంటే, రెండు వస్తువుల మధ్యదూరము తగ్గిపోతోందిగనుక పరస్పరాకర్షణ అంతకంతకు పెరిగిపోతుందనీ, కేంద్రం

దగ్గర అత్యధికమైన శక్తితో [illegible] కుంటాయనీ అనుకోకూడదు సుమా! ఈ పొరపాటు చాలామంది చేస్తూ ఉంటారు భూసొరంగంలో "క" అనే బిందువు దగ్గర ప్రవేశించినప్పుడు భూమి ఆ వస్తువును అత్యధికశక్తితో తన కేంద్రంవైపు లాక్కుంటుంది. భూకేంద్రం "చ"వైపు వెడుతున్నకొద్దీ ఆకర్షణ క్రమక్రమంగా తగ్గి, సరిగ్గా కేంద్రం దగ్గర అసలు ఆకర్షణే ఉండదు మళ్ళీ "చ" నుంచి "ట" వైపువెడుతున్న కొద్దీ ఆకర్షణశక్తి అంతకంతకు పెరుగుతుంది ఇది ఇల్లా ఎందుకు అవుతుందో తెలుసుకోగోరే వారికోసం చిన్న వివరణ వస్తువు భూకేంద్రం "చ" దగ్గరఉంది అనుకుందాం ఆ వస్తువును అన్ని వైపులనుంచి భూమి లోని ద్రవ్యం ఆకర్షిస్తోంది కదా! భూమి వంకర టింకరలులేని చక్కని గోళం అనుకుంటే భూకేంద్రం దగ్గరనున్న వస్తువుమీద ఆకర్షణ అన్ని వైపులకూ సమానంగా ఉంటుంది కనుక ఆ శక్తులన్నీ ఒకదానికొకటి చెల్లు అందుచేత "చ" దగ్గర ఆకర్షణశక్తి శూన్యం

ఇది అర్థమైతే సొరంగంలో విడిచిన వస్తువు ఏ విధంగా ప్రయాణం చేస్తుందో తెలుసుకుదాం


"క" దగ్గర జారవిడిచిన వస్తువును భూమి తన కేంద్రం "చ" వైపు బలంగా ఆకర్షించడంచేత ఆవస్తువు భూకేంద్రదిశలో కదిలి, అంతకంతకువేగం పుంజుకుని, కేంద్రం దగ్గర అత్యంత వేగంతో కదులుతూ ఉంటుంది "చ" దగ్గర ఆకర్షణఏమీ లేకపోయినా అంతకుముందే ఆవస్తువుకి ఉన్న వేగపు వూపులో ముందుకి సాగిపోతూ ఉంటుంది

ఆవస్తువు భూకేంద్రాన్నిదాటి "ట"వైపు అడుగువేయగానే భూమిమళ్ళీ దానిని తన కేంద్రం వైపు లాగడం మొదలు పెడుతూంది ఇంతవరకూ వేగం హెచ్చడానికి కారణమైన భూమ్యాకర్షణ ఇప్పుడు గమనానికి వ్యతిరేక దిశన పనిచేస్తూ దాని వేగాన్ని తగ్గించడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది వస్తువు కేంద్రాన్ని వదిలి "ట" వైపు వెడుతున్న కొద్దీ, [illegible] దాని వేగం అంతకంతకూ తగ్గిపోతూ ఉంటుంది. ఆఖరికి "ట" దగ్గరకు వచ్చేసరికి ఆవస్తువు వేగం బాగా సన్నగిల్లి ఆగిపోతుంది!

ఆగిపోయిన ఆవస్తువు భూకేంద్రం వైపు వెనుకకు మళ్ళీ ప్రయాణం మొదలు పెడుతుంది. "చ" దగ్గర అత్యంత వేగంతో ప్రయాణం చేసి "క" దగ్గరకు వచ్చేసరికి ఆగిపోతుంది ఈవిధంగా ఆ వస్తువు "క—ట"ల మధ్య నిర్విరామంగా ముందు వెనుకలకు ప్రయాణాలు చేస్తూనే ఉంటుంది

ఉయ్యాల వూపి వదిలేస్తే ఏం జరుగుతుందో మనకందరకూ అనుభవమే

"క" దాకాలాగి ఉయ్యాలను వదిలేస్తే రెండో వైపు "ట" దాకా వెళ్ళిఆగి, మళ్ళీ వెనక్కి "క"దాకా వచ్చి, ఆగి మళ్ళీ ఎదరకు సాగుతుంది మధ్యలో "చ" దగ్గరదాని వేగం అత్యధికంగా ఉంటుంది భూసొరంగంలో విడిచిన వస్తువుకీ, ఈ ఉయ్యాలకీ చాలా దగ్గర పోలి ఉంది ఒకసారి వూపి వదిలేసిన ఈ ఉయ్యాల కొంతసేపు వూగి ఆఖరికి ఆగిపోవడానికి గాలితోడి ఘర్షణ, గొలుసులు బిగించిన చోట ఘర్షణ కారణాలు ఈరెండు ఘర్షణలూ లేకపోతే వూపివదిలిన ఉయ్యాల ఎప్పటికీ ఆగిపోకుండా వూగుతూనే ఉంటుంది



భూమికి తవ్విన సొరంగంలోకి కాలుజారి ఎవరైనా పడిపోయాడనుకుందాం "క" దగ్గరబయల్దేరిన మనిషి సుమారు 21 నిమిషాలలో భూకేంద్రాన్ని చేరుకుంటాడు అక్కడ అతడి వేగం సెకనుకి సుమారు 7 కిలోమీటర్లు ఉంటుంది "క" నుంచి "ట" దగ్గరకకు వెళ్ళడానికి సుమారు 42 నిమిషాలు పడుతుంది మళ్ళీ "క" దగ్గరకు తిరిగి రావడానికి మరో 42 నిమిషాలు పడుతుంది కనుక కాలుజారిపడిపోయిన వ్యక్తిని 84 నిమిషాల తరువాత ఆ సొరంగం దగ్గర అతని స్నేహితులు నిలుచుని చెయ్యి అందించి పైకిలాగెయ్యడానికి అవకాశాలు లేకపోలేదు ఎవరూ ధైర్యం చేసి చెయ్యి అందించకపోతే అతడు అల్లాగ వూగిసలాడుతూనే ఉంటాడు ●

మతద్వేషాలు దారుణ హత్యలు



వి.ఎస్. సుక్థాంకర్

'దీన్! దీన్! దీన్! దీన్' ఈ అరుపులని విని ఉరగం గ్రామం పరిసరాలలోని గుడిసెలలో ఉండేవారు అదిరిపడ్డారు.

అది 1886.

సుమారు ఇరవయిమంది చేతుల్లో బాగాలు పట్టుకుని గుడిసెల మీదికి దాడి చేస్తున్నారు.

వారి లక్ష్యం ఆ గుడిసెలలో ప్రత్యేకంగా ఒక గుడిసె.

వారి వాలకం చూస్తే ఏదో దారుణ కృత్యానికి పాల్పడ్డారని తెలుస్తూనే ఉంది. వారి గుండెల్లో కూడా వారి చేతుల్లోని బాగడాలవంటి కోపాగ్నులు ధగ ధగ మంటూ వ్యాయనిపించి ఉంటుంది చూసినవారికి.

కుట్టి కరియన్ ఒక కర్షకుడు. చెరుమా కులానికి చెందినవాడు ఆరోజు పొలం పని పూర్తి చేసుకుని, భార్య, నలుగురు పిల్లలతో కలిసి భోజనం చేసి, తమలపాకు నములుతూ కూర్చుని . భార్యతో కులాసాగా కబుర్లు చెబుతున్నాడు. భార్య ఉయ్యాలలోని బిడ్డని ఊపుతూ జోల పాడుతోంది. తక్కిన నలుగురు పిల్లలూ ఆడుకుంటున్నారు నిజంగా, సుఖసంసారం అంటే కుట్టీకరయన్‌దే, అనిపిస్తుంది ఈ దృశ్యాన్ని చూసినవారికి మలబారుల్లో ఇంత ఆనందంగా జీవించే పేద రయితు లెందరు ఉంటారు!

ఈ సుఖ శాంతిమయమయిన - వాతావరణం ఎంతోకాలం నిలవలేదు అనతి దూరం నుంచే 'దీన్! దీన్!' అనే కేకలు వినిపించాయి వారికి.

'అయ్యో! మాపిళ్లలు వస్తున్నారు! మాపిళ్లలు వస్తున్నారు!' అని కేకవేసింది కుట్టి భార్య తలుపులోనించి బయటికి తొంగిచూసి.

'మాపిళ్లలా! అయ్యో!' కుట్టి కూడా భయపడ్డాడు 'వాళ్ళు వట్టి రాక్షసులు!'

తన ఎనిమిదేళ్ల కొడుకుని పక్కవాళ్ల వాళ్ల వద్దకి వెళ్లి సహాయం కోరమని పంపించాడు ఆ పిల్లవాడు ఒక్క ఉరుకులో బయటికి పరిగెత్తాడు


కుట్టి, అతనిభార్య తమ గుడిసె తలుపు

వేసుకుని లోపలి దీపాలు ఆర్పేసుకున్నారు. కాని అదే సమయానికి మాపిళ్ళలు అక్కడికి వచ్చేశారు. ఒక్క త్పటిలో తలుపుని విరక్కొట్టారు.

వారి చేతుల్లో బాగడా లేకాక కత్తులు కూడా తళతళ మెరిశాయి. కుట్టి, అతని భార్య, ఉయ్యాలలో ఉన్న వారి బిడ్డ వాటికి ఆహుతి అయ్యారు. తక్కిన ముగ్గురు పిల్లలూ అటక మీదకి ఎక్కి దాక్కున్నారు. కత్తివేటుని తప్పించుకున్నారు కాని పాపం, ప్రాణాలని దక్కించుకోలేక పోయారు. మాపిళ్ళ దండు గుడిసెకి నిప్పంటించి మరీ వెళ్ళిపోయారు. ముగ్గురు పిల్లలూ సజీవంగా దహనం అయిపోయారు.

తమ బీభత్స కృత్యాన్ని పూర్తి చేసిన తర్వాత మాపిళ్ళలు అంతకి కొంత దూరంలో ఉన్న ఒక నంబూద్రి బ్రాహ్మణుని ఇంట్లో చొరబడి తమ మీద శత్రువులు దండు ఎత్తుతారేమోనని ఎదురు చూడటం మొదలు పెట్టారు.

ఆ వేళాకోళం...



ఈ దండెత్తడం మర్నాటి దాకా జరగలేదు. దండెత్తింది ఎవరో కాదు, రాజభటులు.

జరిగిన యుద్ధంలో ఇంట్లో ఉన్న పన్నెండుమంది చనిపోయారు.

రాజభట దళం రాకముందే కొందరు తప్పించుకున్నారు కాని వారిని తర్వాత వెతికి పట్టుకున్నారు.

కింది న్యాయస్థానంలో జరిగిన విచారణలో వీరి పయి హత్యానేరం ఆరోపించి రుజువు చేశారు. వారి అప్పీలుని మదరాసు హైకోర్టు విచారించింది; గ్రాంట్ జడ్జిగారు తమ తీర్పులో ఇలా రాశారు—

'2 మే, 1886 నాటి రాత్రి కుట్టి కరియన్, అతని భార్య పిల్లలని హత్య చేసిన నేరం పయి ఈ ముగ్గురు (మాపిళ్ళ) నేరస్థులకి కింది కోర్టులో మరణదండన వెయ్యబడింది. హత్య జరిగినదనే విషయం గురించి సందేహమే లేదు.

'కుట్టి కరియన్ ముందు మహమ్మదీయ మతం పుచ్చుకుని తిరిగి తన అసలు మతానికి మారిపోయాడు. ఈ మార్పుని ఆ ప్రాంతంలోని ఇతర (మాపిళ్ళ) మహమ్మదీయులు సహించలేక పోయారు. అతన్ని శిక్షించాలనుకున్నారు. 22 మే నాడు అతని గుడిసెమీద దండెత్తారు. కుట్టి కరియన్ అతని భార్య, నలుగురు సంతానం — వీరి మరణానికి కారకులయ్యారు.'

'ప్రాసిక్యూషన్ తరఫువారు ఈ ముగ్గురు ముద్దాయిలు హత్యలో పాల్గొన్నప్పటికీ నంబూద్రి బ్రాహ్మణుని ఇంట్లో దాక్కుని రాజభటులతో యుద్ధం చెయ్యలేదని అంటున్నారు. తోటివారికి ద్రోహం చేశారని కూడా అంటున్నారు.

'జరిగినదంతా పరిశీలిస్తే ముద్దాయిలు తమ ఒక కార్యంద్వారా ప్రాణాలనయినా లెక్కచెయ్యకుండా తమ కర్తవ్యాన్ని నిర్వహించటానికి సిద్ధమయ్యారని తెలుస్తోంది. వీర మరణానికి వారు వెనుతియ్యలేదు.

'అందుచేత వీరిమీద ప్రాసిక్యూషన్ వారు మోపిన నేరాన్ని నేను నేరంగా పరిగణించలేకపోతున్నాను. కింది కోర్టులో విధించిన శిక్షని రద్దుచేసి అందరినీ వదలవలసిందిగా ఆర్డరు జారీ చేస్తున్నాను...' ●

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

ఎమ్. కె. డి, మద్రాసు

నా కిట్టే కోపం వస్తుంది ఎలా కోపం తెచ్చుకోకుండా ఉండాలో తెలియడం లేదు.

"చిటుకుమన్నను కిన్క చెందునచ్చోట
నెటు సమకూరునే యింతి! కోరికలు!"

ఆడవాళ్ళు కోరికలు తీర్చుకోవాలంటే కోపాన్ని కూడా కంట్రోలు చెయ్యక తప్పదు.

వి. వి. ఆర్, తిరుపతి

చావు తప్పనప్పు డీ బ్రతుకెందుకు?

పుట్టుట కల్గినవారికి గిట్టుట లేకుండు టెట్లు? మహానుభావా?

ఎ. వి. ఆర్, నిడుబ్రోలు

మా తల్లిగారు పోయి ఆరునెలలు దాటిపోయినా, ఆవిడని ఆడిపోసుకోవడం మానడం లేదు నాభార్య, ఏం చేయాలి?

చనిపోయిన వారిని గురించి చెడు మాట్లాడడం అనవసరం అని గ్రహించకల్గేపాటి యింగితజ్ఞానం కూడా లేని స్త్రీని ఎవరూ ఏమీ చేయలేరు భగవంతుడే తోపించాలి

బి. కె. ఆర్, రాజమండ్రి

ఏదైనా చదవడం అంటే విసుగు నాకు...

అలా అంటే ఎలాగ? శరీరానికి వ్యాయామం ఎంత అవసరమో మెదడుకి చదవడం అంత అవసరం

ఎల్. వి. వి. పి, విశాఖపట్నం

ఇప్పటికి ఆరుసార్లు పరీక్షకి కట్టాను. నా భయమే నా పరీక్ష పోయేలా చేస్తోంది దీనికి విరుగుడేదైనా సూచించ కలరా?

ప్రపంచంలోని ఆయుధాలన్నీ కూర్చినా భయస్థుణ్ణి సాయుధుణ్ణి చేయలేవు!

ఎమ్. ఎల్, రాజమండ్రి

ఎంత తల బద్దలు కొట్టుకున్నా చదివినవి జ్ఞాపకానికి రావు ఏం దారి?

ఇంట్లో ఎవరూ లేనప్పుడు తలుపు బాది ఏం ప్రయోజనం తమ్ముడూ!

పి కె. కె, కాకినాడ

ఆడవాళ్ళు అందంగా అబలలుగా ఉండాలంటారు. మళ్లీ జీవన పోరాటంలో ధైర్యంగా పాల్గొనాలంటారు ఎలా సాధ్యం అవుతుంది అక్కయ్యా?

అందుకే ఆడవాళ్ళు 'కోరుకోతగ్గ అసహాయులు'గా ఉండాలంటాను!

ఎస్. బి ఎల్. రాజమండ్రి

ఒంట్లో బాగులేదంటూనే వైద్యుని దగ్గరకి రారు. పోనీ అని మాట్లాడక ఊరుకోరు ఒకొక్కప్పుడు కోపం కూడా వస్తుంది నాకు – ఏం చేయాలో తోచక.

వస్తుండగానే రోగాన్ని ఎదుర్కోవాలి అశ్రద్ధ చేయడం వివేకం కాదని మీ వారికి నచ్చచెప్పండి

గ్రి. కె ఎమ్, ఖర్గపూరు

గయ్యాళి పెళ్లాలతో విధిలేక వేగే పెద్దమనిషి పెళ్లికి వెడితే ఆతని మనస్సు ఎలా ఉంటుంది?

'ఆహా మన విషమ పరిస్థితిలోకి కళ్ళు మూసుకుని ఇంకో ప్రాణి పడుతున్నాడు కదా!' అని సంతోషంగా ఉంటుందను కుంటాను

బి. ఆర్. పి, విశాఖపట్నం

జనుల అవసరాలు తీర్చే నియంత ఉంటే మనమంతా హాయిగా బ్రతక వచ్చునేమో అనిపిస్తోంది – ఇప్పటి దారుణ పరిస్థితులు చూస్తుంటే. మీరే మంటారు?

'అవసరం' అన్నది మానవుని స్వేచ్ఛకి హద్దులు కల్పిస్తుంది. దీన్నే తన వాదనకి అనువుగా వాడుకుంటాడు నియంత, దీన్నే మతంగా స్వీకరిస్తాడు బానిస! మనకా స్థితి వద్దు. దానికంటే ఈ దారుణ పరిస్థితులే నయం

వి. ఎస్ ఎల్, విజయనగరం

పని చేయాలంటే బద్ధకం ఎప్పటి కప్పుడే తప్పించుకోవాలని పిస్తుంది

అదుపులో పనిచేయక మూల్గు వాడికి పని ఎక్కువ కావడమే కాక కష్టమూ నష్టమూ కూడా ఇనుమడిస్తాయి సోదరీ

వి. ఎల్ బి, విశాఖపట్నం

ఈ జీవితానికి ద్వారాలు ఏమిటి రామలక్ష్మిగారూ

ఈ జీవితమే ఒక మజిలీ అయితే దానికి పగలూ, రాత్రే ద్వారాలు లక్ష్మీబాయిగారూ!

ఎ. ఆర్. కె, కలకత్తా

ఏ పుస్తకాలు చదవాలి? ఏవి మానాలి? ఇప్పుడొస్తున్న పుస్తకాల వరదలో తేల్చుకోవడం కష్టంగా ఉంది.

అందుకే ఆర్ డబ్ల్యు ఎమర్సన్ అనే అమెరికను రచయిత 'ఒక సంవత్సరం దాటని ఏ పుస్తకం చదవద్దు' అన్నాడు

సి. హెచ్. ఎన్. ఆర్, మద్రాసు

ఇంత మంది ఇలా రాసేస్తున్నా రెందుకు?

ఎంత లేదన్నా అచ్చులో పేరు అందంగా ఉంటుంది! ఏంలేకున్నా పుస్తకం పుస్తకమే కదా మరి!

ఎమ్. ఎస్. ఆర్, రాయిచూరు

కాలం గడిచిపోతుంది ... ఎలా ఆపడం దీన్ని?

కాలం గడిచిపోతోందంటారా? లేదు లేదు. కాలం ఆగిపోతుంది మనం గడిచిపోతున్నాం

వి. ఎస్. ఎల్, మద్రాసు

కొందరు జంతువులని స్నేహితులకన్నా ఎక్కువగా చూస్తారెందుకు?

అవి ప్రశ్నించవు! విమర్శించవు!

ఆర్. జి. ఆర్, విశాఖపట్నం

నాకు ఎంత చేసినా లెక్కలు రావడం లేదు. దీనికేదైనా సులభ మార్గం ఉంటుందా అని?

ఉండదు 300 బి సి లోనే టోలమీ ప్రభుస్వ గ్రీకుశాస్త్రవేత్త యూక్లిడ్‌ని అడిగాడట 'దీనికేదైనా దగ్గర దోవ ఉందా?' అని దానికా పెద్దమనిషి "జామెట్రీకి రాజమార్గం లేదు ప్రభూ!" అన్నాట్ట! ఏం చేస్తాం చెప్పండి?

ఎస్, ఆర్, కామారెడ్డి

రాజాజీగారి రామాయణం, భారతం తెలుగులో అనువదించారు కదా? అవి ఎక్కడ దొరుకుతాయో తెలియడం లేదు. మీరు చెప్పకలరా అక్కయ్యా

శ్రీ యు కాళిదాసు 12 తంబుచెట్టి వీధి, మద్రాసు—1 అనే చిరునామాకు వ్రాయి తమ్ముడూ, ఆయనే వాటిని ప్రచురించారు

పి. జి, కరీంనగరు

మహాత్మాగాంధీవలె శాంతి స్థాపనకై పాటుపడే వారెవరైనా ఉన్నారా?

ఆ! వారినీ మొన్ననే హత్య చేశారు మళ్లీ ఎవరో తలెత్తక తప్పదు

వి. ఆర్ ఎమ్, విశాఖపట్నం

ఈ రాజకీయ చతురంగంవల్ల ప్రయోజనం ఏమిటి?

పర్వతాలు ప్రసవ వేదన పడుతున్నాయి కొంచెం ఓపిక పట్టండి ఏ ఎలకపిల్లో పుట్టక పోదు!



జరిగిన కథ

రామచంద్రమీద అభిమానం పెంచుకుంటుంది వారిజ రామచంద్ర కూడా వారిజని ప్రేమిస్తాడు గతంలో ఆమె ఒక సినిమాతార అని తెలుసుకున్న తర్వాత అతను గుండెరాయి చేసుకుంటాడు వారిజ వృత్తిని విరమించుకుని తన కుటుంబానికి సాయ పడుతూవుంటుంది అయినా ఆమెమీద అందరికీ దురభిమానమే. వారిజ చెల్లెలు లత రామచంద్రానికి లతతో వివాహం ంపోతుంది లతలో వారిజని వూహించుకున్న రామచంద్ర ఆశలు ఫలించవు వారిజ రామచంద్ర నామస్మరణంతో అదే వూర్లో టీచరుగా ఉద్యోగం సంపాదించుకుంటుంది. రామ చంద్ర తన చెల్లెలు లతనే వివాహమాడాడని తెలుసుకున్న వారిజ ఆ వూరు వచ్చినందుకు చింతిస్తుంది రామచంద్ర అభిమతానికి ఎదురు తిరుగుతూ ప్రవర్తించ సాగింది లత.

11

లత వచ్చి తనను డబ్బడిగి తీసికెళ్ళిన దగ్గర్నుంచీ మనసంతా చికాకయిపోయింది వారిజకు— యాంత్రికంగా వంట ముగించింది— కానీ అన్నం తినాలనిపించలేదు— రెండు అరటిపళ్ళు తిని మంచినీళ్ళుతాగి కళ్ళు మూసుకుపడుకుంది—

కనీసం చెల్లెలైనా సుఖంగా ఉందికదా అనుకొంటూంటే ఇదేమిటి?

తన ముందున్న అదృష్టాన్ని గుర్తించ లేని చెల్లెలి మూర్ఖత్వానికి బాధపడాలా? లేక తను సర్వస్వంగా ప్రేమిస్తోన్న రామచంద్ర జీవితంలో సుఖం పూర్తిగా కరువయిందని బాధపడాలా?

ఆలోచనలతో తల పగిలిపోతుండగా ఎప్పటికో నిద్ర పట్టింది వారిజకి—

తలుపు తట్తోన్న చప్పుడుకి మెలకువ వచ్చి భయంగా 'ఎవరూ?' అంది—

'నేను రామచంద్రని—'

తలుపవతలినుంచి వచ్చింది సమాధానం —రామచంద్ర కంఠస్వరం గుర్తించింది వారిజ— గబుక్కున మంచం దిగి తలుపు తెరిచింది—

వేళగాని వేళ తన ఇంటికి! ఎందుకూ? —వణికిపోయింది వారిజ—రేగిపోయిన జుట్టూ—ఎంతో అలసటగా ఉన్న ముఖం —ఎర్రబడిన ముఖం— ఇంకా అదురుతోన్న పెదవులూ—ఇంట్లో ఏదో గొడవ జరిగి ఉంటుందని భయం వేసింది వారిజకి—

'నాకు బాగా ఆకలేస్తోంది' — అన్నం పెట్టు—'

పసిపిల్లవాడు తల్లి నడిగినట్లు అడిగాడు రామచంద్ర—

తల్లడిల్లిపోయింది వారిజ—

'రండి—' అంటూ వంటింట్లో పీట వాల్చి కంచం పెట్టింది—అన్నం చూసింది— చల్లారిపోయిఉంది—

'అయ్యో! చప్పచల్లారిపోయింది—ఒక్క క్షణం ఆగండి—గబగబ వండేస్తాను—'

'నాకు ఆకలి దహించుకుపోతోంది — ఇంక ఆగలేను—మధ్యాహ్నం కూడా సరిగా తినలేదు. చల్లగానో, వేడిగానో, ఎలాగో పెట్టెయ్యి త్వరగా—'

'అయ్యో! నా ఒక్కదాని కోసమేకదా అని దోసకాయ పచ్చడి నూరుకున్నాను— కూరేమీ చెయ్యలేదు — గబగబ ఇన్ని బంగాళదుంపలు వేయించనా?'

'అబ్బ! ఆకలి మండుతోందంటే వడ్డించకుండా అదీ, ఇదీ మాట్లాడతావేం? ఏం లేకపోతే చారు పొయ్యి — అదీ లేదా?'

కసురుకున్నాడు కోపంగా—

గబగబ ఆ చల్లారిపోయిన అన్నమే వడ్డించి, పచ్చడివేసి, నేతిగిన్నె దగ్గర పెట్టింది—

స్టౌ వెలిగించి, మూకుడు పెట్టి అందులో నూనె పోసింది.

'ఏమిటీ?'

'ఏం లేదు – రెండు అప్పడాలు వేయిస్తున్నాను నంజుకోడానికైనా పనికొస్తాయి—'

త్వరత్వరగా నాలుగు అప్పడాలు వేయించి వేరే పళ్ళెంలో పెట్టి రామచంద్ర కంచం పక్కన పెట్టింది వారిజ—

ఆవురావురుమంటూ పచ్చడి మెతుకులు తింటోన్న రామచంద్రను చూస్తోంటే కడుపులో చెయ్యిపెట్టి తిప్పినట్లయింది వారిజకి – ఇంత ఆకలితో భర్తను ఉంచగలిగిందా లత? అయ్యో! తన కెలాచెప్తే, అర్థమవుతుంది?

'పాపిష్ఠిదాన్ని—పచ్చడితో మీకు అన్నం

పెట్టాను—పెరుగుకూడా లేదు—మజ్జిగ—'

నొచ్చుకుంటూ అంది—

'పరమ పుణ్యాత్మురాలివి— రెండురోజుల తర్వాత సుఖంగా తిన్నాను—నిజం — పప్పూ, కూరలూ, పచ్చళ్ళూ, అన్నీ ఉన్నా ఇంత తృప్తిగా ఎన్నడూ తినలేదు—'

వెనుకటి చిరాకంతా నశించి చిరునవ్వు నవ్వగల్గుతున్న అతని మనసుకు తిరిగి చికాకు కలిగించటం ఇష్టంలేక పోయినా చెల్లెలికోసం— తన స్వామికోసం— ఇద్దరి సుఖంకోసం—సాహసించి అంది—

'ఏం? ఇల్లాలు వండి వడ్డిస్తోంటే తృప్తి ఎందుకు లేకపోవాలి?'

చూస్తోండగానే రామచంద్ర ముఖంలో చిరునవ్వు చెరిగిపోయి కఠినంగా మారింది—

ఆ కాఠిన్యం వారిజకు బాగా అనుభవమే!

అతి సుకుమారమైన అతని మనసు బలమైన ఎదురుదెబ్బ తగిలీ తగలగానే వజ్రంకంటే కఠోరమవుతుంది —

'ఇల్లాలు ఇల్లా!— నీకు అర్థంకాదు వారిజా! నాకు ఎంతక్షోభ కలగకపోతే—'

బాధగా తల చేతులలో అదుముకుని వాక్యం ఆపేశాడు—

వారిజకు తెలుసా సంగతి—తననుతాను నిగ్రహించుకోవటానికి ఎంతో ప్రయత్నించి ఏ విధంగానూ నెగ్గలేని అవాంఛనీయ పరిస్థితులేర్పడటం వల్లనే తన దగ్గరకి రామచంద్ర వచ్చాడని—

అనునయంగా అడిగింది—

'ఏం జరిగింది?'

ఉద్రేకంగా అన్నాడు రామచంద్ర—

'పిచ్చి—సినిమాలపిచ్చి—వచ్చిన సినిమా కంతా వేలంవెర్రిగా బయలుదేరటమే! ఇంట్లో పరిస్థితీ, వెనుకాముందూ గమనింపూ—ఏంలేదు—ఇవాళ సినిమాకి వెళ్తానంది—వద్దన్నాను— డబ్బు లేదన్నాను—ఆ మాత్రం అర్థం చేసుకోవద్దూ? చివరకు పక్కింటి నాగమణిని ముష్టడిగి చూసివచ్చింది—ఇంత తేలిక మనిషిని ఎలా ప్రేమించటం? నాకు కష్టంతోచి అన్నం వద్దని పడుకుంటే తను తినేసి పడుకుంది—ఇలాంటి మూర్ఖురాలిని ఎలా భార్యగా అంగీకరించటం?' నావల్లకాదు—ఈ క్షోభ నేను పడలేను—'

విభ్రాంత పోయింది వారిజ—లత అడగగానే తను డబ్బియ్యటం ఇంతకు తెచ్చింది—ఒకరకంగా ఈ అనర్థాని కంతకూ తనే బాధ్యురాలు—

'నువ్వు చూడు! నాకోసం ఇంత రాత్రి వేళ ఇప్పటికిప్పుడు అన్నం వండటానికి తయారయ్యావు— వేడిగా ఉండాలని పచ్చడితో పెట్టవలసివచ్చినందుకు విలవిలలాడిపోయావు—నేను కడుపునిండా తిన్నానంటే నీ కళ్ళు తృప్తితో వెలిగిపోయాయి—ఈ ప్రేమలో వెయ్యోవంతు లేదే ఆ మూర్ఖురాలికి?'

వణికిపోయింది వారిజ—

'ఛీ! ఛీ! మీ ఇల్లాలిని నాతో పోలుస్తున్నారా? నేనెక్కడ? ఆవిడెక్కడ?'

'అవును—ఇద్దరికీ పోలికేలేదు — అసలు నేను లత నెందుకు చేసుకున్నానో తెలుసా?



లతలో నీ పోలికలు చూసి—నువ్వు చూస్తే ఆశ్చర్యపోతావు—మీ ఇద్దరూ అక్క చెల్లెళ్లలా ఉంటారు—లతలో నీ ఛాయలు కనిపించగానే పేరాసతో పప్పేసుకున్నాను — రూపంలో నీ పోలికకాని, స్వభావంలో మాత్రం నీకు వ్యతిరేకం ఆవిడ నువ్వు ప్రేమ మూర్తివి — అది మానవరూపంలో ఉన్న పశువు—'

తీవ్ర సంక్షోభంతో తల్లడిల్లిపోయింది వారిజ మనసు — తనపట్ల రామచంద్రకు గల ప్రేమకు పొంగిపోవాలా ? చెల్లెలి జీవితం ఇలా భగ్నమవుతున్నందుకు కృంగిపోవాలా?

'నేను ప్రేమమూర్తినా? మీ ఇల్లాలు పశువా? మీ విచక్షణా జ్ఞానమంతా ఏమయిందీ? అసలు మీ ఇల్లాలితో నన్ను పోల్చడానికి మీకు నోరెలా వచ్చిందీ? నేనెవరిని? పురిస్త్రాకుని— చెత్తడబ్బాని —పెంటకుప్పని — పదిమంది చీకిన గుజ్జు లేని పండుని...'

'అబ్బా ! ఆపు వారిజా !...'

'ఆపను—వినండి — ఈ ప్రేమమూర్తి ప్రేమగాథలు—ఒక చిత్రంలో హీరోయిన్ వేషంకోసం మొదట ప్రొడ్యూసర్ దగ్గరా, ఆ తర్వాత డైరక్టర్ దగ్గరా గడ్డి తిప్పుకుని తైతక్కలాడాను — అర్జంటుగా కొత్త మోడల్ కారు కొనుక్కోవలిసివస్తే అందుకు రెండువేల తక్కువయితే వాటి కోసం ఒక రాత్రంతా ఒక నరపశువుతో సమంగా తాగి తందనాలాడాను— మనసులో ఏమాత్రం ప్రేమ లేకపోయినా, అడిగిన వాళ్లకల్లా శరీరాన్ని అప్పజెప్పేసాను— అనేక మొహమాటాలకోసం—నన్ను రక్కినా పీకినా భరించాను — పశువుల్లా ప్రవర్తించినా సహించాను...'

'వారిజా ! వద్దు చెప్పకు. '

'వినండి—అధమత్వపు అంచు కనుక్కున్నాను — నైచ్యానికి పరమావధి అనుభవించాను — పాశవిక శక్తులపాలం విపమూసాను—మనుష్యుల్లో అధముల్ని, నీచుల్ని, మృగాల్ని, చూసి చూసి అలిసిపోయిన నాకు, మీ మానవత్వం అపురూపంగా కనిపించింది — ప్రేమకోసం పరితపించి పరితపించి అగ్నివేడుపులమంచి, లాలస, కాంక్ష, తృష్ణ కాంమూ, ఛీత్కారమూ తప్ప ప్రేమానుభావానికి నోచుకోని నాకు మీ నిర్మల ప్రేమ దివ్యపరమయింది.

మీ ఇల్లాలు — అయినింటపుట్టి అపురూపంగా పెరిగిన కన్య—లోకంలోని మాలిన్యం ఏమాత్రమూ అంటని తరుణ పుష్పం—జీవితమంటే ఏమిటో తెలియని ముగ్ధ—నాలా ఎలా ఆలోచిస్తుంది? ఆలోచించాలని మీరు కోరటం మాత్రం ఏం న్యాయం ?'

'ఆపు వారిజా! లోకంలో మిగిలిన అందరు స్త్రీలూమాత్రం అయినింటపుట్టి అపురూపంగా పెరిగినవారు కారా? అందరూ లత ఉన్నంత మూర్ఖంగా ఉన్నారా?'

'ఎవరి లోపాలు వాళ్లవి—మనిషన్నాక లోపంలేకుండా ఉంటారా? ఆవిడ మూర్ఖురాలు—మరి మీ వివేక మేమయింది? నన్ను ప్రేమించారు—నాతో కొంత ప్రేమానుభవముంది మీకు— ఆ అనుభవంతో, అనుక్షణమూ నాతో పోల్చుకుని లతపట్ల అసంతృప్తి పెంచుకుంటున్నారు మీరు—మీ ఇల్లాలుకూడా మీలాగే మరొకరితో మిమ్మల్ని పోల్చుకుంటూ అసంతృప్తి పెంచుకుంటే మీరు భరించగలరా?'

అదిరి పడ్డాడు రామచంద్ర— అతని సర్వ శరీరమూ వణికింది —

'అంతరాత్మచావని మనుష్యులు కనుక చెప్తున్నాను— దోషం మీ ఇల్లాలిలోకంటె మీలోనే ఉంది—ఆవిడకసలు ప్రేమంటేనే తెలియదు—మరి మీరు ఆవిడను ప్రేమించలేక పోవటమేకాక మరొకరిని ప్రేమిస్తున్నారు—'

'వారిజా!—నేను లతని ప్రేమించడానికి



ప్రయత్నించాను కాని '

'నమ్మను—ప్రేమ ఉన్నచోట లోపాలు ఇలా భూతద్దాల లోంచి కనపడవు— వెళ్లండి—ఆవిడను గాఢంగా ప్రేమించండి. ఈ పాపిష్ఠిదానితో ఈ పరమ దౌర్భాగ్యురాలితో ఈ జీవచ్ఛవంతో—మీ శ్రీమతిని పోల్చకండి—ఆవిడను ఆవిడగా స్వీకరించి ప్రేమించండి—'

'వారిజా!'

'వెంటనే వెళ్లండి—నాకు మీ మీద ఉన్న ఆరాధనా భావమంతా మీ ఔన్నత్యం వల్లనే! ఆస్థాయిలోంచి దిగివచ్చాక మీరు నాకేమీకారు—'

'ఇప్పుడు నాలో అల్పత్వం ఏం చూశావు వారిజా!'

'మీ అంతరాత్మ నడగండి—వేళకానివేళ ఇక్కడికి రావటం—ఇంత రాత్రయినా నాతో కబుర్లుచెప్తూ ఇక్కడుండటం—ఇదంతా! మనసులో— ఏమీ లేకుండనేనా? మీ శ్రీమతి సరిగ్గా ఇలాగే ప్రవర్తించి నేను నిష్కల్మషు రాలినంటే మీరు నమ్మగలరా? వెళ్లండి—మిమ్మల్ని ఆరాధిస్తూ బ్రతుకుతున్నాను—నా ఆరాధనా మూర్తికి మసి పూయకండి—'

పాలిపోయిన ముఖంతో వణుకుతోన్న శరీరంతో గబగబ అడుగులువేస్తూ వెళ్లిపోయాడు రామచంద్ర—

పక్కమీద వాలి గుండెలు పగిలేలా ఏడ్చింది వారిజ—

* * *

లత కాపురాని కొచ్చాక కల్యాణి రామచంద్ర దగ్గిరికి రాలేదు—కొత్త దంపతుల మధ్య తనెందుకని ఊరుకుంది — రెండు నెలలు గడిచాక ఒకసారి కొడుకునూ, కోడలినీ చూడాలనివచ్చింది—లత చిన్నపిల్ల —సంసారం నిర్వహించుకోవటం చేతవవుతుందో? చేత కావటంలేదో? 'ఏమైనా తెలియకపోతే నేర్పించాలి' అనుకొంది—

తల్లిదగ్గర్నుండి వస్తున్నట్లు ఉత్తరం రాగానే లతతో సాధ్యమైనంత మృదువుగా అన్నాడు రామచంద్ర—

'రాక రాక మా అమ్మ వస్తోంది లతా ! ఇక్కడ ఉండటానికి రావటంలేదు— మన సంసారం ఎలా ఉందో చూడటానికి వస్తోంది—అమ్మ ఉన్న నాలుగురోజులయినా రుసరుసలూ బుసబుసలూ లేకుండా నవ్వుతూ



క్రొత్త సూత్రం 'గోయా' మీరు కనే కలల టాల్కం పౌడరు. తక్కిన టాల్కులకన్న ఇది తేలికగా, ఆహ్లాదకరంగా ఉంటుంది.

ఇంకను, 'గోయా' నిపుణుల సాయంతో, సుగంధితమైన యీ "టాల్కు" రోజంతా హాయినిస్తూ, పరిమళాన్ని వెదజల్లుతుంది.

అందాల 'బ్లాక్ రోస్' పువ్వుల్లా పరిమళించే గార్డీనియా, 'మురిపించే' 'పాస్‌పోర్ట్'లలో మీక్కావలసింది ఎన్నుకోండి!

జ్ఞాపకం వుంచుకోండి. ఈ మూడున్నూ చిరకాలం మన్నే కొత్త నిడుపాటి డబ్బాలలో దొరుకుతున్నాయి.

అట్లాంటిస్ (ఈస్ట్) లిమిటెడ్

(ఇంగ్లండ్‌లో స్థాపితం)



క్రొత్త సూత్రంతో తయారయిన ఆహ్లాకరమైన టాల్కు ఇప్పుడు పొడుగైన క్రొత్త టిన్నులలో లభిస్తోంది

GC-5 TB


సుగంధముతో కూడిన టాల్కు తయారుచేసే

గోయా

పారిస్

లండన్

న్యూయార్క్



చీకటి కడుపున...

ఉండు—'

లత ముఖం ముడుచుకొంది—

'అంటే, అక్కడికి నేను రోజూ కస్సుబుస్సు లాడుతుంటే మీరు పరమశాంతమూర్తులయి సహిస్తున్నారు కదూ!'

'అది కాదు—ఊరికే హెచ్చరిస్తున్నాను—అమ్మ ఎదురుగా గొడవలు జరిగితే బాగుండదు చూడు! అమ్మ ఒకవేళ ఏదైనా మందలించినా, నువ్వు కాస్త నెమ్మదిగా సర్దుకుపో!'

'అలాగే! నోరు మూసుకుంటాను—చచ్చినట్టు—ఎవడికోసం!'

మూలిగింది లత—

కొంత మనసు చివుక్కుమన్నా లత అంగీకరించిందే చాలనుకున్నాడు రామచంద్ర—

'చూడు, అమ్మ ఉన్న నాలుగురోజులూ, సినిమాలంటూ బయల్దేరకూ!'

'ఏం? సినిమాలు చూడకూడదా? అది మహాపాపమా!?'

ఆవిడ అత్తగారయినంతమాత్రాన ఆవిడ నించోమన్నట్లు నించుని కూర్చోమన్నట్లు కూచోవాలా? ఇంకా ఎంతకాలం బాబూ? ఈ మూఢ సంప్రదాయాలు? ఈ కోడం[?] ట్రికాలనుంచి స్త్రీ జాతికి విముక్తి లేదా?'

భరించరాని కోపం తనను క్రమ్ముకొంటున్నా నిగ్రహించుకొని అనునయంగా అన్నాడు రామచంద్ర—

'ఎల్లకాలం మనదగ్గర ఉండదుగా! రెండురోజులో మహా అయితే నాలుగు రోజులో! ఆ కొంచెం రోజులూ కాస్త నిగ్రహించుకోలేవా?'

'ఏమో బాబూ! నేనూ మామూలు మనిషినే! నన్ను రాసి రంపాన పెడితే మాత్రం సహించలేను—'

'రాసి రంపాన ఎందుకు పెడుతుంది లతా? ఆవిడ నీకు శత్రువా? ప్రతిదీ మన మనసులో ఉంటుంది—లోపాలు ఎంచాలనుకొంటే అన్నీ లోపాలుగానే కనిపిస్తాయి — సర్దుకుపోదామనుకుంటే ఎలా అయినా సర్దుకుపోవచ్చు—'

'సర్దుకుపోక నేనేం జగడమాడటానికి కుర్చున్నానా?'

రామచంద్ర ఇంకేం చెప్పలేకపోయాడు.

కల్యాణి తెలివిగలది— రామచంద్ర వడిలిపోయిన ముఖం చూస్తేనే లతా రామచంద్రలు తాను ఆశించినంత అన్యోన్యంగా లేరని అర్థమయిపోయింది — కట్నకానుకల నాశించకుండా అందచందాలున్న పిల్లను చేసుకున్నా కొడుకు జీవితంలో సుఖం లేదా? కారణ మేమిటి?

'కులాసాగా ఉన్నావా అమ్మా!'

లతను ఆదరంగా పలకరించింది కల్యాణి—

'నాకేం? బాగానే ఉన్నాను—'

తన సహజధోరణిలోనే అంది లత—

'ఈ అమ్మాయికి మాట తీరిక తెలీదు—ఆ కారణంగానే, రామచంద్ర మనసు కష్టపెట్టుకుంటున్నాడా? 'చూడాలి—' తనలో తను అనుకొంది—

అన్నం తింటూ లత వంటను చాలా మెచ్చుకుంది కల్యాణి —

మనసులోనే తల్లి సభ్యతకు ఆనందించాడు రామచంద్ర—ఏవిధంగానూ ఏ ప్రత్యేకతా లేని తన వంటను మెచ్చుకొంటూన్న అత్తగారిని తెల్లబోయిచూసి 'వెర్రిబాగులది' అనుకుంది లత—

అందరూ తినగా చాలా అన్నం మిగిలిపోయింది— ఆ అన్నమంతా పనిమనిషికిచ్చేసింది లత — తెల్లబోయింది కళ్యాణి— పనిమనిషి ఎదురుగా లతనేమీ అనలేక అది వెళ్ళగానే లతతో ఆదరంగా 'అన్నమంతా పనిమనిషి కిచ్చేసావేమ్మా!' అంది—

'ఏంచెయ్యాలి మరి?' ఆశ్చర్యంగా అడిగింది లత—

'ప్రొద్దున్న వండిన అన్నం సాయంకాలానికేం పాడవుతుంది? మనమే పెట్టుకునే వాళ్ళంగా! అంత తినలేనప్పుడు కాస్త చూసి బియ్యం పోసుకోవాలి కానీ, ఈ కరువురోజుల్లో అంతంత అన్నాలు పనివాళ్ళ కిచ్చుకుంటే ఎలా?'

'మేం ఇద్దరమే అయితే నాకు లెక్క సరిగ్గా తెలిసేది—మీరుకూడా రావటంతో లెక్క తెలీక పోసేసాను—'

చివుక్కుమంది కల్యాణికి — అయినా మామూలుగా నవ్వింది.

'నేను ఎంత తింటాననుకున్నావమ్మా! పోనీలే! అయిందేదో అయిపోయింది—ఇంకమీదట మిగులుతే పనివాళ్ళకియ్యకు—

పాయంత్రం పింబారోలోకి, మజ్జిగలోకి పెట్టుకోవచ్చు—'

'ఏమో బాబూ! తీరా ఒకమెతుకు తక్కువయితే! 'మాఅమ్మకి అన్నం తక్కువయింద'ని విా అబ్బాయి నన్ను తిట్టిపొయ్యరా? ప్రొద్దుటన్నం పాయంత్రం వడ్డిస్తే 'మా అమ్మకి పాడన్నం పెట్తావా?' అని ఇంతెత్తున లేవరా? ఎలా వేగాలో ఏవిటో?'

విట్టూర్చింది లత—

విర్ఘాంతపోయింది కల్యాణి—

రామచంద్ర సంగతి కల్యాణికి బాగా తెలును—అతడు తిట్టిపోస్తాడో పొయ్యడో ఎంతెత్తున లేస్తాడో అర్థం చేసుకోగలదు ఏవిటీ అమ్మాయి?

ఇంక మాటలు పెంచకుండా ఇవతలికొచ్చేసి కొడుకుతో పొలంగురించీ పంటల గురించీ కబుర్లలో పడిపోయింది—

మధ్యాహ్నం కాఫీవేళకి, కాఫీ తయారు చేసి అత్తగారి కందించింది లత—

చాలా స్ట్రాంగ్‌గాఉన్న ఆకాఫీ రుచి చూసి లోలోపల చాలా ఆశ్చర్యపోయింది కల్యాణి—

పామాన్య సంసారాల్లో ఇంతింత స్ట్రాంగ్ కాఫీలు తాగితే ఎలా? కాస్త వెనుకాముందూ చూసుకోవద్దూ?

కొంచెం పొందికగా ఉండమ'ని చెప్పాలను కొంది—

కానీ లత కష్టపడుతుందేమోనని స్పష్టంగా చెప్పలేక నెమ్మదిగా 'ఇంత స్ట్రాంగ్‌గానే తాగలేనమ్మా! కొంచెం లైట్‌గా ఇయ్యి—' అంది—

లత విరసనగా నవ్వి 'మా ఇంట్లో అందరికీ స్ట్రాంగ్‌గానే అలవాటు లైట్‌గా తాగలేం' అంది—

లత కంఠస్వరంలో వెటకారం కల్యాణి, హృదయాన్ని తాకింది— ఎంత నిగ్రహించుకున్నా రోషం అణగలేదు—

'ఇట్లాంటి అలవాట్లుండబట్టే గదా అతా దర్జాగా బ్రతికవలసిన సంసారం అలా చితికిపోయింది—'

తన వాళ్ళని అన్నందుకు లతకు ఉక్రోషం వచ్చింది—

'మా దురదృష్టంవల్ల మానాన్నగారికా పాడుబుద్ధులుపుట్టి చితికిపోయాం కాని, లేకిగా పైసా, పైసా కూడబెట్టి పైకి వచ్చిన సంసారంకాదు మాది—'

ఛెళ్ళున ముఖంమీద కొట్టినట్లు అలా సమాధానం చెప్తోన్న కోడలిని నిర్ఘాంతపోయి చూడటంతప్ప మరేంచెయ్యలేక పోయింది కల్యాణి— ఆవిడముఖం పాలిపోయింది— కోడలు తనను మాటలందని బాధకంటె, ఇట్లాంటి వ్యక్తితో రామచంద్ర సంసారంలో ఏం సుఖం పొందగలడనే వ్యథే ఎక్కువయింది కల్యాణికి—

త్రాగుతోన్న కాఫీ సగంలోవదిలి గ్లాసు క్రిందపెట్టి లేచాడు రామచంద్ర—

'పదమ్మా! నిన్ను వెంటనే రైలెక్కించి వస్తాను—ఇక్కడుండకు—'

'తొందరపడకు రామూ!' గాభరాగా అంది కల్యాణి—

'నీకు తెలీదమ్మా! ఈ ఇల్లు నీలాంటి మనుష్యులుండటానికి అనువయినది కాదు—చేసుకున్నాను కనుక నాకు తప్పదు—వెంటనే బయలుదేరు—నువ్వు ఉంటానన్నా నేను ఉండనివ్వను—'

కల్యాణి కళ్ళలో గిర్రున నీళ్ళు తిరిగాయి—

రామచంద్ర 'రిక్షా తెస్తాను—'అంటూ బయటికి వెళ్ళిపోయాడు—

కళ్ళు తుడుచుకుని మౌనంగా పెట్టె సర్దుకో సాగింది కల్యాణి—

'నే నిప్పుడేమంత లేనిమాట లన్నానని ఇలా అర్థాంతరంగా ప్రయాణ మవ్వటానికి?'

నిష్ఠూరంగా అంది లత—

'నాకు తెలీదమ్మా! వాడు రమ్మంటే వచ్చాను—వాడు వెళ్ళమంటేవెళ్తున్నాను—'



పొడిగా అంది కల్యాణి—

అంతలో రామచంద్ర రిక్షాతెచ్చాడు—

'నా మీద అత్తగారిని వెళ్ళగొట్టిందనే నింద వెయ్యటానికి కాకపోతే, ఏవిటి అర్థాంతరపు ప్రయాణం? నేను పొమ్మన్నానా?'

కూచుని రాగాలు మొదలు పెట్టింది లత—

మూఢు రాలిలా వింటున్న కల్యాణి చెయ్యి పట్టుకుని 'పదమ్మా! ఆలోచిస్తే పిచ్చెక్కుతుంది—రా! త్వరగా వెళ్దాం—' అంటూ ఒక రకంగా లాక్కుని తీసికెళ్ళి రిక్షాలో కూర్చోబెట్టాడు రామచంద్ర—

దారి పొడుగునా రిక్షాలో కళ్ళు తుడుచుకుంటోనే ఉంది కల్యాణి — తను పట్టుబట్టకపోతే రామచంద్ర లతను చేసుకునేవాడు కాడు — లత తండ్రి ఎంతటి బలహీనుడో తల్లి ఎంతటి సంస్కారహీనురాలో తనకు తెలుసు-అయినా వాళ్ళ సంతానాన్ని తన కోడలిగా గ్రహించటానికి సిద్ధపడింది- అనుభవాలు పాఠాలు నేర్పవా? అనుకొంది — ఒకప్పుడు బ్రతికి చెడిన ఆ కుటుంబాన్ని చూసి జాలితో కదిలిపోయింది—కొంతమంది మూర్ఖులు జీవితంలో ఎన్ని అనుభవాలు పొందినా ఏ పాఠమూ నేర్చుకోలేరనేది ఇప్పుడే అర్థమయింది—

ఒక రకంగా ఇంతటి అనర్థానికీ తనే కారణం!

కుమిలిపోయింది కల్యాణి మనసు—

రైల్లో కూర్చున్నాక కల్యాణి గొంతు పెగుల్చుకుని అంది—


'ఎవరో ఒకరు సర్దుకోకపోతే సంసారాలు సాగవు—కాస్త నువ్వయినా సర్దుకుపో బాబూ!'

ఈ మాటలంటూంటే బాధతో కల్యాణి మనసు మూలిగింది—తన కొడుకుది సహజంగా సర్దుకుపోయే తత్వమే! ఇంకా సర్దుకుపొమ్మని చెప్పట మేమిటీ?

రామచంద్ర ఏ సమాధానమూ చెప్పలేదు— బాధగా తలవంచుకున్నాడు— అతని ముఖంలో స్పష్టంగా ప్రతిఫలించిన వేదన కల్యాణి హృదయాన్ని కోసింది—

రైలు కదిలింది—

(ఇంకా వుంది)


ఉ షా
స్వదేశంలో, విదేశాలలో చాలా
హెచ్చుగా అమ్మబడుతూన్న
భారతదేశపు పంకా
ఉషా కొనుక్కోండి దాన్ని మించిన పంకా లేదు

శ్రీరాముడు అడవికి వెళ్ళతున్నప్పుడు అతని పరిచయం వున్న అందరూ అంతులేని భక్తిని ప్రదర్శించారు

సాటిలేని పతిభక్తి గల సీతాదేవి భర్తను విడిచి వుండలేక అతని వెంట అరణ్యనివాసానికి సిద్ధపడింది

పరిమితిలేని భ్రాతృభక్తి గల లక్ష్మణుడు రాముని కంటికి రెప్పగా కాపాడుటకు అతన్ని వెంబడించాడు

అవ్యాజమైన ప్రభుభక్తి గల అయోధ్యా ప్రజలు వద్దని ఎంత చెప్పినా వినకుండా గంగాతీరం వరకూ అతన్ని అనుసరించారు

అయితే గుహుని భక్తి—అన్నింటినీ మించినది

భార్యకూ, సోదరుడికీ రాముని యెడల భక్తి చూపడం ధర్మం; ఉత్తమప్రభువు రాజ్యాన్ని విడిచి పెట్టి వెళ్లిపోతుండగా, ఆయన యెడల ఆదరాభిమానాలు చూపడం ప్రజల విధి

గుహుడు కోసల దేశీయుడుకాడు ఆ రాజ్యంతో అతని కెలాటి సంబంధమూలేదు లేకపోయినా, అతడు ఎక్కువ భక్తిని ప్రకటించడం విశేషం కాదా మరి?

గుహుడు బెస్తకులానికి చెందినా—విద్య లేకపోయినా ఉచితజ్ఞుడు, లోకజ్ఞుడు శ్రీరాముడి బాహుపరాక్రమం, రాక్షస సంహారం, యాగరక్షణ, పరశురామ గర్వాపహరణం, పితృవాక్య పరిపాలన మున్నగు ఉత్తమ గుణాలను ఇదివరకే విన్నాడాయన! రాముని యెడల అపారమైన భక్తితాత్పర్యాలు ఏర్పడ్డాయి

సుమంత్రుడు సారధ్యం చేస్తున్న రథం తన పల్లెకు రాగానే ఎంతో ఆప్యాయంతో ఎదురుగా పోయి స్వాగతం యిచ్చాడు ఆతిధ్యం యిచ్చాడు జరిగిన సంఘటలకు పరితపించాడు తన అధికారంలో వున్న ఆ ప్రాంతాన్ని పాలిస్తూ, అక్కడే వుండి పోవాలని ప్రాధేయపడ్డాడు అప్పటికి సాయంకాలమైంది

ఆ రాత్రి అక్కడే వుండడానికి తగిన సదుపాయాలు కనుసన్నలో జరిగించాడు

శ్రీరాముని నిశ్చయం తెలుసుకున్న తర్వాత ఇక లాభం లేదని, సీతా లక్ష్మణులతో కూడా అతనిని మర్నాడు ఉదయం తన జలయానం మూలంగా గంగను దాటించడానికి నిశ్చయించాడు

"అయ్యా! గుహుడా! మమ్మల్ని నది దాటించ



డానికి నీకు పడవకు కేవు ఈయాలి గదా! నా దగ్గర డబ్బేమీలేదు లక్ష్మణుని యందు వాకుండే వాత్సల్యాన్నే నీకు ఆ రుసుంగా ఇస్తున్నాను దీన్నే, గ్రహించు" అన్నాడు రాముడు

"నాకు కావలసినది కూడా అదెన్నిధే" అన్నాడు గుహుడు.


అతని ఆనందానికి హద్దు లేదు.

పడవ యెక్కేముందు గుహుడు శ్రీరాముని పాదాలు కడిగి, పూజించి, భక్తిని ప్రకటించి మరీ పడవ నెక్కించాడు

ఈ సంఘటనను ఒక మహాకవి ఇలా చమత్కరించాడు


"గుహుడు శ్రీరాముని కాళ్ళు కడుగుతూ అన్నాడట!—స్వామీ! నీ పాదరేవుణు తాకి ఒకరాయి నాతిగా మారిపోయిందట! రాతి కంటే మృదువైన నా పడవ నీ పాదధూళి స్పర్శచే ఏ యువతిగా అయినా మారిపోతే—నా జీవనోపాధి పోతుంది. అందువల్ల ఏ ధూళీ లేకుండా నీ పాదాలు పరిశుభ్రంగా కడుగుతున్నాను ఇక నాకు ఎలాటి భీతి ఉండదు—అని.

ఈ సంఘటన వల్ల గుహుని భయమూ పోయింది. అతనికి రావలసిన కేవూ లభించింది ●



శిలా విగ్రహం

మహేష్



ముగురుమూర్ఖులు

'ఇందిరాగాంధీ' అంటూ, చంచ్రలావు వెళ్లేసరికి చిదంబరం చూడామణితో యేదో చెబుతున్నాడు.

'ఇందిరాగాంధీ యింత బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు' అని నిరాశను వెలిబుచ్చాడు చిదంబరం.

'ఇంతకీ యిప్పుడేమైందని' ప్రశ్నించాడు చంచ్రలావు

'ఏమైందేమిటి ? మొట్టమొదటి పధానమంత్రి నెహ్రూ 'ఆరాం హరామ్‌హై' అనే నినాదాన్ని యిచ్చాడు తరువాత శాస్త్రి అధికారంలోనికి రాగానే 'జై జవాన్ జై కిసాన్' నినాదాన్ని యిచ్చాడు ఇందిరా గాంధీ యింతవరకు తన నినాదాన్ని యివ్వకపోవడం చాలా విచారించవలసిన విషయం. 'లూప్ యిజ్ ది ఓన్లీ హోప్' వంటి యేదోఒక నినాదాన్ని దేశానికి అందించాలిగాని ప్రధానమంత్రిణి అయిన తరువాత ఊరుకోకూడదు' అని సమాధానం యిచ్చాడు చిదంబరం

'అవునవును. అటువంటి నినాదంవల్ల చాలా ఉపయోగంకూడా ఉంది. ఆమె మురాకు చెందిన వాళ్లంతా ఆ నినాదంతోనే ఒకరినొకరు అభినందించుకోవచ్చును. ఆ నినాదాన్ని గట్టిగా అరచేవాళ్లంతా తన మురావాళ్లేనని నినాదాన్ని యిచ్చిన ఆసామీ గుర్తించడానికి అవకాశం కూడా ఉంది '

'ఏదైనా పదవిలోనికి రాగానే వెంటనే చేయవలసినవి రెండుపనులు ఉన్నాయి. ఒకటి యేదో ఒకనినాదాన్ని గట్టిగా యివ్వడం, రెండవది తన శిలావిగ్రహాన్ని స్థాపించుకోవడం. ఈ రెండింటిలో యేమాత్రం అశ్రద్ధ చూపించినా, అది అధికార దుర్వినియోగమే అవుతుంది' అని తేల్చేశాడు చూడామణి

'శిలావిగ్రహం' అనగానే యీ మధ్యను జరిగిన సంగతి ఒకటి నాకు గుర్తుకు వచ్చింది' అని అన్నాడు చంచ్రలావు

'ఏమిటా సంగతి?' అని చిదంబరం, చూడామణి ఒకేసారి ప్రశ్నించగా చంచ్రలావు చెప్పడం ప్రారంభించాడు

'ఒకఊళ్లో ముదరయ్య అనే ఆసామీ ఉన్నాడు అతను యెన్నో సంవత్సరాలు కృషిచేసి చివరకు మున్సిపల్ చైర్మన్ కాగలిగాడు వెంటనే ముదరయ్య తన అంతరంగికులతో యిలాగ అన్నాడు

'నేను యెన్నో సంవత్సరాలుగా మీ అందరకు సేవ చేస్తున్నాను ఇప్పుడు మ్యునిసిపల్ చైర్మన్‌గా కూడా యెన్నిక అయ్యాను అందుచేత నా శిలావిగ్రహాన్ని స్థాపించకపోవడం మన గ్రామానికే చిన్నతనంగా ఉంది నాయకుల్ని గౌరవించడం మనఊరికి తెలియదు అనే అపఖ్యాతికూడా వస్తుంది కాబట్టి మీరందరూ కలిసి నా శిలావిగ్రహాన్ని స్థాపిస్తే బాగా ఉంటుంది' అని తన కోరికను వెలిబుచ్చాడు ముదరయ్య

ముదరయ్య చెప్పింది చాలా సబబుగా ఉందని అందరూ అంగీకరించారు అయితే దానికి కావలసిన డబ్బు యెక్కడినుంచి వస్తుందని వారికి సందేహం కలిగింది. దానికి ముదరయ్య యిలాగ అన్నాడు

'ముందుగా మీరందరూ ముదరయ్య శిలా విగ్రహస్థాపక సంఘంగా యేర్పడి ఊళ్లో చందాలు వసూలుచేయండి నేను యింకా అయిదేళ్లపాటు అధికారంలో

ఉంటాననీ అందరకూ తెలుసును కాబట్టి చందాలు సులువుగానే వసూలు అవుతాయి ఒకానొకవేళ వసూలైనడబ్బు చాలకపోతే యేదో ఒకటి చేయవచ్చును

వెంటనే అక్కడచేరిన, ముదరయ్య శ్రేయస్సును కోరేవారూ, ముదరయ్యద్వారా తమ శ్రేయస్సును కోరుకొనేవారూ ఒక సంఘంగా యేర్పడ్డారు శిలా విగ్రహాన్ని యెక్కడ స్థాపించడం అనే సందేహం తరువాత వచ్చింది. ఒక్కొక్కరు ఒక్కొక్క స్థలాన్ని సూచించారు కాని అఖరుకు ఆ ఊళ్లో మూడు సినిమాహాళ్లు ఉన్న నాలుగురోడ్ల జంక్షనులో శిలా విగ్రహాన్ని నిలబెట్టి దానికి 'ముదరయ్యవెన్యూ' అని పేరు పెట్టడానికి అందరూ అంగీకరించారు

ముదరయ్య శిలావిగ్రహ స్థాపక సంఘం వారు ఒకనాడు చందాలు వసూలు చేయడానికి బయల్దేరారు మొట్టమొదట వారు ఒక సినిమాహాలు యజమాని వద్దకు వెళ్లారు. ఆయనకు, తమ ఆశయాన్ని వివరించి, ఉదారంగా చందా యివ్వమని కోరారు.

'చందా యివ్వడానికి నాకుయేవిూ అభ్యంతరంలేదు మా సినిమాహాలు తరపున నేను రెండువందల రూపాయలు చందా యిస్తాను అయితే దీనికి ఒకషరతు ఉంది విూరు స్థాపించబోయే శిలావిగ్రహం మా సినిమాహాలుకు వెళ్లమని చెబుతున్నట్లుగా చేయి మాహాలువైపుకు చూపిస్తుండాలి' అని తన షరతును వెల్లడించాడు సినిమాహాలు యజమాని

'సరే మీరుచెప్పిన విషయాన్ని గురించి ఆలోచిస్తామ'ని చెప్పి సంఘ సభ్యులు రెండవ సినిమాహాలు యజమాని వద్దకు వెళ్లారు మొదటి సినిమాహాలు యజమాని విధించిన షరతుసంగతి రెండవ సినిమాహాలు యజమానికి తెలిసింది అందుచేత అతనుకూడా అదేషరతు విధించాడు మూడవ సినిమాహాలు యజమానికూడా అదేమాట అన్నాడు

ఈ షరతులతో శిలావిగ్రహ స్థాపక సంఘంవారికి తల తిరిగిపోయింది

'పోనీ రెండు సినిమాహాళ్లవైపు రెండు చేతులు చాపినట్లుగా విగ్రహాన్ని పెట్టవచ్చును కాని మూడవహాలుమాట యెలాగ' అని అన్నాడు ఒక సభ్యుడు.

మన ముదరయ్య చిన్నప్పుడు భరత నాట్యం నేర్చుకొన్నాడటగదా! అందుచేత కృష్ణుని కాళాయమర్దన పోజులో కాలు యెత్తి మూడవ సినిమాహాలు వైపు చూపించవచ్చునని సలహాయిచ్చాడు మరో సభ్యుడు.

'కాలు మాసినిమాహాలువైపు చూపించకూడదు అలాగ కాలు చూపించితే మా సినిమాహాలుకు వెళ్లినవారిని తంతాననే అర్థం వస్తుంది కాబట్టి మాకు కాలు యెంతమాత్రం పనికిరాదు కుడిచెయ్యే మాకు కావాలి' అని ఖచ్చితంగా చెప్పాడు మూడవ సినిమాహాలు యజమాని

మిగిలిన యిద్దరూకూడా తమకు కుడిచెయ్యే కావాలన్నారు. ఈ పరిస్థితిలో యేమి చేయాలో సంఘం వారికి తెలియలేదు. మనిషికి మూడు కుడిచేతులు యెలాగ వస్తాయి? మూడు కుడిచేతులు ఉంటే మూడు యెడం చేతులు కూడా ఉండాలిగదా!

'ఒకానొకవేళ విగ్రహానికి అలాగ ఆరు చేతులు ఉన్నట్లయితే అది త్రినాథస్వామి విగ్రహం అని ప్రజలు అనుకొనే ప్రమాదం ఉంది అందులోనూ, మూడు దిక్కులనూ మూడు కుడిచేతులు చూపిస్తుంటే మూడు యెడంచేతుల మాటేమిటి?' అని తన సందేహాన్ని వెలిబుచ్చాడు మరొక సభ్యుడు.

'పోనీ, కుడిచేతిని వేలం వేద్దాం ఆ వేలంలో యే సినిమాహాలు యజమాని యెక్కువపాట పాడతాడో ఆ హాలువైపే కుడిచేతిని ఉంచుదాం' అని తన సలహాను యిచ్చాడు మరొక సభ్యుడు

'అలాగ చేయడంలో ఒకప్రమాదం ఉంది. మనదేశంలో ప్రతివిషయానికి ప్రతిరోజూ ఆందోళన జరుగుతూనే ఉంటుంది. అలాంటప్పుడు మిగిలిన సినిమాహాలు యజమానులిద్దరూ యేదోఒక ఆందోళన సందర్భంలో విగ్రహాన్ని బద్దలు కొట్టించేయడానికి అవకాశం ఉంది అందుచేత అందరకూ యిష్టం అయేటట్లుగానే విగ్రహం ఉండాలిగాని యెవరికీ కష్టాన్ని కలిగించకూడదు' అని స్పష్టంగా అన్నాడు ముదరయ్య

అప్పుడు ముదరయ్య శిలావిగ్రహ స్థాపక సంఘంవారు యీ సమస్యను పరిష్కరించడానికి ఒక ఉపసంఘాన్ని నియమించారు ఆ ఉపసంఘంవారు సినిమాహాలు యజమానులతో సంప్రదించి యీ దిగువ సూచనలను చేశారు.

1. శిలా విగ్రహానికి రెండు చేతులు మాత్రమే ఉండాలి

2. కుడిచెయ్యిచాపి అటువైపు వెళ్లమన్నట్లుగా సంజ్ఞచేస్తుండాలి.

3 యెడమ చెయ్యి మామూలుగానే ఉండాలి

4 శిలా విగ్రహాన్ని ఒక వేదికమీద స్థాపించాలి

5 ఆవేదిక భూమికి అంటుకొని ఉండకూడదు

6 ఆ వేదికను యెటువైపుకు కావలిస్తే అటువైపుకు తిప్పడానికి వీలుగా దిగువను చక్రాలు ఉండాలి

7 ఆ వేదికను యెవరూ తిప్పకుండా భూమికి గొండీలు బిగించి దానికి ఆరు తాళాలు వేయాలి.

8. అందులో మూడుతాళాలు మూడు సినిమాహాలు యజమానులదగ్గర ఉండాలి మిగిలిన మూడు తాళాలు సంఘ సభ్యుల దగ్గర ఉండాలి


9 శిలా విగ్రహం ఒక్కొక్కనెలలో ఒక్కొక్క సినిమాహాలు వైపు చెయ్యి చూపిస్తుండాలి

10 ప్రతినెలా ఫస్టుతారీఖున సినిమాహాలు యజమానులు సంఘసభ్యులు సమావేశమై తాళాలనుతీసి విగ్రహం తాలూకు దిక్కులను మారుస్తుండాలి

11 మొట్టమొదటినెల యేసినిమాహాలువైపుకు చెయ్యి చూపించేదీ లాటరీ ద్వారా తేల్చుకోవాలి

ఈ సూచనలు చాలా బాగున్నాయని ముదరయ్యతోసహా అందరూ అంగీకరించారు ఈసూచనల ప్రకారమే విగ్రహాన్ని స్థాపించారు.

'ఇప్పటికే చాలా ఆలస్యమైంద'ని చూడామణి లేవగానే మిగిలిన యిద్దరూ అతన్ని అనుసరించారు. ●



'మీనా' డీజల్ ఇంజన్

6 H P 650 R.P.M.

ఉత్పత్తిదారులు:—


శ్రీ తిరుమలై ఇంజనీరింగ్ కార్పొరేషన్,

191 శివాజి ఉద్యమ నగర్,

కొల్హాపూర్, (మహారాష్ట్ర)

ఆంధ్రప్రదేశ్‌లో జిల్లా వారీ ఏజెంట్లు కావాలి

వాయిదాల చెల్లింపు పై ట్రాన్సిస్టర్



రు 320/ విలువగల ప్రపంచ ప్రఖ్యాతిగల 'ఎస్కార్ట్' 3 బ్యాండ్ ఆల్ వరల్డ్ పోర్టబుల్ ట్రాన్సిస్టర్ నెలకు రు 10/- వంతున వాయిదాలపై చెల్లించి పొందండి ఇండియాలోని ప్రతి పట్నం/పల్లెలకు పంపెదము. వ్రాయండి

JAPAN AGENCIES, (AP 10)

Post Box 1194, Delhi-6

తెల్లవెంట్రుక లుండవు

పొగడడం మాకు ఇష్టం లేదు. "Palitari" ఆయుర్వేదిక్ సెంటెడ్ ఆయిల్ తెల్ల వెంట్రుకలను నల్లగా మార్చును. మొదట తెల్లవానిని నల్లవిగామార్చి, అటుపైన నల్లని వెంట్రుకలే వచ్చును ఈ ఆయిల్ జ్ఞాపకశక్తి, కంటిచూపు వృద్ధిపరచును లాభంపొందినవారు 1000 పైగా మాకు వ్రాసియున్నారు లాభం లేకున్న డబ్బు వాపసు ధర రు. 10/-

Sri Krishna Chandra Vaidya

(APH) P O Katrisarai (Gaya)

వారఫలం

17-5-1968 శుక్రవారం మొదలు 23-5-1968 గురువారం వరకు

మేషం: వ్యాపారంలో మీ ఆలోచనలకు తగిన అవకాశాలు లభిస్తాయి ప్రయాణాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. వారం ఆఖరులో అన్ని వ్యవహారాల్లోను చికాకులు యేర్పడతాయి మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది దైవకార్యాలు నెరవేరుతాయి

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉండదు బంధుమిత్రులను కల్సుకొంటారు

వృషభం వృత్తి వ్యాపారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి నూతన వ్యవహారాలు లాభదాయకంగా ఉంటాయి రావలసిన డబ్బు సమయానికి అందుతుంది ఉద్యోగంలో గౌరవ ప్రాబల్యాలు బాగా ఉంటాయి సజ్జన సాంగత్యం లభిస్తుంది

స్త్రీలకు — కుటుంబ కార్యక్రమాలు కొంచెం శ్రమ మీద నెరవేరతాయి సంతోషకరమైన వార్తలను వింటారు

మిధునం · ఏ పనైనా చేయడంకంటే పూరుకోవడమే మంచిదనే పరిస్థితి యేర్పడుతుంది వ్యాపారంలో యెవరినీ విశేషంగా నమ్మడం తగదు వారం మధ్యలో అనుకూల పరిస్థితి యేర్పడుతుంది విద్యా వైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణిస్తుంది మిత్రుల సహాయం లభిస్తుంది

స్త్రీలకు — అనారోగ్య సూచనలు ఉన్నాయి వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు

కర్కాటకం ఫలితం మాట యెలాగ ఉన్నా, ప్రయత్నించిన ప్రతిపనీ సులువుగా నెరవేరుతుంది వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు వారం మధ్యలో అనుకోని చికాకులకు గురి కాగలరు సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది

స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు సామాన్యంగా ఉంటాయి సాటివారిలో గౌరవం లభిస్తుంది

సింహం వ్యాపారంలో సాటివారితో పోటీ పెరుగుతుంది ఆర్థిక వ్యవహారాల్లో ఇతరుల నిమిత్తం శ్రమకు గురి కాగలరు ప్రయోజనం గల వ్యక్తులను కల్సుకొంటారు వారం ఆఖరులో వృత్తి వ్యాపారాల్లో చికాకులు యేర్పడతాయి అధిక వ్యయం జరుగుతుంది

స్త్రీలకు — వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు ప్రయాణాలోచనలు చేస్తారు

కన్య ఇదివరకు ఆగిపోయిన వ్యవహారాలను యిప్పుడు లాభదాయకంగా పూర్తి చేయగలరు. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది ప్రయాణం ద్వారా కార్యసాధన చేయగలరు సాటివారితో వాదప్రతివాదాలు తగవు సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది

స్త్రీలకు — ఆరోగ్యం బాగా ఉంటుంది. సంతోషకరమైన వార్తలను వింటారు

తుల: మీరు స్వంతంగా చేసే వ్యాపారం కంటే భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు బాగా ఉంటాయి. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు స్థిరాస్థి వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి నూతన విషయాలను తెల్సుకొంటారు.

స్త్రీలకు — కుటుంబ వ్యవహారాల్లో అధిక వ్యయం జరుగుతుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు

వృశ్చికం వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు కొంచెం శ్రమమీద నెరవేరతాయి నూతన వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి ఇతరుల మీద ఆధారపడి భారీ వ్యవహారాలకు పూనుకోవడం తగదు. కోర్టు వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉంటుంది సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది

ధనుస్సు భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు అనుకూలంగా ఉంటాయి సాహసముతో కూడిన వ్యవహారాలు లాభించగలవు ప్రయాణాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి రాజకీయ వ్యవహారాల్లో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి

స్త్రీలకు.— బంధువులకు సహాయం చేస్తారు. సంతోషకరమైన వార్తలను వింటారు

మకరం ఇదివరకు మీ కార్యక్రమాల్లో యేర్పడిన చికాకులు తొలగిపోతాయి వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి రావలసిన డబ్బు సమయానికి అందుతుంది నూతన వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది

స్త్రీలకు — కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు

కుంభం వారం ప్రారంభంలోనే వృత్తి వ్యాపారాల్లో చికాకులు యేర్పడి తరువాత సర్దుకొంటాయి. ప్రయాణాల్లో శ్రమ అధికంగా ఉంటుంది ఉద్యోగంలో గౌరవ ప్రాబల్యాలు బాగా ఉంటాయి విద్యా వైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణిస్తుంది

స్త్రీలకు — ఆరోగ్యం బాగా ఉంటుంది దైవకార్యాలు నెరవేరుతాయి

మీనం వ్యాపారంలో మీ ఆలోచనలకు తగిన అవకాశాలు లభిస్తాయి రావలసిన డబ్బు సమయానికి అందుతుంది వారం మధ్యలో అన్ని వ్యవహారాల్లోను చికాకులు యేర్పడతాయి ఉద్యోగంలో యెవరిని విశేషంగా నమ్మడం తగదు

స్త్రీలకు — ఆరోగ్యం బాగా ఉంటుంది శుభకార్యాల విషయంలో అభివృద్ధిని సాధించగలరు.

—మహేష్



ఒకప్పుడు దక్షిణదేశపురాజు చక్రవర్తిని చంపించడానికి కుట్రచేశాడు. కొంతమంది దక్షిణదేశపు సైనికులు వర్తకుల వేషాల్లో కోటలో ప్రవేశించి చక్రవర్తిని చంపాలని వారు అనుకొన్నారు.

దక్షిణదేశపురాజు చేస్తున్న కుట్ర సంగతి మల్లన్నమంత్రికి తెలిసింది. మర్నాడే చక్రవర్తిని చంపడానికి కుట్ర జరుగుతున్నదని చారులు మల్లన్న మంత్రికి చెప్పారు. అందుచేత యెలాగైనా సరే మర్నాటి ఉదయానికి యీ విషయాన్ని చక్రవర్తికి తెలియజేయాలని మల్లన్నమంత్రి అనుకొన్నాడు. చక్రవర్తి రాజధానికి వెడుతున్నవారిని దక్షిణదేశపు సైనికులు అడ్డగిస్తున్నట్లుగా కూడా, చారులు మల్లన్న మంత్రికి చెప్పారు

ఎంత కష్టమైనా సరే, కుట్ర సంగతిని చక్రవర్తికి వెంటనే, తెలియజేయాలి కాబట్టి మల్లన్నమంత్రే స్వయంగా చక్రవర్తి రాజధానికి రథం మీద బయల్దేరాడు.

మల్లన్నమంత్రి రాజ్యంనుంచి చక్రవర్తి రాజధానికి వెళ్లడానికి రెండు దారులు ఉన్నాయి. అందులో ఒకటి కొండదారి. ఆ దారి కొండలమధ్య నుంచి వేయబడింది. ఒక వైపున యెత్తైన కొండలు, మరొక వైపున లోతైన లోయలు ఉండడం వలన ఆ దారిని ప్రయాణం చేయడం ప్రమాదంతో కూడుకొని ఉంటుంది.

కొండదారి మీదుగానే తమరథాన్ని పోనివ్వ వలసినదిగా మల్లన్న మంత్రి సారథితో చెప్పాడు. రథం కొండదారి మీదుగా పోతూఉంది. కొంతదూరం వెళ్లేసరికి దక్షిణ దేశపు సైనికులు మల్లన్నమంత్రి రథాన్ని చూశారు. మల్లన్నమంత్రిని పట్టుకోవడానికి వారు గుర్రాలమీద యెక్కి రథాన్ని వెంటాడడం ప్రారంభించారు.

దక్షిణదేశపు ఆశ్వికులు కొంత దూరం మల్లన్నమంత్రిని వెంటాడేసరికి ఆకస్మికంగా వారి గుర్రాలకు కాళ్లు జారిపోవడం ప్రారంభించాయి కొంతమంది సైనికులు గుర్రాలతో సహా లోయలోపడిపోయారు అది రాత్రి సమయం తమలో కొంతమంది సైనికులు ఆకస్మికంగా [illegible] లోయలో పడిపోయినా మిగిలినవారికి తెలియలేదు.

మరికొంతదూరం వారు మల్లన్న మంత్రిని వెంటాడేసరికి మరికొంత మంది సైనికులు లోయలో పడిపోయారు. దానితో మిగిలిన సైనికులు భయపడి, వెనుకకు వెళ్లిపోయారు.

మల్లన్నమంత్రి చక్రవర్తిని సకాలంలో చేరుకొని కుట్రసంగతిని తెలియజేశాడు. వెంటనే చక్రవర్తి సైనికులు కోటలో కొత్తగా ప్రవేశించిన వర్తకులను బంధించారు. తరువాత వారిని సోదాచేయగా వారి వద్ద ఆయుధాలు పట్టుబడ్డాయి. చక్రవర్తివారిని తగినట్లుగా దండించాడు.

తరువాత చక్రవర్తి జరిగిన సంగతి నంతా తెలుసుకొన్నాడు. 'దక్షిణదేశపు సైనికులు లోయలో పడిపోవడానికి కారణం యేమిటి?' అని చక్రవర్తి మల్లన్నమంత్రిని ప్రశ్నించాడు అందుకు మల్లన్నమంత్రి యిలాగ సమాధానం యిచ్చాడు.

'ప్రభూ! నేను బయల్దేరేటప్పుడు యిలాగ జరుగుతుందని ఊహించాను. అందుచేత రథంనిండా అరటిపళ్లు వేసికొనివచ్చాను. దక్షిణదేశపు సైనికులు నారథాన్ని వెంటాడుతున్నప్పుడు కొన్ని అరటిపళ్లను దారిలో పడవేశాను. అడుగులు వాటిమీద పడగానే గుర్రాలు లోయలోనికి జారిపోయాయి.

ఆ సమాధానం విని చక్రవర్తి మల్లన్నమంత్రి ఉపాయాన్ని యెంతగానో మెచ్చుకొన్నాడు. తరువాత చక్రవర్తి మల్లన్నమంత్రికి కృతజ్ఞతను తెలియజేశాడు. ●



పడుతావురా జాగ్రత్త!



కె. రామలక్ష్మి

ప్రతి తల్లీ అనుకుంటుంది — తను ఒకటే అవస్థపడిపోకపోతే— ఇల్లు ఒక్క క్షణం గడవదని. అది ఆమెగారికి ఆధిపత్యం ఇచ్చినట్టు అనుకుంటుంది. ఈమధ్య ఒక స్నేహితురాలు ఉత్తరం రాసింది— 'ఎంతో హాయిగా సరదాగా కాలం గడిచేది. ఇప్పుడీ పిల్లలు నడవడం ప్రారంభించాక— ఒక్క క్షణం మనశ్శాంతి లేదు. స్వేచ్ఛగా ఊపిరి తీసుకోడానికి వ్యవధిలేదు. నిశ్చింత లేదు. ప్రతి చిన్నదానికీ ఊ—ఇదై పోతాను. మరుక్షణంలో ఏం విపరీతం జరిగిపోతుందో అన్నట్టు—సర్కసువాళ్ళ వైరుమీద నడిచినంత టెన్షన్‌లో ఉంటున్నాననుకో— పొయ్యిమీద కూర మాడిపోతుందన్న దగ్గర్నుంచి. రోడ్డు దాటుతూ పెద్దాడే కారు కిందేనా పడతాడేమో అన్నదాకా ప్రతి చిన్న విషయం—హైరాన పెట్టేస్తూంది... ఇదంతా పైకి చెప్పడానికి బొత్తిగా హాస్యాస్పదంగా ఉంటుందనుకో—కాని—ఏపని మీదా దృష్టి నిలపలేకుండా ఉన్నాను. ఏదన్నా విసుగూ, కోపమే. ఊ అంటే ఆ అంటే కోపం, పిల్లలని బాదేస్తానేమో అన్నంతగా తయారయ్యాను. ఇదంతా నువ్వు నమ్మతావా — అన్నీ డోన్ట్‌కేర్‌గా తీసుకునే నీ స్నేహితురాలిలా తయారైందంటే నమ్మతావా?' అంటూ వ్రాసింది. ఆరోగ్యానికేం నిక్షేపంగా ఉంది. ఈ కోపం టెంగా మినహాయించి అంతా హాయిగానే ఉంది. మా వారికేం? 'అబ్బ పోదూ, ప్రతి చిన్న విషయానికీ హైరానపడతావేమిటి? కొంచెం విశ్రాంతిగా ఉండడం అలవాటు చేసుకో' అనేస్తారు అంటూ వాపోయింది.

నిజమే, బాధ్యత కల తల్లులు కొంత వరకు వర్రీ అవుతారు. ఈ వర్రీ పిల్లలు చిన్న చిన్న ప్రమాదాలు రాకుండా జాగ్రత్తగా ఉండేలా చేస్తుంది. ఇదే ఇల్లు సాఫీగా నడవడానికి, ఇతరత్రా హాయిగా గడవడానికీ నాంది అవుతూంది. కాని ఒక్క బాధపడి ఊరుకునే తత్వం అలవాటు చేసుకుంటేనే ఎదురౌతుంది అసలు ప్రమాదం — వర్రీ అయి క్రియ సాధించకపోతే ఏం ప్రయోజనం? 'చేతల' స్థానాన్ని బెంగపడ్డం ఆక్రమించుకుంటే పని జరగదు. అందుకే మన బెంగ ఏదైనా సాధించేదిగా ఉండాలి.

ఎలా పని చేసుకోవడమో ఒక పద్ధతి అలవాటు చేసుకొని, దాన్ని సాధ్యమైనంత వరకు అమలులో పెట్టాలి. చేతిలో పని సవ్యంగా పూర్తిచేసే అలవాటు చేసుకోవాలి. వంట సులభం చేసుకోవడం, పిల్లలకి జాగ్రత్తలు నేర్పడం మొదలైనవి శ్రద్ధగా చేస్తే వ్యక్తిగతమైన మానసిక దౌర్బల్యం కొంత తగ్గుతుంది. ఏవి ముఖ్యమైనవి? ఏవి కావు అన్నది కూడా గుర్తించడం అలవాటు చేసుకోవాలి. అంత మరీ కొంప మునిగిపోనివి నిశ్చింతగా వదలి వేయడం

మహీధరోక్తులు

మహీధర నళినీమోహనరావు

రంగు మార్చుకున్న రాజకీయముగాదు
చంపకున్నచో భిషక్కుగాదు
వస్తులుండకున్న బడిపంతులేకాదు
హృదయవర్తి యీ మహీధరోక్తి.



వనితాలోకం

అలవాటు చేసుకోవాలి ఈరోజు నడుము నొప్పితో సతమతమై పోతూ బట్టలుతకడం ఆగిపోయిందే అని బెంగ పెట్టుకున్నందువల్ల ప్రయోజనం ఏమిటి? రేపు చూసుకో వచ్చులే అని ఊరుకో కలగాలి ముఖ్యంగా జరిగి తీరవలసిన పనులు చేసుకోవడం, మిగిలినవి తోసిరాజనడం అలవాటు చేసుకుంటే — యీ పిచ్చి బెంగలు తగ్గిపోతాయి కుర్రాళ్ళు పరిగెత్తి ఆడితే గుండె దడ వచ్చే తల్లులని నే నెరుగుదును పడతావురా అంటూ కేకలు వేస్తూనే ఉంటారు కుర్రాళ్ళు పరుగెత్తడ్డం మానరూ మానరు. పడి ఏమో కాలుకో దెబ్బ తగుల్చుకోకా పోరు. అంత మాత్రాన మునిగి పోయేదేముంది? చిన్న చిన్న పట్లాలూ లేవడాలూ లేకుండానే పిల్లలు పెద్ద వాళ్ళవుతారా? ఇది గ్రహించకుండా పిల్లాడు ఉట్టినే పరుగులు పెడుతున్నాడండీ, అంటూ బెంగపడితే లాభంలేదు — కొంచం హుషారైన పసివాళ్ళయితే — 'నువ్వు పరిగెత్తే పడతావే అమ్మా, నేనెందుకు పడతానే'' అని ఛాలెంజి చేస్తారు. అప్పటికీ తల్లిగారికి కనువిప్పు కాకుంటే డాక్టరుని చూడడం మంచిది! ●



వంటలు

పులిహోర

కావలసిన సామగ్రి :—

రెండు గరిటెల ధనియాలు
ఒక చెంచా మెంతులు
ఒక పసుపుకొమ్ము
పదునైదు మిరపకాయలు
ఇంగువ కొంచెము
నిమ్మకాయంత చింతపండు

ముందు ధనియాలు నూనెలో వేయించి పొడి చేసుకోవాలి చింతపండు బాగా గుజ్జు చేసి బాగా ఉడికిన తరువాత, ధనియాల పొడి దీనిలోవేసి రెండు నిమిషాలు ఉంచి దింపివేసి మూతపెట్టాలి

కొంచెము సెనగపప్పు
మినప్పప్పు
ఆవాలు
కరివేపాకు
నాలుగు మిరపకాయలు


నూనెలో వేయించి పొడిలో వేయాలి

ఈ విధముగా చేస్తే నెల రోజులు ఉంటుంది

వేడి అన్నములో కలిపి తింటే బాగా ఉంటుంది దోసెలకి కూడా ఉపయోగించవచ్చు.

—బి సీత.

పరీక్షలకి ముందు



a+b)(a-b
a²-b²+2
²c(a+
b²
a+
c-a
ALGEBRA
ALGEBRA
ALGEBRA
ALGEBRA
ఏరా పరీక్షలకి తెగ ప్రిపేరయి నట్టున్నావే!
పరీక్షలు గదా— మావాడు చదువు తున్నాడు సార్!!
అంతలాగా కష్టపడి రాస్తున్నావేమిట్రా
రేపు పరీక్షకి బిట్స్
ఏమే మన అమ్మాయికి ఈ మధ్య దైవ భక్తి మరీ ఎక్కువైపోతోందే
పరీక్షలు దగ్గర్లో పడ్డాయిగా
భలే శ్రమపడి చదూతున్నట్టున్నావే ఏమిటీ సంగతి??
ఈసారి గనక పాసయితే మానాన్న నాకు పెళ్ళి చేస్తా నన్నాడు!
TEA
ఏరా నాన్నా పరీక్షకి వెడుతు న్నావుటూ - విష్ యూ గుడ్ లక్!!

X పెరిమెంటు



అందము అనేమాట జగన్నాథం నోటినుంచి రాదు. అందాన్ని చూస్తే అతనికి ఏవగింపు. అందమయిన వస్తువునుగాని, అందమయిన మనుష్యునిగాని అతను అందరిలోను చూడడు. ఎవరూ లేకుండాజేసి తెగచూస్తాడు. చూసిచూసి వ్యూనతలో మనస్సును ముంచి ఊపిరి సలపకుండా చేసుకుంటాడు.

అందాన్ని చూసినప్పుడు అతనిమనసు కుత కుత లాడిపోతుంది. లోలోపల కుమిలిపోతాడు. తనని తాను తిట్టుకుంటాడు. అసహ్యించుకుంటాడు. హింసించుకుంటాడు.

అందుకు కారణం ? అతను అనాకారి. ప్రపంచ అనాకారుల పోటీలో మొదటిగా రాతగ్గ యోగ్యతలు అతని కున్నాయి. ఆ విషయం అతనికి ఆలశ్యంగా తెలిసింది. చేతులుకాలిన తరువాత విచారిస్తున్నాడు.

తాను మరీ అంత కురూపిగా వుంటాడని పెళ్ళయేవరకు జగన్నాధానికి తెలియలేదు. తెలుసుకోడానికి అవకాశం రాలేదు. అందుకే అప్సరసల అందాన్ని తలదన్నిన అందగత్తె ఊర్వసిని పెళ్ళి చేసుకోగలిగాడు

ఊర్వసిని పెళ్ళి చేసుకున్నాక తెలిసింది తనది వట్టి, గెరిల్లా స్వరూపమని

అందం తక్కువయినా నేనూ మనుషుల్లో ఒకడిని అనుకొనేవాడు పెళ్ళవక ముందు అదే సంతృప్తితో సంసార ఝంఝాటంలో పడ్డాడు

పెళ్ళి చేసుకున్న అందరి మనుషుల్లో

లానే తనుకూడా ఊర్వశిని వెంటేసుకుని హనీమూన్‌కి వెళ్ళాడు షికార్లు కొట్టాడు హనీమూన్ ట్రిప్ రెండు రోజులూ అతని జీవితానికి రెండు పరీక్షాదినాలుగా తయారయాయి

'కాకి ముక్కుకి దొండపండు'

'పండు వెన్నెలకి పెంట కుప్ప'

'పన్నీరు. బురద గుంట'

'వన్నెల విసనకర్ర.. మాసిన చింకిగుడ్డ'

లాంటి ఛలోక్తులకి అతని ఉత్సాహం దిగజారి పోయింది జీవితమే నీరు కారి పోయింది!

అంతే, హనిమూన్ ట్రిప్ కాన్సిల్.

ఊర్వశి తల దువ్వుకుంటున్న అద్దంలో దొంగచాటుగా తన ముఖం చూసుకున్నాడు జగన్నాథం

లోకులు కాకులెందు కయ్యారు? అని ప్రశ్నించుకున్నాడు

ఊర్వశి నిజంగా ఊర్వశే

ఊర్వశి చెక్కిళ్ళు అద్దంలావే మెరుస్తున్నాయి. తనవి అరిగి నలిగిన గరుకుకాయితంలా వున్నాయి పచ్చని ఊర్వశి ముఖం చిదిమి దీపం పెట్టేట్టుగా వుంది నల్లని ముఖంమీద అతి నల్లని స్ఫోటకం మచ్చలతో గుంటలు పడి వికృతంగా వుంది తనది ఊర్వశి కండ్లు గండుమీనులయితే, తనవి లోతయిన గోతులు ఇలా

ఏ క్షణంలో చూసినా విలక్షణంగా తోచే తనముఖం, అవయవాలూ తీరూ తెన్నూ లేక అష్ట వంకర్లుగా కనిపించాయి

'ఛీ' అని అనుకుని, అదే గట్టిగా అనేశాడు.

అది విన్న ఊర్వశి అతన్ని బుజ్జగించింది. కాని, జగన్నాథం సమాధాన పడలేదు.

మర్నాడు షికార్లు బంద్

అప్పటి నుంచి ఊర్వశితో సరాగాలు బంద్

ఆమెవంక చూడడమే మానేశాడు.

ఆమె కనిపిస్తేచాలు, అగ్గిమీద గుగ్గిలంలా భగ్గుమనేవాడు

'నన్నెందుకలా అసహ్యించుకుంటారు? మీకు దూర దూరంగా వుండి నేను భరించగలనా? నన్నిలా చూడకండి .. అన్యథా తలంచకండి ... మీకు తెలియదు... నేను మిమ్మల్నెంతగా ప్రేమిస్తున్నానో? నన్ను దగ్గరకు తీసుకోండి...'

అంటుంది ఊర్వశి.

'అంతా అబద్ధం...నేను శుద్ధ అనాకారిని. నువ్వు నన్ను ప్రేమించడంలేదు. నా డబ్బును ప్రేమిస్తున్నావు నా మేడల్ని ప్రేమిస్తున్నావు నా కార్లని ప్రేమిస్తున్నావు. నా ఐశ్వర్యాన్ని ప్రేమిస్తున్నావు.'

అంటాడు జగన్నాథం కచ్చి పోయిన కోపంతో.

ఊర్వశి ఏడుస్తుంది.

'కాదు., నా కవేమీ అక్కర్లేదు నేను వాటిని కోరుకోవడంలేదు. మిమ్మల్నే



మనసారా ప్రేమిస్తున్నాను. నన్ను కనికరించండి...' అంటుంది.

అని వూరుకోదు. అతన్ని తనతో ఐక్యం చేసుకుంటుంది

ఆక్షణంలో ఊర్వశి చేతల్నిబట్టి మాటల్ని కూడా నమ్ముతాడు జగన్నాథం

అది క్షణికం.

తర్వాతది మా మామూలుపాటే...

'నేను కురూపిని...చవటని.. దద్దమ్మని ..వాజెమ్మని. నువ్వు...ఊర్వశివి... రంభవి.. నన్ను ప్రేమించడంలేదు అవును. నన్నెందుకు ప్రేమిస్తావు...ఎలా ప్రేమిస్తావు. ?'

అనుకుంటాడు. అంటాడు.

ముప్ఫయ్‌మూడు పువ్వులూ అరవయ్యారు కాయలుగా సాగిపోవలసిన వారి దాంపత్య జీవితం అలా ముళ్ళ మీద నడవడం ప్రారంభించింది.

జగన్నాథం మనశ్శాంతిని కోల్పోయాడు. పిరికివాడుగా తయారయ్యాడు. ఇల్లు కదిలితేచాలు అందరూ తననే చూస్తున్నారని, వేలెత్తి చూపుతున్నారని భయపడేవాడు తెలిసినవాళ్ళూ తెలియనివాళ్ళూ ముఖంమీద నవ్వి, వెనుక వెగతాళి చెయ్యడం కనిపెట్టలేకపోయేటంత తెలివితక్కువవాడు కాడతను.

అతని మానసిక పరితాపం మనుషుల్లోకి వెళ్ళగానే భయపెట్టేది. పెళ్ళామంటే చిరాకు పుట్టుకొచ్చింది. జీవితాన్ని అపహాస్యించుకోవడం ప్రారంభించాడు.

జీవితంలో ఊర్వశి ప్రవేశించి అతనికి నిద్ర లేకుండా చేసింది మనస్సుకి శాంతి లేకుండా చేసింది. నిత్యకార్యకలాపాలదారికి అడ్డుగా కూర్చుని పిరికిమందు నూరిపోస్తోంది.

కలత నిదురలో జగన్నాథానికి ఒక మంచి ఆలోచన తట్టింది.

ప్రాణ స్నేహితుడు బెనర్జీకి ఫోన్ చేశాడు.

బెల్లం వాసనగన్న చీమలా పరుగెత్తుకొచ్చేశాడు బెనర్జీ.

బెనర్జీని ఒక గదిలోకి తీసుకువెళ్ళి తలుపులు బిగించి తన మనోవేదననంతా అతని ముందుంచాడు జగన్నాథం

నాలాంటి వికార స్వరూపాన్ని ఒక ఊర్వశి హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నానంటే నమ్మే మాటేనా?' అన్నాడు.

'నమ్మొచ్చు...' అన్నాడు వికారంగా వుండే జగన్నాథం ముఖంలోకి చూడలేక బెనర్జీ.

'నేను నమ్మను. నువ్వూ అబద్ధమాడుతున్నావు' అన్నాడు జగన్నాథం అసహనంతో.

బెనర్జీ జగన్నాథానికి నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు. .

'పెళ్ళయిం తర్వాత భర్త అందగాడయినా, వికారుడయినా భార్య భరించక తప్పదు. భర్తలో కొన్ని లక్షణాలు భార్యకి ఎంతో ఆసక్తిదాయకంగా తోస్తాయి, అవి ఆమెకు

X పెరిమెంటు

నచ్చుతాయి. అవే భార్య భర్తని ప్రేమించేలా చేస్తాయి ఒక్కడ అందమొక్కటే ప్రధానం కాదు భర్త అందగాడే కానక్కరలేదు భర్తలో వున్న ఆ కొన్ని లక్షణాలే అందగాడుగా భార్యకి తోపింప జేస్తాయి లేనిపోని అనుమానాలతో నువ్వు మనసుని పాడుచేసుకుంటున్నావు ఇంత చిన్న విషయానికి నువ్వింతగా క్రుంగిపోవడం ఏమీ బాగోలేదు ఈ మాటలు నాతో అనడానికి నీకు నోరెలా వచ్చిందసలు ?'

అంటూ సయ్కాలజీని వంట పట్టించుకున్న నోటితో మెత్తగా మందలించాడు బెనర్జీ.

బెనర్జీ మాటలు జగన్నాథాన్ని కొంత ఉపశమింప జేశాయి ఆ సంతృప్తి అతనిని ఆరోజుకి మాత్రమే కాస్త నిద్ర పోనిస్తుంది!

బెనర్జీకంటె లోతుకుపోయి ఆలోచించిన జగన్నాథం తన నిశ్చయాన్ని అతని ముందుంచాడు

ఆశ్చర్య పోయాడు బెనర్జీ

'నువ్వు నా స్నేహితుడివి నేను రాత్రింబవళ్ళు ఎంతగా పరితపించి పోతున్నానో నీకు చెప్పాను—ఇది కేవలం ఒక ఎక్స్పెరిమెంట్ ఈ ప్రయోగాన్ని నువ్వు అమలు జరపాలి పరీక్షించక తప్పదు. ఇవి చేతులుకావు ... ' అని బ్రతిమాలాడు జగన్నాథం

'లేదు నే నలా నటించలేను ఊర్వశి ని భార్య నువు నాప్రాణ మిత్రుడివి నీ భార్య దగ్గర నేను అనుచితంగా ప్రవర్తించలేను నన్ను మన్నించు ' అన్నాడు బెనర్జీ

'ఇది కేవలం ఎక్స్పెరిమెంట్ ప్రయత్నిస్తేనే నాకు మనశ్శాంతి లభిస్తుంది ప్రయోగం ఫెయిలయితే మరో మార్గం ఆలోచించుకుంటాను ఈ మానసిక ఆవేదనని ఇక భరించుకోలేను మరుగుతున్న హృదయాన్ని చల్లబరచగలవాడవు నీవొక్కడివే పెళ్ళి మూడురోజుల ముచ్చట మాత్రమే కాదు జీవితకాలం నేను ఆమెతో కలిసిమెలసి వుండాలి ఒకరి నొకరు అనుమానిస్తున్నప్పుడు సంసారమెలా సాగుతుంది? నువ్వే ఆలోచించు తుదిసారిగా ప్రార్థిస్తున్నాను.'


అని ప్రాధేయపడ్డాడు జగన్నాథం. బెనర్జీ రాజీకిరాక తప్పలేదు

* * *

'నువ్వు ఊర్వశివి. జగదేక సుందరివి ప్రపంచ సుందరీ మణులలో ఎన్నదగిన దానివి అటువంటి నువ్వు వాడితో ఏం సుఖపడగలవు చెప్పు ? నీ యవ్వనాన్ని ఇలా అడవికాచిన వెన్నెలలా ఎందుకు పాడుచేసుకుంటావు ? నీకు తోడు నేనున్నాను. నాలో నీకు కావలసిన వన్నీ లభిస్తాయి నన్ను నమ్ము నా కోరిక తీర్చు '

'ఛీ దుర్మార్గుడా. ! ఛీ అవతలికి నా భర్తకి మిత్రుడిగా నటించి—ఆయనకి నాకు ఎడబాటు కల్పించుదామని చూస్తున్నావా ? దూరంగా వుండు ... దగ్గరకి వచ్చావంటే మాట దక్కదు '

'నువ్వు తెచ్చిపెట్టుకున్న గంభీరంతో మాట్లాడుతున్నావు. నాకుతెలుసు లేని సంతృప్తిని అనుభవిస్తున్నట్టు నటిస్తూ మాటలాడుతున్నావు వాడు, జగన్నాథం పట్టి కురూపి నీకు తగిన వాడు కాదు . నీకు కావలసిన డబ్బు వాడి దగ్గర దొరుకుతుంది నీకు కావలసిన ఆనందం నాదగ్గర దొరుకుతుంది అదృష్టం తనకి తానుగా వరించి వస్తే కాలదన్నకు. అవకాశం చెయిజారిపోయాక విచారించి లాభంలేదు. రా. స్వర్గ సౌఖ్యాలు అనుభవించుదాం. రా. '



'ఛీ నోర్ముయ్యి మళ్ళీ ఆమాట అన్నావంటే పేగులు తోడేస్తాను నా సంగతి నీకు తెలియదు ఆయన ఎలాంటి వారయితే నీకేం? నాకు లేనిబాధ నీ కెందుకు? ఆయన నా భర్త నా కాయనే ఆరాధ్య దైవం ఆయన నన్ను ప్రేమిస్తున్న దానికంటే నేను ఆయన్ని అధికంగా ప్రేమిస్తున్నాను ఇప్పుడయినా తెలుసుకున్నావు గనక ముందు గది దాటు. ఆశలతో నన్ను ఆకట్టుకోవాలని ప్రయత్నించకు. నా కోపం మితిమీరక ముందే ఈ గడపదాటి వెళ్ళిపో పో .'

'అహహ్హాహ్హా..'

'ఎందుకు నవ్వుతావ్ ?'

'నవ్వుతావా .. ఇంకా నవ్వుతావా ? ఎందుకీ నటన .? నీ నటన నేను కని పెట్టలేననా? ఈ ఆస్తికోసం . ఈ సంపదకోసం జగన్నాథాన్ని ప్రేమిస్తున్నట్టు నటిస్తున్నావని నాకు తెలియదనుకున్నావా? ఎందుకు అనవసరంగా బొంకుతావు? వాడితో ఏమి సుఖపడగలవో, ఏమి సుఖపడగలుగుతున్నావో నేను గ్రహించలేననుకున్నావా ? వాడు పట్టి వెర్రి బాగులవాడు. వాడిని వంచించడం చాలా తేలిక. నువు చాలా తెలివయినదానివి. కోటలో పాగా వేయడానికి మంచి ఎత్తు ఎత్తావు. ఆ నిక్రుష్టుడితో నువ్వు '

'మళ్ళీ ఆ మాట అనకు నేను భరించలేను నన్ను అనవసరంగా రెచ్చగొట్టకు. '


'అంటాను ఇంకా అంటాను ఊర్వశీ, నువ్వెక్కడా? నా డెక్కడ? నక్కకీ నాగలోకానికి ఉన్నంత దూరం—రా .దగ్గరికి రా. '


ఫెడేలు మన్న చప్పుడు విన్నాడు జగన్నాథం బెనర్జీ దవడ పేలిపోయి వుంటుంది ప్చ్ పాపం బయటికిరాగానే క్షమాపణలు చెప్పుకోవాలి అనుకున్నాడు.

'దుర్మార్గుడా ఆయన ఇంటిలో లేకుండా చూసి నా మీద అత్యాచారం జరపడానికి వచ్చావా? నీ కెన్ని గుండెలున్నాయి? ఇదిగో రివాల్వర్ ... అడుగు ముందుకు వేశావంటే నిన్ను కాల్చి నన్ను నేను కాల్చేసుకుంటాను. వచ్చే

నెలసరి వాయిదాలలో చిన్న చిన్న మొత్తములను నిలవచేసుకొని మీరు పెద్ద పెద్ద మరియు ఖరీదైన వస్తువులను కొనుక్కోగలరు -ఎలాగ? బ్యాంక్ ఆఫ్ బరోడా రెకరింగ్ డిపాజిట్ స్కీము యొక్క లాభమును పొందుతూ!







ప్రతి నెలకు 5 చొప్పున ఇరవై నాలుగు నెలలు నిలవచేస్తే రు 127 50 ఒవుతుంది. ఆ డబ్బుతో ఒక టేబుల్ పంకా కొనుక్కోవచ్చును లేక నెలకు రు 10 చొప్పున ముప్పది ఆరు నెలలు నిలవచేస్తే వచ్చే మొత్తము రు 395తో ఒక మంచి సైకిలు కొనుక్కోవచ్చును
పై విధముగా పెద్ద మొత్తములు పెట్టి ఖరీదైన వస్తువులను కొనుక్కొనుటకు బ్యాంక్ ఆఫ్ బరోడా రెకరింగ్ డిపాజిట్ స్కీములో నిలవచేసుకోండి
మీరు డబ్బును తేలికైన నెలసరి వాయిదాలలో చెల్లించవచ్చును నిలవ మొత్తముల మీద మీకు మంచి వడ్డీ కూడ లభిస్తుంది!
నెలసరి డిపాజిట్లు క్రింద పట్టీలో చూపిన విధముగా అంగీకరింపబడతాయి:
రు 5 10 20 రు 100 వరకు 2 3 4 9 ఏళ్ల వరకు ఎలాగో చూడండి

ప్రతినెల కట్టవలసిన డబ్బు	2 ఏళ్ల అకౌంటు	3 ఏళ్ల అకౌంటు	4 ఏళ్ల అకౌంటు	5 ఏళ్ల అకౌంటు	7 ఏళ్ల అకౌంటు	9 ఏళ్ల అకౌంటు
రు	రు	రు	రు	రు	రు	రు
5	127 50	197 50	271 50	354 50	536	750
10	255	395	543	709	1,072	1,500
20	510	790	1 086	1,418	2,144	3 000
30	765	1 185	1,629	2 127	3 216	4,500
40	1 020	1 580	2 172	2,836	4 288	6 000
50	1 275	1 975	2 715	3 545	5 360	7 500
60	1 530	2 370	3 258	4 254	6 432	9,000
70	1 785	2 765	3 801	4 963	7 504	10 500
80	2 040	3 160	4 344	5 672	8 576	12 000
90	2 295	3 555	4,887	6 381	9 648	13 500
100	2 550	3 950	5 430	7 090	10 720	15 000
	సం॥ 5½%	సం॥ 6%	సం॥ 6%	సం॥ 6½%	సం॥ 6½%	సం॥ 7%

(అర్ధ సంవత్సరమునకు ఒక సారి చక్రవడ్డీ కట్టబడుతుంది)

ది బ్యాంక్ ఆఫ్ బరోడా లిమిటెడ్

(స్థాపితం 1908) రిజిష్టర్డ్ ఆఫీసు మాండ్వి బరోడా
మన దేశములో మరియు విదేశములలో 300 పైగా బ్రాంచీలు కలవు
రెకరింగ్ డిపాజిట్ స్కీమును గురించిన వివిధ వివరములు కావాలని మీ దగ్గర లోనున్న బ్రాంచిని దయచేసి అడగండి లేక దానికై వ్రాయండి

shilpi bob 1A/68 TEL

Xపెరిమెంటు

జన్మలో కూడా ఆయనే నా భర్త అవాలని భగవంతుని ప్రార్థిస్తూ కాలం చేసుకుంటాను ఇప్పుడయినా అర్థం చేసుకో. వెళ్ళిపో ఊం కదులు.'

'ఆగాగు... వెళ్ళిపోతున్నాను వెళ్ళిపోతున్నాను. ఆ రివాల్వర్ సొరుగులో దాచెయ్. ఇదో వెళ్ళిపోతున్నాను నువ్వు మహాసాధ్వివి. నిన్ను వంచింపదలిచాను. నాకు శిక్షలేదు నన్నుక్షమించండమ్మా. మీ పాదాలు పట్టుకుంటాను. మీ కంటికి కనిపించనంతదూరంగా వెళ్ళిపోతాను నా మొఖం మళ్ళీ మీకు చూపించను నన్ను క్షమించండమ్మా ... నన్ను.. క్షమించండి...'

తలుపు దభేలుమన్న తరవాత బలమయిన అడుగుల చప్పుడు విని బెనర్జీని కలుసుకోడానికి పరుగెత్తుకు వెళ్ళాడు జగన్నాథం.

'నువ్వు వెళ్ళిపోవద్దు బెనర్జీ. నా కల్లోల జీవితానికి శాంతిని ప్రసాదించావు. నిన్ను నేను దూరం చేసుకోలేను నన్ను క్షమించు ప్లీజ్'

'జగన్నాథం ... నీ ఎక్స్పెరిమెంటు ఫలించింది నువ్వు సుఖంగా వుండు. అదే నాకు కావలసింది ఆ మహాసాధ్విని మళ్ళీ ఏ ముఖం పెట్టుకు చూడగల్గుతాను?' అన్నాడు కన్నీళ్ళు తుడుచుకుంటూ బెనర్జీ.

జగన్నాథం బ్రతిమాలి అతన్ని కుదుటబరిచాడు

జగన్నాథంలో అనుమానపిశాచం తొలగిపోయింది ఇప్పుడు ఎవరినీ లెక్కచెయ్యని మనిషిగా, మనోనిబ్బరంతో మనగలుగుతున్నాడు

బెనర్జీ జగన్నాథం యింటికి వస్తూ పోతూనే వున్నాడు జగన్నాథం స్థానే అతను ఊర్వశినుంచి అమరసౌఖ్యాలని అందుకుంటూనే వున్నాడు !

జగన్నాథం అనాకారి మాత్రమే కాదు... అమాయకుడు కూడాను !

(ఆంధ్రసచిత్రవారపత్రికలో శ్రీ 'ఆర్' ఉత్తరం చదివాక.)

వి. యల్. సుందరరావు

ప్రపంచంలో స్వేచ్ఛా వ్యాపారనగరం - హాంకాంగ్

వ్యాసరచయిత ఆంధ్ర కార్మిక నాయక ప్రముఖుల్లో ఒకరు. ఆయన ఇటీవలే ఆగ్నేయ తూర్పు ఆసియా ప్రాంతాలలో పర్యటించి వచ్చారు. ఇంతకు ముందే జపాన్‌కి సంబంధించిన వ్యాసం ఒకటి వేశాము. సం॥

హాంకాంగులో సూర్యుడు మనకంటె రెండున్నర గంటలముందు ఉదయిస్తాడు. కనుక మేము అచటికి చేరేటప్పటికి వాళ్ళకైతే ఏడున్నర గంటలైంది. మా స్నేహితులు, లగేజి చెకింగులు, బయటపడే టప్పటికి మరొకగంట అంటే రాత్రిపూట హాంకాంగ్ చేరాం.

హాంకాంగును గురించి తెలుసుకోవలసిన చరిత్ర చాలా ఉంది. ప్రపంచంలో అతి ప్రాధాన్యత వహించిన నగరం యిది. వ్యాపారరంగంలో అగ్రస్థానం వహించుతున్న కీలకమైన నగరం. ఈ విషయాలు క్రమంగా చర్చిద్దాం. దూరప్రాచ్యదేశాలలో కల్లా ఆకర్షణీయమైన నగరం. కొంత మందిని, టోకియో బాగుంటుందా, హాంకాంగ్ బాగుంటుందా అంటే హాంకాంగ్ బాగుంటుందంటారు. ఒక విధంగ వాస్తవమే.

మన బొంబాయి నగరం మాదిరి యీ నగరం పైకి ఎదగాల్సినదేకాని భూమిమీద విస్తరణకి వీలులేదు. పర్వతాలను కొంచెం చదును చేసి ఎత్తుగా మేడలు నిర్మించాలి. 10 అంతస్తుల సర్వసాధారణమైన భవనాలు. 1953కు ముందు యీ నగరంలో నాలుగైదు అంతస్థుల భవనాలు మాత్రమే ఉండెవి. యిప్పుడు అటువంటిది మచ్చుక కూడా కనిపించదు. యీనాడు నూతనంగా నిర్మాణం అయ్యే భవనాలు, 15, 20, 25, 30 అంతస్తులవి 35 అంతస్థులు కూడా ఉన్నాయ్. బొమ్మల సంతలో వరుసలు అమర్చినట్లు, కొండక్రిందిభాగం నుండి పై వరకు దొంతర్లుగా ఉంటాయి. యీ భవనాలు దూర ప్రాచ్యంలో దీనిని పోలిన నగరం లేదు.

రాత్రిపూట, చుట్టూ వలయంగా ఉన్నకొండల మీద పై అమర్చిన భవనాలు— మిరుమిట్లు గొల్పుతున్న లైట్ల అలంకరణలో చుట్టూ ఒక రవుండు తిరిగి నేలను వాలుతున్న విమానంలో నుండిచూస్తూ ఉంటే అదొక స్వర్గలోకంలో ప్రవేశించినట్లైంది. మొట్టమొదటిసారి చూస్తున్న మాకు, ఆ అనుభూతులు ఎంత శాశ్వతమైనవో, అచ్చెరువుగొల్పినవో చెప్పలేం. హాంకాంగు విమానాశ్రయం అంతర్జాతీయ కేంద్రం. అతి సుందరమైంది.

హాంకాంగులో యిప్పుడో ఎదుహారురోజులు, జపాను, ఫార్మోజా చూసివచ్చాక మరొక వారం ఉన్నాను. యిచటి ప్రజలు వాళ్ళ వ్యాసంగాలు యీ నగరంలో కాలూనిన మరుక్షణమే అచ్చెరువు గలుగజేస్తాయి. వీధులలో, రెస్టారెంటులలో అంగళ్ళలో ఎచ్చట ప్రజాసమూహాలను చూసినా పురుషుల సంఖ్యతో సమానంగానో హెచ్చుగానో స్త్రీలు కనిపించుతారు. ఈ విషయంలో అన్నిదేశాలు అంతే. ఉద్యోగాలలో చదువుల్లో వ్యాపారాలలో, అన్ని వృత్తుల్లో యిచట స్త్రీలు పురుషులతో సమానంగా పని చేస్తారు.

దేశంలో ఉండే జనాభా సంఖ్యమొత్తం, అక్కడగల అవకాశాలన్నింటినీ వారు సద్వినియోగం చేసుకో గలుగుతున్నారు. గనుక, దేశాభివృద్ధిని త్వరగా సాధించుకోగలుగుతున్నారు. హెచ్చు సౌకర్యాలు పొందగలుగుతున్నారనుటలో అతిశయోక్తి లేదు. ప్రతి వారూ సంపాదించుకోవాలి, వారి జీవన భారం వారు వహించాలి, అనే సూత్రాన్ని వారు అమలు జరుపుతున్నారు. స్త్రీ, పురుషులు, మంచి ఖరీదైన బట్టలు ధరించగలుగుతున్నారు. తృప్తికరమైన ఆహారం తినగలుగుతున్నారు. వారి ముఖాలలో ఒక విధమైన సంతృప్తి సంతోషం ఆనందం చిరునవ్వు కనిపిస్తుంది.

స్త్రీ పురుషులంతా పాంట్‌లు ధరించుతారు. షూకులు వేస్తారు. కొంతమంది పురుషులు మాత్రమే నెక్‌టై కోటు ధరిస్తారు. కనుక వేషంలో వ్యత్యాసం చాలా తక్కువ. అంతా తెల్లని రంగులో ఉంటారు. అందరూ క్రాపులు చేయిస్తారు. స్త్రీల క్రాపులు కొంచెం పొడుగ్గా ఉంటై, అంతే. మన దేశంలో స్త్రీలకు పురుషులకు మధ్య ఉన్న శరీర సౌష్ఠవంలో ఉన్నవ్యత్యాసం గూడా యిచటలేదు. యిద్దరిదీ సమానమైన ఎత్తు. మనకు పోలిస్తే మరుగుజ్జులు. ఐదడుగుల రెండంగుళాలకు మించి ఉండరు. అయితే పనిచేయటంలో మన దేశంలోని మోటువారివలె కష్టపడి పనిచేస్తారు.

హాంకాంగులో నూటికి 98 మంది చైనీయులు. యిచట ఆహారం తమాషాగా ఉంటుంది. చైనీయులంతా మాంసభక్షకులే. ఎండ్రకాయ మొదలు పాము మాంసం వరకు తింటారు. అంగళ్ళలో ఎండులు, బాతులు, కోళ్ళను, పై చర్మం వలచి అలాగే వ్రేలాడకడతారు. మనసొరకాయలు మాదిరి వ్రేలాడుతూ ఉంటై. తింటానికి రకరకాల వంటలు తయారు చేస్తారు. పెద్ద హోటళ్ళు మినహాయిస్తే, అనేకమైన చిల్లర హోటళ్ళు ఉంటాయ్. వీధులో ఆరు బైట కుర్చీలు, టేబుళ్ళు వేసి తిం



నవంబరు మాసంలో హాంకాంగులో జరిగిన ఆసియాఖండంలోని కార్మికోద్యమభవిష్యత్ అనే సదస్సులో యూరపుదేశాల కార్మికోద్యమ పితామహుడు, ఒకిసండాల్ మధ్యలో జర్మను దేశ ప్రేషక ప్రతినిధి షిప్లిజ్ భారత ప్రతినిధి వి. యల్. సుందరరావు



పొలాలకు నీడకట్ట్ నాట్లకు సిద్ధంగా ఉన్న నవంబరు మాసాంతములోని ఎర్రచైనా పరిహద్దు వరి భూములు. పొలాలమధ్యఉన్న రైతుల నివాసగృహాలుగూడా చూడవచ్చు.

టుంటారు. యివి అతికరువుగా ఉంటాయ్. మనకు అతి వెగటుగా ఉంటాయ్. సాధారణమైన జనం యిచట గుంపులు గుంపులుగా కూర్చొని తింటుంటారు. అన్నం మాత్రం అన్నిచోట్ల ఉంటుంది. వీరు చాప్‌స్టిక్కు అనే పుల్లలతో ఆహారం తింటారు.

హాంకాంగు నగరం బ్రిటీషు పాలిత నగరం. కాని, సామ్రాజ్యశృంఖలాలు లేవు. యిది అంతర్జాతీయ స్వేచ్ఛా కేంద్రం. యిచట దిగుమతి అయ్యే ఏదేశపు సరుకులైనాగూడా ప్రభుత్వం పన్ను విధించదు. స్వేచ్ఛగా కొనుగోలు చెయ్యవచ్చు. అమ్మకం చేసుకోవచ్చు కనుక ప్రతి వస్తువూ చాలా చౌక ధరకు లభిస్తుంది ప్రత్యేకంగా మన దేశీయులకు ఒకొక వింతసభలాగా ఉంటుంది అభివృద్ధి చెందిన జపాను, జర్మనీ, అమెరికా రష్యా యింగ్లండు ఫ్రాన్సు దేశాల మేలి రకపు సరుకులకు మనదేశ మార్కెట్టులో చోటులేదు మనదేశంలో ఉత్పత్తి అయ్యే సరుకులను మన ప్రజలు కొనుగోలు చెయరని ప్రభుత్వ నమ్మకం తథాస్తు అని ప్రజలు గూడా ఎప్పుడూ యీ బ్లాకు మార్కెట్టు సరుకు కోసం చూస్తూ ఉంటారు


మేలిరకపు విదేశీ వస్తువులు మార్కెట్టులో ఉంటే మన దేశంలోని దగా సరుకులకు చోటుండదు ఒక రకపు క్వాలిటీని షో రూములో చూపించి మరొక చౌక సరుకులు మార్కెట్టుకు వదిలేవిధానం అంతమవుతుంది స్టెయిన్‌లెస్ స్టీలు ముడి సరుకులు కోటాలు తీసుకొని మామూలు మెటలు వస్తువులు మార్కెట్టులో పెట్టే యంత్రాల మూసివేయబడతాయి మార్కెట్టులోని, మోసం దగా యీవిధంగా అరికట్టబడుతుంది

హాంకాంగులో అన్నిదేశాల భారీ అంగళ్ళు ఉన్నాయి అతిమేలిరకమైన సరుకులు లభ్యమవుతాయి ఈనగరం అచ్చగా సరుకులు కొనుగోళ్ళు

హాంకాంగ్

చేసే మార్కెట్టు. యిచట దొరకని వస్తువులు లేవు. జపాను దేశం నుండి సంవత్సరానికి షుమారు 50 వేల మంది ప్రజలు సరుకులు కొంటానికి యీనగరం వస్తూ ఉంటారు.

ఈ రోజున విచక్షణ లేకుండా ప్రతిదేశాన్ని బెదిరించచూస్తున్న ఎర్రచైనా ప్రభువులు యీ హాంకాంగును యింకా ఎందుకు యింగ్లీషు వాళ్ళ చేతిలో ఉంచారు అనే ప్రశ్న వస్తుంది అందుకు యీ ఫ్రీమార్కెట్టే కారణం యిట్లాగ ఉంటే ఎర్రచైనాకు కావలసిన ఏ సరుకులైనా ఏదేశం నుండైనా కొనుగోలు చేసుకోవచ్చు వాళ్ళ సరుకులు యితర దేశాలకు అమ్ముకోవచ్చు అట్లుగాక హాంకాంగ్ చైనా క్రింద ఉంటే యీ దేశాలు ఏవీ కూడా సరకులు ఇచటికి రానివ్వవు ఎర్రచైనాకు తీరని ఆర్థిక నష్టం చేకూరుతుంది



మాకావోను పోర్చుగీసు స్వాధీనం చేసుకో తలచిన యెడల యిరవైనాలుగు గంటలు కూడా పట్టవు. మన దేశంలో ఉన్న గోవా భూభాగాన్ని పోర్చుగీసు వాళ్ళు ఎంత రక్షించగలిగారో, యింగ్లీషు వాళ్ళ హాంకాంగును రక్షించుకోవటం గూడా అంతలోనిదే. హాంకాంగుమధ్య, ఎర్రచైనా మధ్య రాకపోకలు చైనా జాతీయులకు సర్వసాధారణంగా జరుగుతున్నాయ్. హాంకాంగు నుండి కాంటన్, షాంగ్‌హైకి నిత్యమూ రైళ్ళ రాకపోకలు ఉన్నాయ్. అనేక బంధుత్వాలు ఉన్నాయ్. హాంకాంగుకు 26 మైళ్ళ దూరంలో ఉంది, ఎర్రచైనా సరిహద్దు. దారి పొడుగునా అనేకమైన పరిశ్రమలు, గ్రామాలు వ్యవసాయంతో ఎంతో అభివృద్ధి చెందిన ప్రదేశాలతో నిండి ఉంది.

సరిహద్దు అనేది సూత్రప్రాయంగా ఉంది. ఎర్రచైనాలోకి వెళ్ళటం ఎవరికైనా సులభంగానే ఉంది. వెళ్ళింత తరువాత అచటి ప్రజలు ప్రభుత్వం పార్టీతో కుస్తీలు పడుతానికి సిద్ధంగా ఉంటేవెళ్ళవచ్చు. నేను ఒక జర్మను, జపాను, మలేషియా మిత్రులతో కలసి సరిహద్దుకు వెళ్లాను. యీవతలివడ్డున నిలుచొని అచటి సరిహద్దు జనంతో ఫోటోలు తీయించుకొన్నాం. సరిహద్దునానుకొన్న వ్యవసాయ క్షేత్రాలు ఫోటోలు తీసుకొచ్చాం. సరిహద్దులో సాధారణ తీగ అమరికతప్ప మరేమీలేదు. ప్రక్క మార్గంలో వెళ్ళితే అదిగూడాలేదు.

ఎర్రచైనాలో అంతఃకల్లోలం ప్రారంభించాక, రెడ్‌గార్డ్సుల ఉద్యమం ప్రారంభమయ్యాక, భీతావహం చెందిన ప్రజాసమూహం ఎంతోమంది హాంకాంగు చేరుకున్నారు. వారికోసం హాంకాంగు కార్పొరేషను పది అంతస్థులకాందిసీకుల భవనాలు నిర్మాణం చేసింది యిందులో రెండు లక్షల జనంపైగా తలదాచుకొని ఉన్నారు ఎర్రచైనాలోకంటే యిచటి వారిజీవితం సుఖప్రదంగా ఉన్నదంటున్నారు ఎర్రచైనాకంటే హాంకాంగులో జీవిత ప్రమాణం కనీసం 5 6 రెట్లు హెచ్చుగా ఉంటుంది కనుక వీరికి తేలికగా వృత్తులు కల్పింపబడ్డాయి రాజకీయ స్వేచ్ఛ ననుభవించుతున్నారు ఈ కాందిశీకులకు అమెరికను యింగ్లీషు మతసంస్థలు అనేకవిధాల సాంఘిక సేవచేస్తున్నవి వీరి పిల్లలకు విద్యాబోధన కల్పించుతున్నారు ఆరోగ్య సౌకర్యాలు వృత్తి విద్యలుకూడా కల్పించుతున్నారు

ఆసియా ఖండంలో కార్మికోద్యమ భవిష్యత్తు అనే సదస్సు 14వ తేదీనుండి 28వరకు హాంకాంగులో జరిగింది ఈ సదస్సులో పాల్గొంటానికే నేను వెళ్ళాను యిచటకు వచ్చిన దూరప్రాచ్య దేశాల లోని కార్మికనాయకులతో సన్నిహిత పరిచయాలు సంపాదించుకొన్నాను వారి ఉద్యమాలు, వ్యూహాలన్నింటిని ఆకళింపు చేసుకోగలిగాను వివిధ దేశాలలోని కార్మికుల పరిస్థితులు, వారి సమస్యలు రాజకీయాలు ఎన్నోనూతన విషయాలు సుబోధకమయ్యాయి నా జీవితంలో యీ సదవకాశం నూతన అధ్యాయాన్ని ప్రారంభించిందనే విశ్వసిస్తున్నాను ●

డాక్టర్ వాసూస్ కేశరాజ్ హెయిర్ ఆయిల్

చిన్నవయసులోనే జుట్టు నెరిసిపోతుందా?

కేశరాజ్ వాడండి కేశరాజ్ లోని 1 ఆమలక 2. భృంగరాజ 3 మందార 4 మధుయష్టి 5 గోరింట 6 బోడతరం మొదలైన మూల ద్రవ్యములు, 7 కృష్ణాగరు 8 భల్లాతకి 9 కరవీర 10 గురివింద 11. సోమరాజీ 12 సునాముఖి 13. సిరి 14. వెల్లుల్లి మొదలైన ఉప ద్రవ్యములను బాలనెరుపును రూపుమాపుతాయి నల్లగా నిగనిగలాడే జుట్టును ప్రసాదిస్తాయి.

జుట్టు ఎందుకు వూడిపోతుంది?

వైటాయిల్, డీసెల్ ఆయిల్ మొదలైన మట్టినూనెలతో కల్తీచేయబడిన చౌకబారు తలనూనెలు వాడడంవల్ల వెంట్రుకల కుదుళ్ళు దెబ్బతింటాయి నీటికంపు పోగొట్టడానికి గుప్పుమని వాసనకొట్టే చౌకరకం సెంట్లు కలుపుతారు తాత్కాలికమైన సువాసన చౌకగా వస్తుందిగదాఅని ఆశపడితే జుట్టును క్రమంగాపాడుచేస్తాయి

కేశరాజ్ లోని 1, 2, 3, 4, 7, 11, 13, 14 మూలికలేగాక 15. వేప 16. మల్లె 17 పొగాకు 18 చేమంతి మొదలగు ద్రవ్యములు వెంట్రుకల కుదుళ్లనుత్తేజపరుస్తాయి జుట్టు వూడడం ఆపు చేస్తాయి మృదువైన జుట్టును పొడుగ్గా, ఒత్తుగా పెంచుతాయి.

మెదడుకు పని ఎక్కువ అవటంవల్ల, నిద్ర లేకపోవడంవల్ల వేడిచేసి జుట్టు వూడిపోతుంది

కేశరాజ్ వాడితే అందులోని 1, 2, 3, 4, 10, 15, 18లేగాక 19 చందన 20 నందివర్ధన 21. వట్టివేళ్ళు, 22 సంపెంగ 23 కాంచన మొదలైన ఓషధులు మెదడుకు చలువచేస్తాయి జుట్టు వూడడం ఆపు చేస్తాయి చక్కటి సుఖనిద్రనిస్తాయి.

చుండ్రువల్ల జుట్టు వూడిపోతుంది

ఇది మొండి వ్యాధి కేశరాజ్ వాడితే క్రమంగా తగ్గుతుంది కేశరాజ్ లోని 3, 5, 7, 10, 15 మూలికలే గాక 24 పారిజాత, 25. మదనానల 26 శీతాఫల 27 దవనము మొదలైన ఇతర ఓషధులు చుండ్రును నిర్మూలిస్తాయి. ఆరోగ్యవంతమైన కేశ సంపదను కలుగజేస్తాయి.

కేశరాజ్ తలనొప్పిని తగ్గిస్తుంది

ఎండ, నిద్రలేమి, మానసిక పరిశ్రమలవల్ల తలనొప్పి కళ్లమంటలు వస్తాయి కేశరాజ్ లోని 1, 2, 4, 9, 10, 12, 20, 22 మూలికలే గాక 28 గులాబీ 29 కలువలు తలనొప్పిని తగ్గిస్తాయి రాకుండా చేస్తాయి సుఖనిద్రనిస్తాయి.

కేశరాజ్ జ్ఞాపకశక్తిని వృద్ధిపరుస్తుంది

మెదడుకు పని ఎక్కువవుతే మొద్దుబారుతుంది కేశరాజ్ లోని 1, 2, 6, 15లేగాక 30 బ్రాహ్మీ మెదడును ఉత్తేజపరుస్తుంది జ్ఞాపక శక్తిని వృద్ధిపరుస్తుంది.

కేశరాజ్ మెడికేటెడ్ వెల 4 oz రూ 3 00

డాక్టర్ వాసూస్ కేశరాజ్ మెడికేటెడ్ హెయిర్ ఆయిల్ 1 ఆమలక, 2 భృంగరాజ, 3. బ్రాహ్మీ, 4 వేప, 5 గోరింట, 6 చందనం, 7 బోడతరం, 8 మధుయష్టి మొదలైన మూలద్రవ్యములతోను, 9 శీతాఫల, 10 కృష్ణాగరు, 11 మదనానల, 12 గురివింద, 13 పుగాకు, 14 సిరి, 15 వెల్లుల్లి, 16 వట్టివేళ్ళు, 17 దవనము, 18 భల్లాతకి, 19. కరవీర, 20 సునాముఖి, 21 సోమరాజీ మొదలైన సహాయద్రవ్యములతోను, 22 మల్లె, 23 మందార, 24 పారిజాత, 25 నందివర్ధన, 26 కాంచన, 27 గులాబీ, 28 కలువ 29 సంపెంగ, 30. చేమంతి, పుష్పములతోను తయారు చేయబడినది కేశరాజ్ మెడికేటెడ్ శిరోజములకు సంబంధించిన వ్యాధులన్నిటినీ తగ్గిస్తుంది.

కేశరాజ్ ఎసెన్సు వెల 2 oz రూ. 2 00

పైన చెప్పిన మూలికలన్నీ ఇందులో వుంటాయి దీనిని యధాతధంగా వాడకూడదు 150 గ్రాములు కొబ్బరినూనెలో కలపాలి పైకీ, క్రిందకు 100 సార్లు గట్టిగా గుంజాలి అప్పుడు కేశరాజ్ మెడికేటెడ్ తయారవుతుంది కేశరాజ్ మెడికేటెడ్ వలెనే ఇదిగూడ శిరోజములకు సంబంధించిన వ్యాధులన్నిటినీ తగ్గిస్తుంది

కేశరాజ్ జనరల్ వెల 8 oz రూ 3 75

దీనినివాడితే మెదడుకు చలువ చేస్తుంది నిద్రపట్టిస్తుంది జ్ఞాపకశక్తి వృద్ధిపరుస్తుంది కేశ రక్షణకు, కేశపోషణకు, కేశవృద్ధికి, బాగుగా పని చేస్తుంది కేశములకుసంబంధించిన వ్యాధులనురాకుండా ఆపుచేస్తుంది కేశములకు సంబంధించిన వ్యాధులున్నవారు కేశరాజ్ మెడికేటెడ్ వాడడంమంచిది కేశరాజ్ జనరల్ హెయిర్ ఆయిల్ ఆమలక, భృంగరాజ, బ్రాహ్మీ, మందార, పారిజాత, వేప, గోరింట, చందనం మొదలైన ముఖ్యద్రవ్యములతో తయారు చేయబడినది

జుట్టు చిన్నప్పుడే ఎందుకు నెరుస్తుంది? జుట్టు ఎందుకువూడిపోతుంది? చుండ్రుఅంటే ఏమిటి? ఎలా తగ్గుతుంది? బట్టతల తగ్గుతుందా? పేను కొరుకుకు మందు ఏమిటి? జుట్టు ఒత్తుగా పొడుగ్గా ఎలా పెరుగుతుంది? జుట్టును ఆరోగ్యంగా వుంచుకోడం ఎలా?— మొదలైనవానికి శాస్త్రీయమైన మైన సమాధానములతో గూడిన పుస్తకంకావాలా? ఈ క్రింది ఎడ్రసుకు 25 పైసల పోస్టు స్టాంపులు పంపండి

Dr. Vasu Products, Phone: 53111, Hyderabad-27

సీరియల్

హృదయం చిగిర్చింది

కె. రామలక్ష్మి

జరిగిన కథ

రమ బావగారు ఆమెని కాలేజీ లేడీస్ హాస్టలులో చేర్చి వెళ్లిపోతాడు. వార్డెను సరళని పిలిచి రమని పరిచయం చేస్తుంది. సరళ చలాకీపిల్ల. రమతో బాగా స్నేహం ఏర్పరచుకుంటుంది. కొత్తగా వచ్చిన లెక్చరరు రామారావు రమపై మోజు చూపిస్తూ వుంటాడు. రమా, సరళా ఇద్దరూ ఆ విషయాన్ని గ్రహిస్తారు. రమతో రామారావును కలిపి కాలేజీ పిల్లలు అల్లరి చేయడం మొదలెడతారు. రామారావు సరళని రమ దగ్గరికి రాయబారం పంపుతాడు. తల్లికి సుస్తీ చేసిందని విన్న రమ చూసిరావటానికి వెళ్తుంది. బావతో రామారావు సంగతి చెప్పి అతన్ని ఒప్పిస్తుంది. రమ రామారావు లిద్దరికీ రిజిస్ట్రార్ ఆఫీసులో వివాహం అయిపోతుంది.

6

'రండి పోయి లోపల కూర్చుందాం,... వీధి తలుపులు తెరచిఉన్నాయి' అంది. అందే గాని అతని కౌగిలినుండి విడిపించుకునే యత్నం చేయలేదు.

'రమా నువ్వు నన్ను తీయగా బాధ పెడుతున్నావు. నీకేం శిక్ష విధించాలో తెలియడంలేదు' అంటూనే సగం విడిన రమ పెదవులపై తన పెదవులు ఆన్చాడు. అప్రయత్నంగానే తన చేతులు అతని మెడకి పెనవేసింది రమ; విడని కౌగిలిలో వంటింటి గుమ్మంలో అలాగే ఉండి పోయారు వారు. రమ పెట్టిన కెటిల్ సంగీతం పాడ్డం మొదలు పెట్టింది.

'చెప్తానన్న సంగతి చెప్పనేలేదు' అంది అతని గుండెలపై తల ఆన్చుకుంటూ.

'నా దగ్గర కూడా నువ్వు నీ ప్రేమని దాచుకుంటున్నావు. నీ కెందుకు చెప్పాలి?' విషాదంగా అన్నాడు రామారావు.

'నేను ప్రేమ దాచుకోలేదు ... మీకా సంగతి తెలియదా?' అడిగింది.

'తెలిసింది కనకే అంటున్నాను ... రమా, అలా చేతులు పెనవేసి నన్ను ప్రేమగా...' అతనిమాట మధ్యలోనే ఆపింది రమ.

'మీకు కొంచెం కూడా దాపరికంలేదు సరి కదా నా సిగ్గు కూడా తీస్తున్నారు.' కోపంగా స్టౌకేసి నడిచింది రమ.

చెదరిన క్రాపింగు మునివేళ్లతో సవరించుకుంటూ హాల్లోకి దారి తీశాడు రామారావు.

'రమా, సుందరం ఉత్తరం రాశాడు. రెండు నెల్లాయి నువ్వేమంత జాగ్రత్తగా ఉత్తరాలు వ్రాయడంలేదుట. అందుకని నాకు కాలేజీకి వ్రాశాడు' తిరిగి తన కుర్చీలో కూర్చుంటూ గట్టిగా చెప్పాడు రామారావు.

ఆత్రంతో పరుగెత్తుకు వచ్చింది రమ. 'ఏమిటి విశేషాలు వ్రాశాడు?' అంటూ.

'నువ్వు ఉత్తరాలు వ్రాయడం లేదుట... వాళ్లందరినీ మరిచిపోయావా? అంటూ రాశాడు' పక్కనే నిలబడ్డ రమని కుర్చీ చేతిమీదకి లాక్కున్నాడు.

'పాప ఎలా ఉందిట?' ఆత్రంగా అడిగింది రమ.

'కొత్త కొత్త మాటలన్నీ చెప్తోందిట. జానకి దానికి 'డాడీ' అన్నమాట చిలక్కి చెప్పినట్టు చెప్పిస్తోందిట'

రమ చేయి తన మెడచుట్టూ వేసుకుంటూ చెప్పాడు రామారావు.

రమ నవ్వుకుంటూ వంగి అతని బుజం మీద తలవాల్చుకుంది.

'అవును. అది చిలకలాగే కబుర్లు చెప్తుంది' అంది తనలో తనుగా.

ఇద్దరూ కబుర్లు చెప్పుకుంటూ కూర్చుండగానే బాగా చీకటిపడిపోయింది. ఇంకా దీపం కూడా వేయలేదు రమ. అలాగే ఒరిగి రామారావు కౌగిలిలో ఇమిడిపోయింది.

'నూతన దంపతులకి ఏకాంతంలో చీకటి కాక ఏం కావాలిట?' అంటూ వేళాకోళం చేశాడు.

'భోజనం మేష్టారూ' అంది వెనక బెంచిలో కూర్చున్న విద్యార్థిలాగా.

నవ్వుతూ కౌగిలి బిగించాడు 'అలాగా' అని.

కాలం త్వరగా గడిచిపోతోంది. రామారావుని కాలేజీకి పంపాక రమకి విశ్రాంతి. అలా విశ్రాంతిగా కూర్చున్నప్పుడే పాపమీద వెర్రి బెంగ పుట్టుకు వస్తోంది రమకి. 'పాపే ఇక్కడ ఉంటే ఇంకా హాయిగా ఉంటుంది నాకు' అన్న కోరిక పీడించసాగింది. ఆయన కెలాగ చెప్పడం? అని ఆలోచించి దారి తోచక ఊరుకునేది... రోజుకి రోజు ఒక పద్ధతిలో జీవితం సాగిపోవడం ప్రారంభించింది దానితోపాటే తీరిక ఎక్కువ కాజొచ్చి తీరుబడి ఎక్కువ కావడంతో–పాప తన దగ్గిరే ఉంటే బాగుండునన్న బెంగ, కోరిక, మరీ ఎక్కువ కాజొచ్చింది. ఊపలేక ఒకరోజున రామారావుతో అంది.

'ఈసారికి ఊరుకి వెళ్లినప్పుడు పాపని తీసుకువస్తాను–ఏమంటారు?' అని.

'ఏమనడం ఏమిటి రమా, తీసుకురా, లేకుంటే సుందరానికి వ్రాయి–తీసుకువచ్చి దిగబెట్టమని' అన్నాడు రామారావు.

అలాగే రమ ఉత్తరం వ్రాసింది కాని దానికి జవాబుగా సుందరం 'పాపని కొన్నాళ్లపాటు నా దగ్గిర పెరగనీ, నువ్వు జీవితంలో బాగా సద్దుకున్నాక తీసుకు వెళ్దువు గాని' అని వ్రాశాడు

దాన్ని రామారావుకి చూపెట్టింది రమ.

రమని తన కౌగిట చేర్చుకుని, 'మీ సుందరం బావకి కొంచెం బుర్ర తక్కువ. ఈసారి వెళ్లినప్పుడు నువ్వే తీసుకువచ్చేయి పాపని' అన్నాడు నవ్వుతూ.

రమకి కొండంత ఆనందం కల్గింది. అనుకున్నాక ఓ వారం కూడా గడపక రమ ఊరుకి ప్రయాణం కట్టింది.

* * *

రమ బస్సు దిగి ఇంటికేసి గబ గబ నడక సాగించింది. ఆమె మనసు ఉత్సాహంతో ఊగిసలాడుతూంది. తన కన్నతల్లి తనతో పాటే ఇక, అని జ్ఞాపకం వచ్చినప్పుడల్లా ఒళ్లు పులకరిస్తూంది.

సుందరం అరుగుమీద కూర్చుని ఉన్నాడు.

దూరంనుంచే రమ రావడం కనిపించింది తనికి. రమలో కొత్త హుందా కనిపెట్టాడు. ఉత్సాహంగా పడుతూంది ఆమె అడుగు. మనిషి తీరులో కూడా మార్పు వచ్చింది. తెల్లగా అందంగా కనిపించింది రమ.

సుందరం చూస్తూండగానే ఇల్లు చేరింది రమ. చేతి సంచి అరుగుమీద పడేస్తూ తనకేసే చూస్తున్న సుందరాన్ని అడిగింది.

'ఏదేమిటి బావా కొత్త మనిషిని చూస్తున్నట్టు చూస్తున్నావు?'

'నువ్వు కొత్త రమవే. నువ్వెంత మారేవో తెలుసా?' అడిగాడు.

'అంతా ఏరీ? ఇల్లింత నిశ్శబ్దంగా ఉందేం?' లోపలికి దారితీస్తూ అడిగింది.

'అంతా పడుకున్నారు. ఏం ఇంత హఠాత్తుగా బయలుదేరి వచ్చావు?' వెనకవే లోపలికి వస్తూ అడిగాడు సుందరం.

రమ వచ్చిన సందడికి జానకి లేచి వచ్చింది. ఆమె వెనకనే పాప నడిచివచ్చింది పాపని అమాంతం ఎత్తుకుని గుండెల కదుముకుంది రమ. జానకి రమకేసి కన్నార్పకుండా చూస్తూంది.

'ఏమిటి జానకీ నువ్వూ బావలాగే చూస్తున్నావు?' అంది నవ్వుతూ రమ.

'నువ్వు బాగా మారిపోయావు రమా' అంది నెమ్మదిగా.

రమ తల్లి కూడా లేవారు. ఇల్లంతా ఓ క్షణంలో కలకల్లాడింది.

'ఏం తల్లీ ఉత్తరం పత్తరం లేకుండా వచ్చేశావు?' ఆత్రంగా అడిగారు రమ తల్లి.

'పాపని తీసుకెళ్లాలని బయలుదేరి వచ్చేనమ్మా, నాకేం తోచడంలేదు' అంది తల్లి మంచం పట్టెమీద కూర్చుంటూ. కూతురు చేయి నిమురుతూ కూర్చున్నారామె.

'నీ సొత్తు ఎప్పటికేనా నీ దగ్గరకి రావలసిందే కదూ? అప్పుడే ఏం తొందర?' అంది జానకి.

'ఇంట్లో ఒక్కర్తెనీ ఉంటూంటే పొద్దుపోవడంలేదు' అంది రమ.

'అ తేనా? లేక మేం...' ఏదో అనబోయింది జానకి.

'అది నిజమేలే జానకీ, పాపని రమ



హృదయం పొంగింది

తీసుకువెళ్ళడమే మంచిది. నీకు నేనుంటా నుగా!' హాస్యంగా అన్నాడు సుందరం. జానకి ముఖం సిగ్గుతో కందగడ్డలా అయింది.

ఆ రాత్రి అంతా నిద్రపోతున్నా జానకీ రమా ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ అరుగుమీద కూర్చున్నారు.

రమను ఏమేమిటో అడుగుతూంది జానకి.

రమ ఉత్సాహంగా బదులు చెప్తూంది.

'నీ కోసం నేను మొక్కని దేవుడంటూ లేడు రమా, జీవితంలో నువ్వు నిశ్చింతగా స్థిరపడేదాకా నాకు సంతానం కూడా వద్దనుకున్నాను' అంది జానకి.

'జానకీ...' అంటూ జానకిని కౌగలించుకొంది రమ.

'నా కోసం నువ్వింత కొరత పెట్టుకోవడం ఏమిటి?' అంది దుఃఖంగా.

'లేదు లేదు. నాకూ మీ బావకీ యీ విషయంలో భేదాభిప్రాయం ఉంటే కదా బాధపడ్డం. మా యిద్దరిదీ ఒకటే ధ్యేయం రమా. నువ్వు హాయిగా ఉంటె తప్పించి మేం ఆనందంగా ఉండలేం. ఈ సంగతి మరిచిపో వు కదూ!' ప్రాధేయపడుతున్నట్టు అంది జానకి.

'నే నెలా మరిచిపోతాను? వన్నిలా కంటికి రెప్పలా చూసుకునే నిన్ను నే నెలా మరిచిపోతాను జానకీ, నా కింకే బెంగా లేదు జానకీ, వారు నన్నూ, నేను వారినీ పూర్తిగా అర్థం చేసుకున్నాం.' అంది రమ.

'జీవితంలో ఆడది కోరదగిన దంతకు మించి ఉండదు రమా.'

వారితో ఎన్నాళ్ళనుంచో చెప్పాలని— పాప సంగతి— కాని చెప్పలేకపోయాను. చివరికి మొన్న చెప్తే, సుందరం బావకి వ్రాయమన్నారు. బావేమో కొంతకాలం పోనీ మన్నాడు.. దానికి వారేమన్నారో తెలుసా? 'మీ బావకి కొంచెం బుర్ర తక్కువ రమా' అన్నారు' నవ్వింది రమ

'నీ విషయంలోనూ పాప విషయంలోనూ వారికంతే రమా. హృదయం తప్ప బుర్ర పనిచెయ్యదు' తనూ నవ్వింది జానకి.

'అందుకే ఆయన నన్నే వెళ్ళి తీసుకురమ్మన్నారు జానకీ, నా జీవితంలో వారు ప్రవేశించడం నిజంగా నా అదృష్టం కదూ?'

'తప్పకుండాను. జీవితంలో కష్టాలు సుఖాలు, ఒడిదుడుకులు వచ్చినా భర్త మంచివాడు దొరికితే వాటన్నిటినీ అతి సులభంగా కొట్టిపారేస్తుంది ఆడది. దేవుడు నీ విషయంలో దయతో చూశాడు రమా, నిజంగా నే నువ్వు అదృష్టవంతురాలివి.' అంది జానకి

'రేపు పన్నెండుగంటల బస్సుకి వెళ్ళిపోతాను... పాపని తీసుకుపోతే నీకు బెంగగా ఉంటుంది కదూ?'

'పరవాలేదు. అలవాటైంది కదా. పాపని బెంగపడకుండా చూసుకోవాలి నువ్వు' ఆర్ద్రంగా అంది జానకి.

ఉదయాన్నే లేచి పాపకి తలంటు పోసింది జానకి. కొత్త చొక్కా తొడిగింది. చిన్న చిన్నగా ముద్దు ముద్దుగా జానకితో కబుర్లు చెప్తూన్న పాపని చూస్తూ రమ మాతృహృదయం పొంగింది. 'ఎవరు చేరదీస్తే వారికి సన్నిహితంగా తయారవుతారు కాబోలు పిల్లలు. జానకితో మాట్లాడినంతగా రమతో మాట్లాడ లేదు పాప. చనువుగా దగ్గరకి వచ్చినా జానకి దగ్గరకు వెళ్ళినంత ఆత్రంగా తనదగ్గరకి రాదని గ్రహించింది రమ. తన దగ్గర చనువైతే అదే దగ్గర అవుతుంది' అనుకుంది.

పాప బట్టలన్నీ ఒక సూట్‌కేసులో సర్దింది జానకి. దాని ఆట సామానులన్నీ ఒక బాస్కెట్‌లో సదిరింది. ఊరుకో ఎక్కడికో వెడుతున్న సరదాలో హుషారుగా ఉంది పాప.

పనివాడు పెట్టె, బుట్టా అన్నీ పట్టుకుని బస్సు స్టాండుకి నడిచాడు. సుందరంబావ పాపని ఎత్తుకున్నాడు.

అప్పటిదాకా ఉగ్గపట్టుకునిఉన్న జానకి కంట తడి పెట్టింది.

రమ తల్లిమటుకు ధైర్యంగా ఉన్నారు. ఆమె తేలికగా నిట్టూర్చారు. 'సుఖంగా బ్రతుకు తల్లీ' అంటూ మనసులోనే దీవించారు కూతుర్ని. జీవితం తనకూతురికింకో అవకాశాన్ని ప్రసాదించినందుకా తల్లి హృదయం ఆనందంతో నిండిపోయింది.

'వెళ్ళొస్తానమ్మా' అంది తల్లితో.


'వెళ్ళిరా తల్లీ, చల్లగా వెళ్ళు.' అన్నారామె.

'జానకీ బస్సుస్టాండుకి వస్తావా?' మృదువుగా అడిగాడు సుందరం.

'రాను బావా, నువ్వెళ్ళి ఎక్కించు' అంది నెమ్మదిగా.

'వెళ్ళొస్తాను జానకీ, అమ్మ జాగ్రత్త. మళ్ళీ త్వరగావచ్చి చూస్తానులే' అంటూ ధైర్యంచెప్పి ముందుకి సాగింది రమ

బస్సులో కూర్చోపెట్టి కిందికి దిగాడు




దినదినానికీ...
సుందరం...అధిక సుందరం...అధికాధికసుందరం
కేడిల్ గల రెక్సోనా చమత్కారం
Rexona
రెక్సోనాలో మాత్రమే
గలదు కేడిల్-
4 సౌందర్యకారియైన
నూనెల మిశ్రమం
స్నానానంతరం సహితం
మిమ్ములను సువాసనగా వుంచే
పరిమళం రెక్సోనాలో గలదు.
హిందుస్థాన్ లీవర్ ఉత్పత్తి

సుందరం. బస్సు అప్పుడే నిండిపోయింది. 'మరేవేళ్ళ బావా బస్సిక బయలుదేరుతుంది' అంది రమ.

'జాగ్రత్త రమా, వాటిగ్గిరేప్పుడూ ఏ విషయం దాచకుండా ఇలాగే ఉండు. మనం అంతా ఒకటన్న సంగతి మరచి పోకు. ఏం?' అన్నాడు.

'నేనెలా మరిచిపోతాను బావా?...మళ్ళీ సెలవులకి అంతా కలిసే వస్తామని చెప్పు జానకికి...బావా, జానకికి నువ్వన్యాయం చేశావు! దానికి నేనే కదూ కారణం?' వినీ వినబడనంత నెమ్మదిగా అడిగిందది రమ.

'జానకికి నేనెప్పుడూ అన్యాయం చెయ్యను రమా. అలాంటి స్త్రీ చాలా అరుదుగా లభ్యం అవుతుంది పురుషునికి.' అన్నాడు సుందరం.

బస్సు కదిలింది.

కనబడినంతదాకా చూస్తూ కూర్చుంది రమ. బస్సు మలుపు తిరిగింది. సుందరం కనుమరుగయ్యాడు.

ముందు తిన్నని రోడ్డు పరచుకుని ఉంది.

బస్సు సాఫీగా సాగిపోసాగింది.

పక్క సీటులో కూర్చున్న పాప జోగడం మొదలుపెట్టింది. రమ పాపనెత్తి తన ఒళ్లో పడుకోబెట్టుకుంది. పాప అమ్మ గుండెలకి ముఖం ఆన్చి హాయిగా నిద్ర పోయింది.

ముందు జీవితాన్ని గురించిన ఆలోచనలు

హృదయం చిగిర్చింది

రమ నెక్కడెక్కడికో తీసుకుపోయాయి. ఊహల మేఘాల మధ్య బస్సు ప్రయాణంలో జరిగిన ఆలస్యం కూడా గుర్తించ లేదు రమ.

సిటీ స్టాండుకి బస్సువచ్చి ఆగేసరికి ఒక్క ఉదుటున తేరుకుంది రమ. దిగి టాక్సీ మాట్లాడి సామాను పెట్టించింది.

* *

ఇల్లు చేరేసరికి రమ పూర్తిగా అలసి పోయింది. పాపను ఇంట్లోకి ఎలా ఆహ్వానిస్తారో అన్న ఆలోచన రాగానే నిస్పృహ ఆవరించిందామెని.

కాని రమ ఎదురు చూసినదేమిటో గాని రామారావు టాక్సీ ఆగగానే ఇవతలికి వచ్చి కారు తలుపు తెరిచాడు.

'నీ కోసం నే నెంత తొందరపడ్డానో తెలుసా పాపా! రా చూస్తావుగా!' అంటూ పాపని అందుకున్నాడు.

రమ తేలికగా నిట్టూర్చింది. సామాను దింపించి టాక్సీని పంపేసింది.

రామారావు చిన్న బొమ్మలకొట్టు సిద్ధం చేశాడు పాపకోసం. ఆనందంతో రమ కళ్ళు చెమర్చాయి.

'ఇన్ని బొమ్మలు ఒక్కసారే ఎందుకు? అప్పుడప్పుడు కొంటారుగాని' అంది నుంద లింపుగా.

'చూశావా? అప్పుడే సాధిస్తున్నావు.' అన్నాడు రామారావు.

'లేదండీ, అప్పుడూ అప్పుడూ కొంటూనే ఉండాలికదా అని అన్నాను' అంది అతని పక్కగా కూర్చుంటూ.

పాప బొమ్మలన్నీ ఒక్కొక్కటే తీసి పరీక్షిస్తోంది. దాని ధ్యాసలో అది పడి ఉండడం చూసి రామారావు రమ చెంప మీద చిన్నముద్దు పెట్టుకున్నాడు.

'నే నెవర్ని పాపా?' ముద్దుగా పాపని అడిగాడు.

'డాడీ' అంది పాప. చిన్న బొమ్మకారు తల్లకిందులు చేసి చూస్తూ.

దంపతు లొకరిముఖా లొకరు చూసి సన్నగా నవ్వుకున్నారు. పాప ఒప్పుకోవడంతో ఏదో తెలియని సమస్య కాస్త చటుక్కున పరిష్కారం అయిందనిపించింది వారికి.

ఆ రాత్రి నిశ్చింతగా నిద్రపోయింది రమ!

ఆ రాత్రి రమ తనకి మరింత సన్నిహితం అయిందనిపించింది రామారావుకి.

పాప ఏ బెంగాలేకుండా హాయిగా నిద్ర పోయింది.

పాప వచ్చిన దగ్గిరనుండీ రమకి తోచక పోవడం అంటూ లేదు.

ఉదయం లేచింది మొదలు అటు రామారావుకీ ఇటు పాపకీ కావలసినవన్నీ అమర్చడంతో సరిపోతుంది.

ఎంతోపనిగా ఉంటే 'ఏయ్ రమా ఇలా వచ్చిచూడు పాప ఏంచేస్తుందో' అంటూ పెద్దపని ఉన్నట్టు పిలుస్తాడు రామారావు. తీరావచ్చిచూస్తే పాప ఏ కర్రబ్లాకులో నిరారుగా నిలబెట్టి ఉంటుంది!

అంతకుమించిన పెద్దవింత ఉండదు.


'దీనికా ఇంత కేకవేశారు?' అంటుంది నవ్వుతూ.

'నువ్వలా నిలబెట్టు చూద్దాం' అంటూ పాపా అమ్మని పెట్టమను' అని పాపని ఉసికొల్పుతాడు రామారావు. అంతే పాపది మంకుపట్టు వాదా అంటూ ఇరక వదలి పెట్టదు.

'నువ్వుపెట్టు' అంటుంది. 'నువ్వే కట్టు' అంటుంది.

స్టౌ ఆర్పివచ్చి కూర్చోవలసిందే!

ఒక్కొక్కప్పుడు పాప అర్ధరాత్రి లేచి కూర్చుంటుంది. రెండేళ్లు దాటి పోతున్నాయేమో, గట్టిగా జోకొట్టే ఊసే



కూడా పడుకోపెట్టడం' కష్టం.

అలాంటప్పుడు రామారావు తిరి కూర్చుంటాడు. ఆ అపరాత్రివేళ లైటు వేసి పాప అడమన్న ఆటలన్నీ ఆడతాడు. దానికే ప్రాణం విసిగిపడుకునే దాకా కూర్చుంటాడు అతని ఓపికకు రమ అప్పుడప్పుడు ఆశ్చర్యపడుతూ ఉంటుంది పడుకోపెట్టుకుని జో కొడతాను ఆదే నిద్రపోతుంది' అంటుంది.

'పోనీలే ఆడుకోవాలనుందేమో'అంటాడు పాప మనస్సులోకి తొంగి చూసి తెలుసుకున్నట్టు. రామారావు మనస్సులోనూ హృదయంలోను కూడా పాప గూడు కట్టుకుంది కాలేజీకి వెళ్ళేముందు వచ్చి రాగానే తొలి ప్రశ్న 'పాపేదీ?' అన్నదే. 'నాకు దాన్ని చూస్తే అసూయిగా ఉంది'అంటూంటుంది రమ వేళాకోళంగా. 'ఏం తెచ్చినా దానికే తెస్తారు' అని సాధిస్తుంది అప్పుడప్పుడు

ఇద్దరిమధ్యా పాప మమతల వంతెన కట్టింది అది నానాటికీ బలపడుతుందే గాని సడలిపోవడంలేదు.

పాప ఏం చేసినా రామారావుకి ఆశ్చర్యమే గొప్పే పుస్తకాల్లో కాగితాలు చింపేస్తే కూడా కోప్పడడు. రమే కేక వేస్తూ ఉంటుంది

'ఇదే అలవాటైతే కష్టం' అంటుంది.

'పెద్దదైతే ఎందుకు చింపుతుందిలే రమా' అంటూ పాపకే సైదు చేస్తాడు రామారావు.

పాప వచ్చాక సాయంత్రం అటూ ఇటూ వెళ్ళడం కూడా తగ్గించాడు రామారావు ఇంట్లోనే కూర్చుని పాపచేత అల్లరి చేయిస్తూ, దానితో సమానంగా తనూ చేస్తూ కాలక్షేపం చేస్తాడు.


'నాకిద్దరు పిల్లల్ని ఆదుపులో పెట్టవలసి వస్తుంది' అంటుంది రమ.

రోజులెలా గడుస్తున్నాయో తెలియకుండా వెళ్ళిపోతున్నాయి. కాలేజీ ఇల్లూ తప్పించి ఇక వేరు ప్రపంచం లేనంతగా తయారై కూర్చున్నాడు రామారావు

ఆరోజు సాయంత్రం పాపని తీసుకు సినిమాకి వెడదాం అన్నాడు రామారావు.

'అది చూడదు మనని చూడనివ్వదు పోనీ మీరు వెళ్ళిరండి' అంది రమ

'నువ్వు రాకపోతే నేనూ వెళ్ళను.'



హృదయం చిగిర్చింది

అంటూ సినిమా ప్రోగ్రామ్ తోసేశాడు రామారావు.

ఎప్పటికప్పుడిలాగే అయిపోతోంది. చివరికి రమ అనుకుంది. 'అలవాటు చేసుకోవాలి కాని ఎలా?' అందుకే 'సరే ఈ రోజు వెడదామా?' అని అడిగింది. ఉదయం రామారావు కాలేజీకి బయలుదేరుతూంటే.

రామారావు ఆమాట నమ్మలేక పోయాడు.

'నువ్వు పాతో బయటికి వస్తావా?' ఆశ్చర్యం నటిస్తూ అడిగాడు.

రమ చిన్నబుచ్చుకుంది.

'అలా అంటారేమిటి?' నాకు మటుకు తిరగాలనీ అన్నీ చూడాలనీ ఉండదా?' నెమ్మదిగా అంది.

'నేనెన్నాళ్లనుంచి పిలుస్తున్నానో కూడా తెలుసుగా? పాప ఉంటేమటుకు ఏం? పడవ దిగనివ్వదా ఏం?' అంటూ రమ బుగ్గమీద చిటిక వేశాడు, కోపం రానందుకు సంతోషించింది రమ.

'సాయంత్రం నేనూ పాపా సిద్ధంగా ఉంటాం. మీరు రాగానే తెమిలి వెళ్లిరావచ్చు' అంటూ రామారావుని సాగనంపింది.

రామారావు తృప్తిగా కాలేజీకి నడిచాడు.

ఆ సాయంత్రం ఎంతో ఉత్సాహంగా వీధి తలుపులు తాళంవేసి మెట్లు దిగాడు రామారావు. తెల్లని చీర కట్టుకున్న రమ అపర రతీదేవిలాగా కనిపించిందతని కళ్లకి. చక్కని గౌను తొడిగింది పాపకి గుబురుగా ఉన్న జుట్టులో ఎర్ర రిబ్బను కుచ్చు ముద్ద మందారంలాగా ఉంది. పాప కిష్టమైన గుడ్డ బొమ్మ పాప చేతిలోంచి వేలాడులోంది. 'ఇదెందుకు?' అని తీసేయబోతే 'వాడూ వత్తాడు' అని మారాం చేసింది పాప. సరేనని ఊరుకుంది రమ.

'ముందు హోటలుకివెళ్లి కాఫీ తాగుదాం. అక్కణ్ణుంచి థియేటరుకి. ఏం?' అడిగాడు రామారావు. సరేనని తలాడించింది రమ.

కాఫీహోటల్లో అడుగుపెట్టారో లేదో రామారావుని చాలా కాలమై చూడని ఓ స్నేహితుడు ఎదురయ్యాడు. ఏమోయ్ అంటే ఏమోయ్ అని పలకరించుకుని ఓబల్ల దగ్గరకి నడిపించాడు.

రామారావు రమని పరిచయం చేస్తూనే 'రమా నాకు చాలాకాలం క్రిందట పరిచయం అయినవాడు యీ సుబ్బారావు. మావూరే' అంటూ రమకి చెప్పాడు.

కబుర్లతో సరదాగా ఫలహారాలు ముగించి కాఫీదాకా వచ్చారు.

'పెళ్లికి మమ్మల్ని పిలవనేలేదు కదూ!' అంటూ నిష్ఠూరం వేశాడు సుబ్బారావు.

'ఏం పెద్ద తతంగంతో పెళ్లిచేసుకోలేదోయ్. క్లుప్తంగా రిజిస్టర్ చేసుకున్నాం' అన్నాడు రామారావు ఉత్సాహంగా.

'అందులో ఎంత కూడబెట్టాలనో!' అంటూనే పాప బుగ్గనిమురుతూ 'ఈపాప ఎవరిపాప? అడిగాడు.

సుబ్బారావు యథాలాపంగానే అడిగినా ఆ ప్రశ్నకి అదరిపడ్డాడు రామారావు.

ఓ క్షణం పాపకేసీ రమకేసీ చూశాడు.

'మా పాపేనోయ్ ఇక లేద్దామా రమా' అంటూ పర్సుకోసం జేబులో చెయ్యి పెట్టాడు.

'మీరు ఈవాళ నా ఆతిథ్యం స్వీకరించాలి. మీ రివ్వకపోయినా నేనేనా యివ్వాలిగా మీ పెళ్లివిందు?' అంటూ కౌంటరు దగ్గిరకి నడిచాడు సుబ్బారావు.

పాపని ఎత్తుకుని మౌనంగా అవతలికి నడిపించింది రమ.

స్నేహితునికి వీడ్కోలిచ్చి రామారావు కూడా వచ్చాడు.

రామారావులో ఉత్సాహం చచ్చిపోయింది.

ఏదో ఆలోచనలో పడ్డవాడిలా నిశ్శబ్దంగా థియేటరుకి దారి తీశాడు.

జనం రద్దీగానే ఉంది. టికెట్లు తేవడానికి రామారావు ముందు సాగాడు.

పాపని పక్కన నిలబెట్టుకుని రమ నిలబడింది.

గుంపులు గుంపులుగా కుర్రాళ్లు టిక్కెట్లు కొనుక్కుందుకు వెడుతున్నారు. కొనుక్కుని వస్తున్నారు.

రమనీ పాపనీ చూసిచూడనట్టు చూస్తున్నారు.

'రడీమేడ్ సంసారంతో వచ్చారురా సార్' అంటూ ఒకడన్నాడు. అంతా గొల్లు

మంటూ ముందుకి సాగిపోయారు

రమ బెదురుగా టిక్కెట్టు కౌంటరు వైపు చూసింది ఈ మాట రామారావు చెవికి వినబడకపోతే బాగుండునని తల పోసింది

కాని ఏం లాభం!

పై తరగతి టిక్కెట్లు రెండుచేతిలో పట్టుకుని అప్పుడే రామారావు రమ కేసి నడిచివస్తున్నాడు కుర్రాళ్ల మాటలు వినక పోలేదు అలాగే నిలబడిపోయాడు అతని ముఖం ఆ క్షణంలో పాలిపోయింది

'పద పోయికూర్చుందాం' అని లోపలికి దారి తీశాడు

థియేటరులో కూర్చున్నారన్న మాటే గాని వారి మనస్సులక్కడా లేవు పాప ఊరికే వసపిట్టలాగా వాగుతోంది దాని కిదంతా కొత్తగా సరదాగా ఉంది దీపాలు, ఫాన్లు, జనం అంతా వింతగా చూస్తోంది.

ఉట్టినే ప్రశ్నలు వేస్తోంది

సినిమా ప్రారంభించారు అమ్మయ్య అనుకుని కుర్చీలో జేరబడింది రమ థియేటరులోకి వచ్చాక ఒక్క మాట మాట్లాడుకోలేదువాళ్లు. సినిమా పూర్తి కాకుండానే రామారావుకి వెళ్లిపోవాలని పించింది

మళ్లీ ఎవరేమంటారో, ఏం వినవలసి వస్తుందో అని భయం వేసింది

చీకట్లో రమ కేసి చూశాడు ఆమె కళ్లు చెదరని కన్నీటితో ఆ చీకట్లో మిలమిల మెరుస్తున్నాయి

'పద, దీపాలు వెలగకముందే వెళ్లి పోదాం' అంటూ చీకటిలోనే లేచి నిలబడ్డాడు రామారావు ఒక పక్క యింకా సినిమా సాగుతోంది అడ్డంగా నిలబడ్డందుకు వెనకవాళ్లు 'కూర్చో కూర్చో' అంటున్నారు ఏమిటంటున్నాడని బోధపరుచుకుని లేచి నిలబడింది రమ పాప భుజంమీదే నిద్రపోతూంది లేచి నిలబడిన రమ కాళ్లు వణికాయి. రామారావు వెనకవే మూగగా నడిచింది అవతలికి

'నువ్వూ పాపా రిక్షా ఎక్కి వెళ్లండి నేను నెమ్మదిగా నడిచివస్తాను అంటూ రమ బదులుకోసమేనా ఆగకుండా ఓ రిక్షా కుదిర్చాడు రామారావు 'రిక్షా వాడికివ్వు' అంటూ డబ్బులూ, తాళంచెవీ రమ చేతిలో ఉంచి ముందుకు సాగిపోయాడు రామారావు


ఖిన్నపడి రిక్షా ఎక్కి కూర్చుంది రమ పావని భుజంమీదనుంచి ఒళ్లోకి మార్చుకుంది ఎంతో ప్రశాంతంగా నిర్విచారంగా నిద్దరపోతున్న పాపకేం తెలుసు—తన తల్లి మనసులో చెలరేగిన సంఘర్షణ? — రమ కళ్లు చమర్చి వీధిలో దృశ్యాలన్నీ మసకగా కనబడసాగాయి ఇన్నాళ్లుగా గతం అంటే భయపడిపోయిన రమ ఇప్పుడు భవిష్యత్తు అంటే భయపడ్డం ప్రారంభించింది, ఇలా అయితే ఎలాగ? ఏం చేయాలి? దీనికి పరిష్కారం ఏమిటి? అంటూ మూగగా ఆలోచిస్తూ కూర్చుంది రిక్షాలో.

ఇంటిదగ్గరదిగి రిక్షావాణ్ణి పంపించేసి తలుపులు తెరచింది దీపాలు వెలిగించి పావని పక్కమీద పడుకోపెట్టింది

ఏదో తెలియనిభయంతో స్తబ్దమై పోయిందామె హృదయం రామారావు రాక కోసం ఎదురు చూస్తూ అలాగే హాలులో కుర్చీలో కూలబడింది

ఎక్కడో దూరంగా గడియారం పన్నెండు కూడా కొట్టింది రామారావు యింటికి రాలేదు తొమ్మిదింటికి బయలుదేరిన రామారావు ఏమైపోయినట్లు? అని దిగులుగా అలాగే కూర్చుంది.

పన్నెండున్నర కూడా దాటిపోయింది రామారావు హాల్లో అడుగు పెట్టేసరికి.



'ఇదేం ఇంత అలస్యం చేశారూ?' అంటూ లేచిముందుకి నడిచింది రమ

అలసిన రామారావు కళ్లు కళావిహీనంగా కాంతిరహితంగా ఉన్నాయి

'ఏం లేదు అలా చాలాదూరం నడిచి వచ్చాను నువ్వు నిద్రపోలేదా?' యథాలాపంగా అడిగాడు.

'మీకోసం చూస్తున్నాను మేష్టారూ' మార్దవంతో నిండిన కంఠస్వరంతో అంది రమ

'రమా' అంటూ చేతులు చాచి రమను తన హృదయానికి హత్తుకున్నాడు రామారావు

ఆ క్షణంలో రమ తనకెంత సన్నిహితం అన్నది గుర్తొచ్చినట్టు అనిపించింది. అలాగే ఆమె తలమీద తన చెంప నాన్చి గడచిన రోజులు మధురాతి మధురమైన రోజులన్నీ జ్ఞాపకానికి తెచ్చుకుంటున్నాడు.

'ఏమిటి? నిలబడే నిద్రపోతారా ఏం?' వేళాకోళంగా అంది రమ

'పదు పోయి పడుకుందాం' అంటూ రమని వదిలాడు

తిరిగివచ్చాక సినిమాదగ్గిర విషయం అసలు ఎత్తకపోవడం ఆశ్చర్యమే వేసింది రమకి కాని ఎన్నాళ్లిలా? అన్న ఆలోచన రాగానే తనే కదిల్చింది.

'ఎవరో కుర్రాళ్లు ఏదో అన్నారని అలా గంభీరంగా అయిపోయారెందుకు?' మాట వరసగా అంది

'ఆ క్షణం వాళ్లు అలా అనేదాకా నాకు తోచనేలేదు రమా మన చుట్టూ వాళ్లు ఇలా అంటారని. అంచేత అలా అదిరిపడ్డాను కొన్నాళ్లకి అదీ అలవాటై పోతుందిలే' పేలవంగా నవ్వుతూ పత్తిగిలి పడుకుని నిద్రకుపక్రమించాడు రామారావు

కళ్లు మూసుకుని నిద్రపోదామని ఎంతో ప్రయత్నించింది రమ కాని ససేమిరా నిద్రరాలేదు మనస్సులో పరిపరి విధాలైన ఆలోచనలు చెలరేగాయి ప్రశాంతంగా ఉన్న కొలనులో రాయి వేస్తే ఏమౌతుంది? రాయి పడ్డచోటె తరంగాలులేచి సమసిపోవుకదా? అవి కొలను అంచులదాకా ప్రాకుతాయిగాని మానవు

(ఇంకావుంది)

ఒకవారం విపరీతం

అభినవ పాతివ్రత్యం

అభినవ పాతివ్రత్యం అంటే ఏమిటో తెలుసా! వేలూరుకు సమీపంలో ఓ గ్రామంలో నలుగురు పిల్లల తల్లి అయిన సరస్వతి అనే ఆవిడ తనను



భర్త అనుమానిస్తున్నాడని, (ఆయన నిద్రపోతుండగా) ముఖం మీద అగ్ని ద్రావకం పోసేసిందట (27న) అతని ముఖం అంతా కాలి, మెలి తిరిగి పోయిందట పాపం!!

విగ్రహాలపై విదేశీయుల మోజు

హిందూదేశంలోని దేవాలయాల్లో దేముళ్లు యిటీవల మాయమవడం ప్రారంభించారు ఇదేదో దైవ మహత్యం అనుకోబోతుండగా విషయం తెలిసింది ముఖ్యంగా తిరుచ్చి, తంజావూరు ప్రాంతాల్లోని పురాతన దేవాలయాల్లో విగ్రహాలు పోతున్నాయనీ, ఈ విగ్రహాపహరణకు ముఠాలు పని చేస్తున్నాయనీ తేలింది మన వస్తువులన్నిటితో పాటు మన దేవుడి విగ్రహాలన్నా విదేశీయులకు మక్కువట అడిగితే మన యివ్వం కదాని వాళ్లే పట్టుకు పోతున్నారన్నమాట—భళి!!

*   *   *

మైసూరురాష్ట్రంలో హోపళ్లెలో రామాయణాన్ని ప్రదర్శించినందుకు ఆ హరిజనులను రాళ్ళతో కొట్టి చంపేశారట! రామాయణం అభినయించినందుకు ఇంత శిక్షా

సముద్రతీరంలో శవం


మద్రాసులో సముద్రపు ఒడ్డున 25 సంవత్సరాల వ్యక్తి శవం దొరికింది కత్తితో మెడ మీద, ఇతరచోట్ల పొడిచినట్టు గుర్తులున్నాయట ఎవరో హత్య చేసి సముద్రంలో పారేసి వుండాలని తీర్మానించారు. ఇంతకీ ఆ కుర్రాడెవరో అంతు దొరకనే లేదు

హత్యగా మారిన ఆత్మహత్య

ఢిల్లీ ఇర్విన్ ఆసుపత్రిలో నలుగురు నర్సులు చనిపోడానికి కారణం ఆత్మహత్యేనన్ని ముందు తేల్చినా "ఇది హత్యే" అని యిటీవల తేలిందట. సరోజ అనే ఆమె శవం పరీక్ష చేస్తే విషం సూది గుచ్చడం వల్ల ఆమె చనిపోయినట్టు తేలిందట. ఇంకా పీటికి సాలూ, మూలం తేలలేదు.

భార్యా హత్యా-ఆత్మహత్యా ప్రయత్నం

జాంబజారు (మద్రాసు) లో వుంటున్న జయరామన్ అనే అతనికి తన భార్య శీలం మీద అనుమానం వచ్చి, ఆనక అది నమ్మకమయిందట ఆమెను



పల్లావరంలో వున్న తన చెల్లెలింటికి తీసుకు వెళ్ళి, ఆరాత్రి (25 తేదీన) ఆమెను కత్తితో పొడిచి చంపేశాడట. ఆ భయంకర ఆర్తనాదానికి అతని చెల్లెలు లేచి రక్తం కారుతున్న కత్తితో వెళ్ళిపోతున్న అన్నయ్యనూ, రక్తపు మడుగులో కొట్టుకుని ప్రాణం వదులుతున్న వదిననూ చూసి భయకరంగా కేకలు వేసిందట జయరామన్ రైలు క్రింద తలపెట్టి ఆత్మహత్య చేసుకోడానికి పట్టాల మీద పడుకుంటే డ్రయివరు చూసి, రైలు ఆపి, అతనిని పోలీసులకు వప్పచెప్పాడట కోర్టు అతనికి మరణ శిక్ష విధించిందట—విధి

జెండా సంచులు

కాంగ్రెసుకు సంబంధించిన ప్రభుత్వాధికారులు (యమ్మెల్యేలు వగైరాలు) కాంగ్రెసు పతాకాలను సంచులుగా కుట్టించుకుని బజారు సరుకులు తెచ్చుకోడానికి వుపయోగిస్తున్నారని (బెంగుళూరులో)



ఎసెంబ్లి కమ్యూనిస్టు యం యల్ ఏ చెప్పారట. నడిబజారులో ఒక ఆఫీసరు (కాంగ్రెసు) గారి నౌకరు వద్ద నుంచి తను స్వాధీనపరచుకున్న సరుకుతో సహా వున్న కాంగ్రెసు జండా సంచీని ఆయన ఎసెంబ్లీలో హాజరుపరిచారట

కంచె చేను మేయడం అంటే మీకు తెలుసా! ఓసూర్ ప్రాంతంలో ఒక కారును ఆపి, అటకాయించి, 80 వేల ఖరీదు చేసే నగలూ, వగైరా, 500 రూపాయలు నగదూ అపహరించినందుకు శివన్న అనే పోలీసు అధికారి, అతనితో పాటు దావూద్ ఖాన్, భాషా అనే అధికారులూ అరెస్టు చెయబడ్డారు.

— ఫాలాక్షుడు ●


సినీమా తార షీల చెప్పుచున్నది!
'నా సౌందర్య పోషణకోసం లక్సే వాడతాను'
మీ సౌందర్యం కూడా ముఖ్యమే—
దానికి వాడదగినది అదే: శుద్ధమైన,
సౌమ్యమగు లక్స్ టాయిలెట్ సబ్బు.
సొగసైన షీల ఇలా అంటున్నది: "4 రంగులలోను
తెలుపులోను గంది లక్స్ ఒక్కటే.
మరి మనోహ్లాదకరమైన పరిమళం కూడాను"
LUX
LUX
TOILET SOAP
లక్స్ టాయ్‌లెట్ సబ్బు
సినీమా తారలకు
సౌందర్యమునిచ్చే సబ్బు
హిందుస్థాన్ లీవర్ ఉత్పత్తి
లింటాస్-LTS. 219-140 TL

నటి హేమమాలిని



నటనకన్నా నాట్యంపైనే మక్కువ ఎక్కువ

శ్రీ చక్రవర్తి, శ్రీమతి జయా చక్రవర్తికి జనించిన హేమమాలిని తన శైశవాన్ని ఢిల్లీలో గడిపింది. అక్కడే విద్యాభ్యాసంతోబాటు భరత నాట్యాన్ని అభ్యసించింది. శ్రీ చిక్కాల్ రామస్వామి పిళ్లయి వద్ద 'తంజావూర్ బాణీ' భరత నాట్యాన్ని క్షుణ్ణంగా నేర్చుకుంది. భరత నాట్యమేగాక కథక్, కూచిపూడి నృత్యాలు కూడ ఆమెకు సమగ్రంగా తెలుసు.

ఈమె నృత్యకళా విశిష్టతకు ముగ్ధుడయిన ప్రముఖ నటుడు, దర్శకుడు, నిర్మాత అయిన రాజకపూర్ 'ఈమె గొప్ప నాట్యకత్తె. త్వరలో ఈమెను ఒక గొప్ప నటిగా చూడగలరు' అని ప్రశంసించడం చిన్న విషయం కాదు.

యుక్తవయస్సులో వున్న హేమమాలినికి అజంతా శిల్పంలాంటి శరీర పొందిక, శరీరానికి సోయగాన్ని ఇనుమడించే రీతిలో



ఆకర్షణీయమైన విగ్రహం

కళాకాంతుల్ని వెదజల్లే ముఖారవిందం, ముఖాన్ని ప్రకాశింపచేసే చేపకళ్ళు, దేవకన్యలను తలదన్నే అవయవసౌష్ఠవం ఆమెను నాట్యకళా కోవిదురాల్నిగా చేసాయి. తను నేర్చిన విద్యపై భక్తి, శ్రద్ధలను ప్రదర్శిస్తూ భరతనాట్యకళకు వన్నె తెచ్చింది.

ఢిల్లీలోని రాష్ట్రపతి భవనంలో జరిగిన విందు, వినోదాల్లో హేమమాలిని తన భరతనాట్యాన్ని ప్రదర్శించి పల్వురి ప్రశంసలందుకుంది. ముఖ్యంగా ఎలిజబెత్ రాణి, పండిత నెహ్రూ, రాజేంద్రప్రసాద్, రాధాకృష్ణన్, జాకీర్ హుస్సేన్‌లాంటి ప్రముఖులచే కీర్తించబడింది హేమమాలిని. మన దేశంలోని ముఖ్య నగరాలయిన ఢిల్లీ, బొంబాయి, మద్రాసు, కలకత్తాల్లో నృత్యప్రదర్శన లిచ్చి మంచిపేరు సంపాదించింది. మన దేశంలోగల వివిధ భాషా పత్రికలు ఆమె నాట్యాన్ని మెచ్చుకుంటూ వ్రాసిన అంశాలు ఆమెలో ద్విగుణీకృతోత్సాహాన్ని యేర్పరచి ఆ కళపై మరింత మోజును యేర్పరిచింది.

నాట్యకళలో ఆరితేరిన హేమమాలిని వెండితెరలో కూడ సముచిత స్థానాన్ని యేర్పరచుకుంటూంది. దాక్షిణాత్య

వైజయంతిమాల, వహీదారెహ్మాన అఖిల భారత తారలయినట్లు హేమమాలిని కూడ ఆ స్థాయిని అందుకునే అదృష్టం చేరువలోనే వుంది శ్రీ అనంతస్వామి నిర్మిస్తున్న 'సప్నోంకాసౌదాగర్' చిత్రంలోనూ, శ్రీ రాజకపూర్ నిర్మించే 'మేరా నామ్‌జోకర్' చిత్రంలోనూ రాజకపూర్‌తో కథానాయికగా నటించే అవకాశం అదృష్టం యీమెకు రావడం యీమె జీవితంలో మరపురాని మరువలేని ఘట్టం ఇంకా రాజేంద్రకుమార్, ధర్మేంద్రలాంటి ప్రముఖ కథానాయకులలో నటించేందుకు నిర్ణయింపబడి వుంది

సినిమా కన్నా నాట్యంమీదే యీమెకు మక్కువ ఎక్కువ దైవాంశ సంభూత మయిన భరత నాట్యం ముఖ్యంగా అతి కష్టమయిన 'తంజావూరుబాణీ' నృత్యాన్ని యీమె తన అభినయ కౌశలంతో అద్భుతంగా ప్రదర్శిస్తుంది దీనితో బాటు 'మోహిని నృత్యాన్ని నయ నానంద కరంగా అభినయిస్తూ, ప్రేక్షకుల్ని సమ్మోహితుల్ని చేస్తుంది ఈ రెండుగాక, 'ఆండాళ్ కళ్యాణం' 'కూచిపూడి కథక్ మణిపురి' నాట్యాన్ని యీమె తన హస్త గతం చేసుకుంది

సంప్రదాయ కుటుంబానికి తగ్గ సద్గుణము, సవినయ విధేయత, సంస్కారము మూర్తీభవించిన హేమమాలినికి ఆ సర్వేశ్వరుని కరుణా కటాక్షము సర్వదా ప్రసరిస్తూ, యీ అందాల బరిణెను నాట్యరంగంలోనూ, చలన చిత్ర రంగంలోనూ యెనలేని మణిపూసగా విరాజిల్లడానికి వలసిన శక్తిని, అదృష్టాన్ని ప్రసాదించి యావత్ప్రపంచం గుర్తించే కళాకారిణిగా రూపొందించాలని కోరుకుంటున్నాం

ఫోటోలు, వ్యాసం

మాణిక్య త్యాగరాజన్ ●

ఆ పీ - యు పీ ...

రాజసులోచన నృత్య ప్రదర్శన

ఆంధ్ర సాహిత్య సమితి, భిలాయినగర్ వారి ఆధ్వర్యాన 22 3 68 శుక్రవారం, నెహ్రూ హవుస్ ఆఫ్ కల్చర్‌లో పుష్పాంజలి నృత్య కళా కేంద్రం, మద్రాసు వారిచే శ్రీమతి రాజసులోచన తదితరుల నృత్య ప్రదర్శనలు జరిగాయి

మూడు గంటలసేపు వివిధ రీతుల నృత్యాలను ప్రదర్శించి, శ్రీమతి రాజసులోచన కుమారి తంగం కుమారి సరోజ, కుమారి సుచరిత బేబి పద్మిని ప్రేక్షకులను ఆనందపరవశులను చేశారు ప్రదర్శనలు భారతదేశపు అన్ని ప్రాంతాలలోను ప్రసిద్ధికెక్కిన కూచిపూడి, కథాకళి, మహారాష్ట్ర లావణి, భంగ్రా పద్ధతులలో జరిగాయి

లక్నో ఆంధ్రుల ఉగాది వేడుకలు

మార్చి 29 సాయంత్రం లక్నో ఆంధ్రులు 'ఉగాది' వేడుకలు జరుపుకున్నారు. ఉత్తరప్రదేశ్ గవర్నరు శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు వారి సతీమణి శ్రీమతి లక్ష్మీకాంతమ్మగారు, ఈ వేడుకలలో పాల్గొన్నారు ఆ నాటి కార్యక్రమం పంచాంగ శ్రవణంతో మొదలయినది కొంత మంది సభ్యులు లలిత సంగీతం, జానపదగేయాలు పాడి శ్రోతలను ఆనందపరచారు

దక్షిణభారత నటీనట సమాఖ్య

ఢిల్లీలోని దక్షిణభారత నటీనట సమాఖ్య'వారు ప్రపంచరంగస్థల దినోత్సవం జరిపారు ఈ సందర్భంగా మనస్తత్వాలు నాటక ప్రదర్శనం జరిగింది


రాజధానిలో తెలుగు సాహితి

సుమారు ఏణ్ణర్థం క్రితం ఢిల్లీలోని తెలుగు కవులు, రచయితలు, పండితులు, సాహిత్యఅభిమానులుకలిసి నాటిన 'తెలుగు సాహితీ 'బీజం మొలకెత్తి ఏపుగా పెరిగి వస్తూ ఇప్పటికి ఇరవై కవి సమ్మేళనాలను జయప్రదంగా నిర్వహించ గలిగింది అని తెలియ చేయడానికి సంతోషంగా ఉంది పది పన్నెండేసి మైళ్లదూరంనుంచి నమ్మకోడానికి వీలులేని ఢిల్లీ బస్సులలోవచ్చి సాహిత్యాభిమానులంతా ఒకచోట కలుసుకోవడమే ఆశ్చర్యకారణం అనుకొనే పరిస్థితులలో ఔత్సాహికులైన యువ రచయితలను ఆకర్షిస్తూ, రచయితలు తమ రచనలను వినిపించగా వాటి గుణదోషాలను సభ్యులంతా నిర్మోహమాటంగా చర్చించడంవంటి ఆరోగ్యకరమైన కొత్తకొత్త చిగుళ్లను వేస్తోంది ఈ 'తెలుగుసాహితీ' వృక్షం దేవ్ నగర్‌లోని ఆంధ్రాస్కూలు ఆవరణలో 14 4 68వ తేదీని జరిగిన ఇరవయ్యవ సాహిత్య సమావేశంలో, డాక్టర్ మహీధరనళినీమోహన్ "పగిలిన అద్దంలో ప్రతిబింబాలు" అనే వ్యంగ్య ప్రధానమైన గేయం చదివేరు శ్రీ రెండ్ల వెంకటరెడ్డి 'చార్వాకమతాన్ని" గురించిన వ్యాసం చదివేరు శ్రీ గుంటినాగరాజు 'అర్పణ"అనే కవితనూ, శ్రీముదుంబై చక్రాచార్య శతశోలూ— శాస్త్రులూ 'అనె వ్యంగ్య వ్యాసాన్ని శ్రీ కొలిచెలమ సుబ్బావధాని 'కీలక ఉగాది" మీద పద్యాలను వినిపించారు ఆచార్య గంటి జోగి సోమయాజులు, శ్రీ క్రొవ్విడి లక్ష్మన్న శ్రీ వేమూరి ఆంజనేయశర్మ ప్రొఫెసరు మద్దాలి సూర్యప్రకాశరావు వంటి ప్రముఖుల వ్యాఖ్యానాలతో సభ ముగిసింది

—ఒక పరిశీలకుడు ●



ఆరువారాల భారత పర్యటన సందర్భంగా మద్రాసు వచ్చిన 38 మంది అమెరికన్ విద్యావేత్తలను గౌరవార్థం ఇండియాలో యు ఎస్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ దక్షిణ ప్రాంతీయ కార్యాలయం వారు మార్చి 21 న కవిమెరా హోటల్ హాలులో కుమారి యడవల్లి రమ కూచిపూడి నృత్య ప్రదర్శనం ఏర్పాటుచేశారు ఈ నృత్యప్రదర్శనం అమెరికన్ అతిథులను గొప్పగా అలరించింది కుమారి రమ కూచిపూడి నృత్యభంగిమ విశేషాలను వివరిస్తుంటే అమెరికన్ అతిథులు ఆసక్తితో వింటున్నారు దక్షిణాది రాష్ట్రాలలో ఈ బృందంవారి పర్యటన కార్యక్రమాలను నిర్వహించిన యుసెఫ ప్రాంతీయ అధికారి డాక్టర్ డి ఎన్ రావు చిత్రంలో ఆమె కుడివైపున ఉన్నారు కుమారి యడవల్లి స్వర్ణకుమారి (ఎడమవైపున మూలగాఉన్న ఆమె) నృత్యానికి పాటలు పాడింది



వాణిశ్రీ

వి. ఎల్. నారాయణ, భవానీపట్నా

ప్ర: పువ్వులెన్నో కెల్లా మీకు ఏ పువ్వు యిష్టం? మీరు తీరుబడి సమయాల్లో ఏమి చేస్తుంటారు?

జ: మల్లెలంటే మహా యిష్టం నాకు. తీరిక సమయాల్లో 'గాలి'ని మేస్తుంటాను.

రవీంద్రబాబు, . . గ్రాం

ప్ర: ఈ మధ్య తెలుగు సినిమాల్లో అసభ్యంగా సెక్సుని ప్రదర్శిస్తున్నారని పత్రికలు, ప్రేక్షకులు అంటున్నారు. అయితే మీరేమంటారు? అందుకు బాధ్యులు చిత్ర నిర్మాతలా, నటీనటులా లేక ప్రేక్షకులా?

జ: ప్రేక్షకుల రుచినిబట్టే నిర్మాతలు చిత్రాలు తీస్తారు. నిర్మాతలు డబ్బు యివ్వడం వల్ల, వారు చెప్పినట్లు నటీ, నటులు నటిస్తారు. ఏదియేమయినా యీమధ్య తెలుగు సినిమాల్లో సెక్సు ముదిరినదని ఒప్పుకుంటాను.

మారుతీప్రసాదరావు, గారా

ప్ర: వాణిశ్రీగారూ! ఒక సందేహం — సినిమా అదృష్టాన్ని మీరు వెతుక్కుంటూ వెళ్ళారా లేక సినీ అదృష్టమే మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చిందా?

జ: అదృష్టమనేది వెతికితే దొరికేవస్తువు కాదండీ.

ఎస్ ఆర్ నాయుడు, వెంగన్నగారిపల్లె

ప్ర: జీవితములో ఎక్కువ ప్రాముఖ్యమయినది ఏది?

జ: నమ్మకం.

ఎస్ ఎ లక్ష్మి, షోలాపూర్

ప్ర: ఈకాలములో చలనచిత్రాలను చూసి ఆడపిల్లలు ముఖ్యముగా చెడిపోతున్నారని కొంతమంది తమ అభిప్రాయాన్ని నాకు చెప్పారు. ఆ వ్యాఖ్యపై మీ అభిప్రాయం ఏమిటి?

జ: లోకో భిన్నరుచిః — దేనికయినా స్వయంనిర్ణయం కావాలి.

జి. సుబ్బాయమ్మ, గుంటూరు

ప్ర. నేటి సినిమాలు ప్రజలకు ఎంత వుపయోగకరమో నిష్పక్షపాతంగా చెప్పగలరా?

జ: రోజంతా శ్రమించే జీవికి తక్కువ డబ్బుల్లో ఎక్కువ వినోదాన్ని యిచ్చేసాధనం సినిమా.

జి కృష్ణయ్య, వెంకటగిరి

ప్ర: మీరు జీవితంలో సాధించిందేమిటి?

జ: మంచితనం.

[illegible]

ప్ర: మేము పంపే ప్రశ్నలకు జవాబులు మీ సెక్రటరీ యిస్తారని వింటున్నాను. ఇది ఎంతవరకు నిజం?

జ: అక్షరాలా అబద్ధం. అసలు నాకు సెక్రటరీ వుంటేగా.

ధనకొండ రాజమన్నారు, తిరుపతి

ప్ర: కలిసిమెలిసి తిరిగిన జీవితాలు విడిపడతాయా? కాలం, దూరం ఆప్యాయతను, అనుబంధాన్ని విడదీస్తాయా?

జ: కలవడం, విడడం అనేవి దైవశాసనాలు. ఆప్యాయతకు, అనుబంధానికి కాలం, దూరం కొలమానం కాదు.

బహుమతిపొందిన ప్రశ్న

బందా కనకరాజు, హైదరాబాదు

ప్ర: నేటి కొత్తతారలు, పాతతారల పోజులు కొట్టాలని ప్రయత్నిస్తారు. ఎందుచేత?



జ: పాతతారలు కొత్తతారలను కాపీ కొడ్తున్నారని కొందరంటున్నారు. ఎందుచేత?

మూగజీవులు

ఆశయాలను పంతరించుకుని ఆదర్శాల అడుగుల్లో నడిచే నిర్మాతలు ఇటీవల వెలుగులోకి వస్తున్నారు ఆశించిన ప్రమాణంలో చిత్రనిర్మాణం జరిగినా జరగకపోయినా నిర్మాణాత్మకమైన ఈ దృక్పథం ప్రశంసించ దగిందే!



'మూగజీవులు' లో ప్రసన్నలక్ష్మి రాజ్ కుమార్

మూగనోటనుంచి రాగలహరి పొలికించి ప్రపంచఖ్యాతి నార్జించుకున్న ఒక యువకవి కథ, అతనిని పెద్దవాడిగా చేసిన లలితాదేవిగాథ వెరసి చంద్రశేఖరా ఫిలింస్ వారి 'మూగజీవులు

సంఘంలో మూగజీవులకున్న స్థానాన్ని వారి అభివృద్ధి పథకాల విస్తరణావశ్యకతని గుర్తింప జేయాలనే ప్రయత్నమే నేమో ఈచిత్రం అనిపించక మానదు

లలితాదేవి అనే ఒక సాంఘికసేవా తత్పరురాలు మూగజీవుల ఆశ్రమానికి సేవ చేస్తూవుంటుంది కుమార్ అనే మూగవాడు ఆమెని ఆకర్షిస్తాడు. ఫారిన్ నుంచి తిరిగి వచ్చిన ఆమెభర్తకి ఈపనులు నచ్చవు తత్ఫలితంగా లలితాదేవి ఆ సాంఘికాలకి దూరమవుతుంది కుమార్ ఆమెని వెతుక్కుంటూ వస్తాడు సినిమాటిక్ గా అతనికి మాటలు కూడా వస్తాయి లలితాదేవి అతనికి చదువు చెప్తుంది వారిద్దరిమధ్య నీచసంబంధం అంటకడతారు కుమార్ 'శ్రీశ్రీ' కోవ కవిత్వం ప్రపంచ జనాదరణ పొంది, అతనొక మహనీయ వ్యక్తిగా గుర్తింపబడి నప్పుడు అన్నీ చక్కబడతాయి ఇదీ కథ!

కుమార్ కి లలితాదేవికి నీచసంబంధం మిషపై కథ పొడిగించడం అసహజంగా కనిపిస్తుంది. మూగజీవుల ఆశ్రమం లలితాదేవి సేవకి, బాధకి ఎక్కువ ప్రాతినిధ్య మిచ్చివుండడంతో లక్ష్యం నెరవేరకపోయినా లలితాదేవి పాత్ర నిలవగల్గింది ఫారిన్ నుంచివచ్చిన డాక్టర్ పాత్ర మానవతకి విరుద్ధంగా మలచబడింది ఆ పాత్ర లేకపోయినా కథకు లోపం జరిగేదికాదు కథ, మాటలు, దర్శకత్వం, నిర్మాణం వగైరా కార్యభారాలు అతి సాహసంగా వహించిన జి వరలక్ష్మికి ప్రేక్షకుల సాదరసానుభూతి తప్పక లభిస్తుంది చిత్రాంతంలో ప్రసిద్ధ కవులను పరిచయం చేసినతీరు మెచ్చుకోతగ్గట్లుగావుంది

లలితాదేవిగా జి. వరలక్ష్మి ప్రతిభావంతంగా నటించి పాత్రని రక్తి కట్టించారు కుమార్ గా రాజ్ కుమార్, ప్రసన్నగా ప్రసన్నలక్ష్మి పాత్రోచితంగా నటించి చిత్రానికి నిండుతనం తెచ్చారు తదితర ముఖ్యపాత్రలని నాగయ్య, సుందరరాజ్, రాజ్ బాబు పోషించారు శ్రీశ్రీ పాటలురాశారు కోదండపాణి సంగీత సారథ్యం వహించారు

చలనచిత్ర రంగంలో ఒక నది కొత్త ప్రయోగాన్ని చేసిన జి వరలక్ష్మి ప్రశంస పాత్రురాలు

—సికరాజు

సినిమా డైరీ

- మోడరన్ థియేటర్సు నిర్మించే సాంఘిక చిత్రంలో వాణిశ్రీ, రామ్మోహన్ నాయక్, నాయకులుగా నిర్ణయింప బడ్డారు
- కౌముదీ ఫిలింస్ నిర్మించే రెండవ చిత్రంలో శోభన్ బాబు. వాణిశ్రీ. రాంమోహన్, షీలా ప్రధాన పాత్రలను పోషిస్తారు
- శ్రీ దేవి కంబైన్స్ 'చుట్టరికాలు' చిత్రం యొక్క రెండు యుగళ గీతాల్ని సంగీత దర్శకుడు ఘంటసాల (నారాయణ రెడ్డి, దాశరథి వ్రాసినవి) మే 1, 2, 3, 4 తేదీల్లో రికార్డు చేసారు ఈ రెండూ జగ్గయ్య, జయంతి లపై చిత్రీకరిస్తారు సుశీల, ఘంటసాల పాడారు
- సారథి స్టూడియోస్ చిత్రానికి శ్రీ ఎస్ రాజేశ్వరరావు సంగీత దర్శకునిగా నియమింపబడ్డారు
- రామకృష్ణా అండ్ ఎన్ ఎ టి కంబైన్స్ వరకట్నం' చిత్రాన్ని నిర్మిస్తున్నారు ఈ చిత్రం యొక్క షూటింగు మే 8న ప్రారంభ మవుతుంది
- సునందినీ పిక్చర్స్ నిర్మిస్తున్న జానపద చిత్రం యొక్క షూటింగు శ్రీ విఠలాచార్య దర్శకత్వంలో మే 2 ప్రారంభ మైంది
- ఉదయశ్రీ ఎక్చర్స్ అమాయకుడు' మే 10 న విడుదలౌతుంది



ఉత్తమచిత్రంగా ఎన్నికైన 'సుడిగుండాలు'కి లభించిన 'బంగారునంది'ని ముఖ్యమంత్రివద్ద నుంచి అందుకుంటున్న అక్కినేని నాగేశ్వరరావు, ఆదుర్తి సుబ్బారావు.

సినిమా

శ్రీదేవి కంబైన్స్ తమ "చుట్టరికాలు" యూనిట్ చే గోదావరీ తీరాన పదిరోజుల షూటింగు జరిపించి ఏప్రిల్ 24న మద్రాసుకు చేరుకున్నారు. శ్రీ పేకేటి నిర్దేశకత్వంలో రెండు పాటల చిత్రీకరణ, క్లయిమాక్సు ఘట్టాల చిత్రీకరణ జరిగాయి. శ్రీ గుమ్మడి, జగ్గయ్య, జయంతి, శోభన్‌బాబు, లక్ష్మి పాల్గొన్నారు. శ్రీ తోట సుబ్బారావు నిర్మించే యీ చిత్రంలో యింకా బాలకృష్ణ, అల్లురామలింగయ్య, రమాప్రభ, కృష్ణకుమారి, కాంతారావు, ఛాయాదేవి, సత్యనారాయణ ముఖ్యభూమికల్ని ధరిస్తున్నారు ఆంధ్రలో జ్యోతి పిలింస్ ద్వారా యీ చిత్రం జూన్‌లో విడుదలవుతుంది శ్రీ ఘంటసాల సంగీత దర్శకత్వంలో మూడు పాటలు రికార్డు చెయ్యబడి ఎక్సరైజు కాబడ్డాయి ఏప్రిల్ నెలాఖరుకు మరి మూడు పాటలు రికార్డు చెయ్యబడి మే మాసంలో చిత్రీకరింపబడగలవని దర్శకులు పేకేటి వ్యక్తపర్చారు

* * *

కల్పనా చిత్రవారి "అత్తగారు కొత్తకోడలు" చిత్రం యొక్క షూటింగు ఒక్కపెట్టు మినహా తతిమ్మా పని పూర్తయింది శ్రీ అక్కినేని సంజీవి దర్శకత్వంలో నిర్మింపబడ్డ యీ చిత్రంలో హరనాథ, జయంతి, కృష్ణ విజయనిర్మల, సత్యనారాయణ, పుష్పకుమారి, రాజబాబు, రమాప్రభ ముఖ్య పాత్రలను పోషించారు శ్రీ బాబూరావు నిర్మించిన యీ చిత్రాన్ని పూర్ణా విడుదల చేస్తారు జి కె వెంకటేష్ చక్కటి పాటలను విన్పించారు వాటిని ఘంటసాల, శ్రీనివాస్, సుశీల, ఈశ్వరి ఎ ఎం రాజా పాడారు

* * *

ప్రముఖ వెండితెర నటులు శ్రీ మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి కుమారుడు చిరంజీవి డాక్టరు విజయకుమార్ బి వి ఎస్‌సి కి, విజయవాడ వాస్తవ్యులు శ్రీ కోగంటి అచ్యు రామయ్యగారి కుమారుడు గోపాలకృష్ణయ్య గారి కుమార్తె సౌభాగ్యవతి సరళకు ఆంధ్రా ఫిలిం ఛేంబరు ఆఫ్ కామర్సు హాలులో ఏప్రిల్ 21న వివాహం జరిగింది ఫిలిం పరిశ్రమకు చెందిన ప్రముఖు లనేకులు స్వయంగానూ, గ్రీటింగ్స్ ద్వారానూ నూతన దంపతులకు ఆశీస్సులనందచేసారు.

* * *

హైద్రాబాద్ సారథి స్టూడియోలో శ్రీ తమ్మారెడ్డి కృష్ణమూర్తి 'బంగారు గాజులు' చిత్రాన్ని శ్రీ ఎ ఎస్ రావ్ నిర్దేశకత్వంలో నిర్మిస్తున్నారు గదా! ఈ సాంఘిక చిత్రంలో నాగేశ్వరరావు చూపుతున్న నటన ప్రేక్షకులకు నవరసాలను అందించే పద్ధతిలో వుందని రషెస్ రూఢి చేసింది గతవారం అక్కినేని, భరతిలు పాల్గొన్న ఒక పాటను నారాయణరెడ్డి వ్రాశారు చలపతిరావు చక్కటి బాణీ విన్పించారు ఆపాటలోని కొంత భాగాన్ని మీకు తెలియచేస్తాను

జాగిరి జాగిరి జిత్తుల మావ,
చిప్ చిప్ చున్,
జింగిరి జింగిరి జిత్తులమావ,
చిప్ చిప్ చున్! అనేది పాట

ఈపాటను చిత్రంలో నాగభూషణం ఎదుట భారతి అక్కినేని పాడ్తారు హీరో చెల్లెల్ని నాగభూషణం బారినుండి తప్పించేందుకు అక్కినేని బర్మా వ్యక్తిగా అక్కడకి వచ్చేప్పుడు, భారతి బర్మా భాషలో



భలే కోడళ్ళులో జయంతి జానకి

పోస్తుంది. ఈచిత్రం యిప్పటికి 13రీళ్ళు తయారైంది.

హాస్యరసానికి కొత్తరూపం!

మద్రాస్ శారదా స్టూడియోలో ప్రసాద్ ఆర్ట్సు 'డెన్' సెట్టువేశారు. ఆసెట్టులో ఆనందమోహన్, జెమినీబాలు సుశీల అనెడి సర్వాలంకార శోభితలయిన నర్తకి నృత్యంతో మైమరపడాన్ని దర్శకుడు శ్రీ కె. బాలచందర్ చక్కగా చిత్రించారు. 'సత్తెకాలపు సత్తెయ్య' గా శ్రీ చలం హాస్యరసానికి కొత్తరూపాన్ని ప్రతిపాదిస్తున్నారు. నాయకీ నాయకులుగా రాజశ్రీ, శోభన్‌లు నటిస్తున్న యీ చిత్రంలో గుమ్మడి విజయలలితలు ముఖ్య భూమికల్ని ధరిస్తున్నారు. మొన్నజరిగిన డ్యాన్సుకు పాటలేని మూడు నిమిషాల పాశ్చాత్య బాణీని ఎం. ఎస్. విశ్వనాథం అద్భుతంగా విన్పించారు. ఈ చిత్ర నిర్మాణసంస్థ అధినేత 20 సంవత్సరాల యువకుడు ప్రసాద్.

* * *

శ్రీశైలంలో ఔట్‌డోర్‌ను ముగించుకుని వచ్చిన శ్రీ బి ఎన్. రెడ్డి 'బంగారు పంజరం' చిత్రంయొక్క షూటింగును వాహినిలో కొనసాగించారు. ఏప్రిల్ 29 న జరిగిన సన్నివేశపారాన్ని మీకు అందిస్తున్నా: పండరీబాయి, శోభన్, వాణిశ్రీలు పాల్గొన్న ఘట్టాలు చిత్రించబడ్డాయి.

శోభన్: ఐయి టేక్ లీవ్ ఆఫ్ యు మదర్ నేను చెప్పింది జ్ఞాపకం వుంచుకోండి.


పండరీబాయి: ఇట్ ఈజ్ పర్ ఫెక్ట్లీ ఆల్‌రైట్. గాడ్ బ్లెస్‌యూ.

శోభన్: థాంక్యూ. అని వెళ్ళిపోతాడు

శ్రీ పాలగుమ్మి పద్మరాజు సంభాషణలు రాశారు. శ్రీ ఎస్. రాజేశ్వరరావు పాటలకు స్వరకల్పన చేస్తున్నారు. ఇతర ముఖ్య పాత్రలను రాజబాబు, త్యాగరాజు, కాకరాల ధరిస్తున్నారు. వీరి తదుపరి షెడ్యూలు సేలం దగ్గరుండే ఏర్‌కాడులో జరుగుతుంది.

* * *

తణుకు వద్దనున్న చక్కెర ఫాక్టరీలో శ్రీ జగ్గయ్యతో మాంటేజి షాట్స్ తీసిన పదవ శ్రీ పేకేటి శివరాం వీనస్ స్టూడియోలో 'చుట్టరికాలు' ఇన్‌డోర్ వర్కును ఒకవారం రోజులపాటు జరిపి, ముప్పాతిక చిత్రాన్ని ముగించారు గతవారం



పద్మశ్రీ బిరుదాన్ని అందుకున్న నాగేశ్వరరావుని ప్రశంసిస్తున్న ఉపరాష్ట్రపతి శ్రీ వి. వి. గిరి.

27 నుండి 30వరకు జరిగిన షెడ్యూలులో శ్రీయుతులు గుమ్మడి, శోభన్‌బాబు, రేలంగి, బాలకృష్ణ, అల్లు రామలింగయ్య పాల్గొన్నారు. వారి మధ్య జరిగిన సంభాషణల్ని మీకు తెలియచేస్తున్నా. ఈచిత్రంలో శ్రీ గుమ్మడి కోటికి పడగలెత్తిన ఆస్తిపరుడయినా, లోభిత్వం తప్పించి కాదు. ఆయన కుమారుడు శోభన్‌బాబు డబ్బును తృణప్రాయంగా జమకట్టే మనస్తత్వం గలవాడు ఆవూర్లో రేలంగి పేరుమోసిన పెండ్లిండ్లను జరిపించే బ్రాహ్మణుడు. వీరి ముగ్గురికి జరిగిన సంఘటనే క్రింద వుదహరిస్తున్నా.


గుమ్మడి: ఒరేయ్ నీకారు మూలంగా డబ్బంతా గుల్ల అవుతుందిరా! పెట్రోలుకి 70, రిపేరుకి 50 అటరా!

శోభన్: పాతకారు కదు నాన్న, దానికి దాహం ఎక్కువ. పూరికే త్రాగేస్తుంది. అని వెళ్ళబోయే సమయంలో,

'కళ్యాణాద్భుత గాత్రాయ కామితార్థ ప్రదాయినీ?' అంటూ రేలంగి ప్రవేశిస్తాడు.



'మూగజీవులు'లో జి వరలక్ష్మి



చల్లనినీడ నిర్మాత చలపతిరావు, నాయిక జమున.



ముఖ్యమంత్రి వద్దనుంచి మొమెంటో అందుకుంటున్న బేబి రోజారమణి.

సినిమా

శోభన్: ఏమిటి శాస్త్రులు గారు, పెళ్ళంటున్నారు. కొంపదీసి వాళ్ళో పెళ్ళి కాదు గదా.

పై సన్నివేశాన్ని చిట్టిబాబు చక్కటి కోణాల్లో చిత్రించారు. పేకేటి డైరెక్టు చేశారు. శ్రీ తోటసుబ్బారావు నిర్మించే యీ చిత్రం జూన్‌లో విడుదలవుతుంది.

పదికాలాలపాటు నిలిచే పాత్ర

వాహిని స్టుడియోలోని మొదటి ఫ్లోర్‌లో శ్రీమతి జమునా రమణారావు



'అమాయకుడు'లో కళ్యాణి.

చల్లనినీడ' చిత్రానికి ఆడుతూ, పాడుతూ నటించిన సన్నివేశాన్ని దర్శకుడు శ్రీ తాతినేని రామారావు, కెమరామెన్ శ్రీ ఎం. కె. రాజా సహకారంతో వివిధ కోణాల్లో చక్కగా చిత్రీకరించారు. శ్రీ నారాయణరెడ్డి వ్రాసిన యీ పాటను శ్రీమతి సుశీల తన శ్రావ్యమయిన కంఠంతో కమ్మగా ఆలాపించడానికి సంగీత సారధి చలపతిరావు చక్కని బాణీని విన్పించారు.

మీకు తెలుసా?

నటి కాంచన ఏర్ హోస్టెస్‌గా వుండేదని మీకు తెలుసా.

నటి రాజశ్రీకి రోజారంగంటే చాలా యిష్టం.

శ్రీ రాజనాల రెవిన్యూ ఇన్‌స్పెక్టరుగా వుండేవారు.

శ్రీ ప్రభాకరరెడ్డి ఎం. బి. బి.ఎస్. పట్టభద్రులని మీకు తెలుసా.

శ్రీ రాంమోహన్‌కు గుర్రపు స్వారీ తెలుసు.

శ్రీ తాతినేని చలపతిరావుకు రైఫిల్ షూటింగులో మంచి అనుభవం వుందని మీకు తెలుసా.

ప్రముఖ నిర్మాత శ్రీ బి. నాగిరెడ్డి సోదరులు శ్రీ కొండారెడ్డికి ట్రాన్సిస్టరన్నా, రేడియో గ్రామన్నా మహా యిష్టం. వారి గది చుట్టూ యివే ఎక్కువగా వుంటాయి.

శ్రీ సత్యనారాయణకు కారుకు రంగు మార్చడం మహా సరదా.

శ్రీమతి సావిత్రిగణేష్ గొప్పనటి, దర్శకురాలు మాత్రమేగాదు; ప్రతిభావంతంగా పాడగలరు.

కలకలలాడే జాబిలిలో
నా చెలికాడె నిలిచెనులే
పిల్లగాలి నన్ను మెల్లగ పిలచె
ప్రియుని బాసలె తెలిసెనులే;

అంటూ కథానాయిక తనకు రాబోయే భర్తను వూహించుకుంటూ, ఆనంద తరంగాల్లో తేలియాడుతూ పాడుతుంది. శ్రీ చలపతిరావు, సుబ్బయ్య చౌదరి సంయుక్తంగా నిర్మిస్తున్న 'చల్లని నీడ' జూన్ మూడవ వారంలో రాయల్ ఫిలింస్ ద్వారా విడుదలవుతుంది. చిత్రంలోని ప్రధాన పాత్రలను శ్రీమతి జమున, అంజలీదేవి, గుమ్మడి, హరనాథ్. రాజబాబు ప్రభాకరరెడ్డి. టి. జి. కమలాదేవి, రావి కొండలరావు ధరిస్తున్నారు. ఈ చిత్రంలోనే రావికొండలరావు కలం పదునును మీరు చవిచూడగలరు. అసభ్య శృంగారమో లేక అశ్లీల సాహిత్యమో మచ్చుకయినా యీ చిత్రంలో కానరాదు. శ్రీమతి జమునకు యీ పాత్ర పోషణ సులభ సాధ్యమేనయినా ప్రేక్షకులకు పదికాలాల పాటు నిలిచే పాత్ర.

ముసలివేషంలో ప్రత్యేక శోభ!

విక్రం స్టుడియోలో రాజపిక్చర్స్ నిర్మిస్తున్న 'రాజయోగం' షూటింగు అంతిమ దశ నందుకుంది. ఈ కథలో మనిషి గొప్పవాడా లేక విధిగొప్పదా అనేదే ప్రధానాంశం. ఈ పోరాటంలో ఎవరు నెగ్గుతారో చిత్రం చూసి మీరే నిర్ణయించండి. మేకప్ మేకర్ శ్రీ బి. వీరరాజు నిర్మించే యీ చిత్రంలో విలన్ నటుడిగా గుర్తింపబడ్డ రాజనాలకు ముదుసలివేషం ప్రత్యేకశోభను చేకూర్చింది. ఆ పాత్రలో అతడు జీవించాడనే చెప్పాలి. ఒకేమాట ... ఒకేబాట అంటూ మొండి పట్టుదలతో అయినవారిని దూరం చేసుకుని, అన్నంపెట్టిన వాడిచేతనే కన్నం వేయించుకుని, మహారాణి సింహాసనాన్ని





'పంతాలు పట్టింపులు'లో శోభన్‌బాబు

సినిమా

భార్యను, బిడ్డను పోగొట్టుకొని మధన పడే దురదృష్టవంతుడుగా రాజనాల చూపెట్టిన నటన అమోఘం అని యిప్పటి వరకు చిత్రం రషస్ చూసిన వాళ్లందరూ చెప్పుతున్నారు శ్రీ వీటూరి కథ, సంభాషణలు వ్రాసారు సత్యం సంగీతాన్ని వినిపించారు ముఖ్య పాత్రలను కాంతారావు రాజశ్రీ, రాజనాల, సత్యనారాయణ, గీతాంజలి, ప్రభాకరరెడ్డి రాకరాజ, రాజబాబు, మీనాకుమారి బాలకృష్ణ పుష్పకుమారి, ఆదిశేషయ్య, మోహన ధరించారు శ్రీమతి సుశీల, ఈశ్వరి, ఎ బి శ్రీనివాస్, బాలసుబ్రహ్మణ్యం, జానకి చిత్రంలోని పాటలను పాడారు అంధ్రలో



'భలేకోడళ్లు'లో జానకి, నాగభూషణం,

అకరాజీతద్వారా ఈనా చిత్రం మేనెలలో విడుదలవుతుంది. ముఖ్యంగా శ్రీ సుబ్బరామదాస్ దర్శకత్వం నిర్వహించారు.

'ఆడపడుచు' చిత్రాన్ని డైరెక్టుచేసిన శ్రీ కె. హేమాంబధరరావు యిప్పుడు గోపాలకృష్ణా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న సముజ్జ్వల సోపానానికి కర్తృత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం యొక్క ప్రారంభ పూజ ఏప్రిల్ 19 న సుభాషిణీ ఆర్ట్సు ఆఫీసు ప్రాంగణంలో సింపుల్‌గా జరుపబడింది. సంగీత దర్శకుడు టి. వి. రాజు వినాయకస్తోత్రాన్ని హార్మోనియంపై వాయించారు. పూజకు వచ్చిన అతిథులకు స్వీట్స్ పంచబడ్డాయి. పూర్ణా పిక్చర్స్ విడుదల చెయ్యనున్న ఈ చిత్రంలో పద్మశ్రీ రామారావు, జయలలిత, పద్మనాభం, ప్రభాకరరెడ్డి, నాగభూషణం, రాజబాబు, టి. జి. కమలాదేవి, ధూళిపాళ, రమాప్రభ, అల్లు రామలింగయ్య, రావి కొండలరావు, రాధాకుమారి ముఖ్య పాత్రలను పోషిస్తారు. చిత్రకథను ముళ్ళపూడి వెంకటరమణ వ్రాశారు; సంభాషణలను వారే వ్రాశారు. కెమెరాను వి. ఎస్. ఆర్. స్వామి, ఆర్టును బి. ఎస్. కృష్ణ నిర్వహించే ఈ చిత్రాన్ని కె. గోపాలకృష్ణ నిర్మిస్తున్నారు. మే నెలలో రికార్డింగ్ పని జరుగుతుంది. జూన్ నుండి సెప్టెంబరువరకు షూటింగు జరుగుతుంది.



'నవ్వులు-పువ్వులు'లో కృష్ణకుమారి, చలం.

* * *



'తిక్కశంకరయ్య'లో యన్. టి. రామారావు, జయలలిత.

సినిమా

మద్రాసు ఫిలిం ప్రేక్షక సమాజం ఏప్రిల్ 30 వ తారీఖున ఉడ్లాండ్స్ లో నాటి సుప్రీంకోర్టు న్యాయమూర్తి శ్రీ టి. ఎల్. వెంకట్రామయ్యర్ అధ్యక్షతన సమావేశమై 1967 సంవత్సరపు ఉత్తములను వెల్లడించింది.

ఈ సంస్థ కార్యదర్శి శ్రీ ఎల్. ఎస్. కన్నయ్యా అతిథులకు స్వాగతం పలికారు. 1967 కు ఉత్తములుగా ఈ క్రింది వారిని ఎన్నుకున్నారు. బహుమతి ప్రదానం జూలై మొదటివారంలో జరుగుతుంది.

తెలుగు ఉత్తమనటుడు: ఏ. నాగేశ్వరరావు.
ఉత్తమనటి: జమున.
ఉత్తమచిత్రం: [illegible] 'పూజ'.

తమిళ ఉత్తమనటుడు: ఎ. వి. ఎం. రాజన్.
ఉత్తమనటి: కె. ఆర్. విజయ.
ఉత్తమచిత్రం: [illegible] 'భామావిజయం'

మళయాళ ఉత్తమనటిగా తెలుగు శారద, కన్నడ ఉత్తమనటిగా జయంతి ఎన్నికైనారు.

పాత్రలో నవరసాలు

ఎస్. వి. ఎస్. పిక్చర్స్ నిర్మిస్తున్న 'కలిసొచ్చిన అదృష్టం' చిత్రంలో సత్యనారాయణకు నవరస పోషణకు [illegible] పాత్ర లభించింది. ఈ పాత్రలో భీభత్సం, రౌద్రం, శోకం, శృంగారం, హాస్యం, కరుణ, [illegible] మిళితమై వుంటాయి. ఈ పాత్ర తనకు ప్రత్యేక పేరు తెస్తుందనుకుంటున్నారు సత్యనారాయణ. [illegible] శ్రీ ఎస్. వి. రామారావు, కాంచన, నాగభూషణం, ప్రభాకరరెడ్డి, [illegible], చంద్రకళ ముఖ్యపాత్రలను ధరించే ఈ చిత్రంలో శ్రీ టి. వి. రాజు సంగీతం ప్రత్యేకంగా ఉంటుంది. శ్రీ కె. [illegible] దర్శకత్వంలో ఈ చిత్రం తయారవుతున్నది. శ్రీ [illegible] ఈ చిత్రంలో [illegible] నిర్వహిస్తున్నారు.


—శ్రీనివాస్.

రామాయణ దివ్యగాథ

"శ్రీరామకథ" చిత్రంలో తెరపై 16నిమిషాలపాటు వినిపించే స్వర్గీయ సముద్రాల రాఘవాచార్య విరచితంబయిన "రామాయణ దివ్యగాథ".

రామకథా శ్రీరామకథా
రామకథా శ్రీరామకథా
ఎన్నిసార్లు ఆలించినగానీ
ఎన్నిమార్లు దరిసించినగానీ
తనివితీరని దివ్యకథా
కన్నుల విందవు పుణ్యకథా ॥రా॥
అనగనగా కోసలదేశానికి
అధిపతి దశరథమహారాజు
అతనికి రాణులు . ముప్పురు వరుసగా
కౌసల్య సుమిత్రా కైకేయా
పుత్రకామియై యాగము జేసే
పొందెను పాయస పాత్ర
పాలొనరించీ పంచెను సతులకు
వారు ధరించిరి గర్భములు
ప్రసవించెను రాముని కౌసల్య
లక్ష్మణ శత్రఘ్నులను సుమిత్ర
భరతకుమారుని కైకేయా
దినమొక గతి వర్ధిల్లిరి వారూ
దినమొక గతి వర్ధిల్లిరి వారూ. రామ॥
యాగరక్షణకై రామలక్ష్మణుల
యాచించెను విశ్వామిత్రమునీ
మునిమాటను జవదాటగనేరక
పనిచెను దశరథ భూజాని
పనిచెను దశరథ భూజాని
యాగమును జెరువగా
అరుదెంచిన దానవులా
యాగమును జెరుపగా
అరుదెంచిన దానవులా
మదమణచీ దాశరధి
మునుల దీవెనలు పొందె
గురువరుతో రఘువరుడు
పురహరుని ధనువును
అరయగ మిథిలాపురి
దారి పయన మాయె!
రామా!...రామా!......
రామా!... రామా!.....రామా!....యని
కొరడవిని— పిలుచువారు ఎవరని
జాలిగొనీ
రాతిరూపులో నున్న అహల్యను
పాద ధూళితో పావని కావించెను—
రామచంద్రుని రాకవిని మిథి
లాపురేంద్రుడు గౌరవించి
రామచంద్రుని రాకవిని మిథి
లాపురేంద్రుడు గౌరవించి
హరధనుస్సున వారిచేరువ
మనుచు యాంచిచె
యినకులేశుడు శివుని వింటిని
ఎక్కుపెట్టగ విరిగె ఫెళ్ళని
కన్నెమిన్నా సీత కన్నుల
వెన్నెలలు విరిసె
కన్నెమిన్నా సీత కన్నులు
వెన్నెలలు విరిసె—
అవని జాతను జనకభూపతి
రవికులేశుని రాణి చేసెను
సీతతో సాకేతనగరికి
చేరె దాశరిదీ.....
సీతతో సాకేతనగరికి
చేరె దాశరదీ..... రామ॥
రాముమూపునా రాజ్యమువోపగ
తలపోసెను ముదిమహారాజు
రాముమూపునా రాజ్యమువోపగా
తలపోసెను ముదిమహారాజు
రామరాజ్యమే రామన్నదని
హర్షించిరి కోసలప్రజలు
మాయలమారీ మంధరచూసీ—
మచ్చరమున కైకను డాసీ—
మాయలమారీ మంధర చూసీ
మచ్చరమున కైకను డాసీ
లేనిపోని దుర్బోధలు చేసీ
కైక మదిని పగయెగద్రోసె
దేవాసుర సంగ్రామమునాడు
పతి తనకిడిన వరాల బదులుగా
రాముని వనముల కనిపీ,
భరతుని రాజుగ చేయగ పతిగోరే
ఎన్నో తీరుల అనునయించినా
కన్నీటను పాదాల కడిగినా
చిన్నరాణి మదిమారుప జాలక
రామా!... రామా!......
రామా! యని నరపతి మూర్ఛిల్లె.
రామా! యని నరపతి మూర్ఛిల్లె.
రాముని సముఖానకు రావించి
రాజుబాధ వివరించీ
రాముని సముఖానకు రావించి
రాజుబాధ వివరించీ
తండ్రిమాట పాలించుటె కొమరుని
తగవని పలికెను కైకేయా!
ధర్మరక్షకవతారము దాల్చిన
దశరథసుతు డానందముగా
తండ్రిమాట చెల్లింతును నేనని
తరలెను వనికి జానకితో
మునుముందు సుమిత్రానందనుడూ—
తనవెనుకను మిథిలా రాజసుతా
నడువగ చేరెను శ్రీరఘురాముడు
పావన గంగా తటినీ—
పావన గంగా తటినీ—
నీచరణమ్ములు సోకిన కటికరాయే
నెలతాయగుట రామయ్యా!
ఆ.....ఆ......ఆ........
నీచరణమ్ములు సోకిన కటికరాయే
నెలతాయగుట రామయ్యా!
నిలుమని రాముని కాళ్ళను కడిగీ
గుహుడు నదిని దాటించె
గుహుడు నదిని దాటించె
హైలెస్స హైలెస్స హైలెస్స—
హైలెస్స హైలెస్స హైలెస్స.
తల్లిదురాశను తండ్రివియోగము
విని భరతుడు మదినొచ్చుకొని
ఆ....ఆ.......ఆ........
తల్లి దురాశను తండ్రివియోగము
విని భరతుడు మదినొచ్చుకొని
రాముని రాజ్యము రామునికిచ్చి
ఏలించెదనని కదలే—
అన్నమాట జవదాటననీ
అది క్షత్రియ ధర్మము కాదనీ
తనకుమారుగా పాదుక లొసగి
భరతు నయోధ్యకు పంపించె
కొండలు — కోనలు వనములు దాటి
గోదావరి దరి చిత్రకూటగిరి
పర్ణశాల నిర్మించి సీతతో
రాముడు సుఖముగ నుండె—
రఘురాముడు సుఖముగ నుండె.
రఘురాముడు సుఖముగ నుండె.

అగ్రశ్రేణిలో అద్వితీయ ఆటగాడైన ఆంధ్రుడు



కోసూరు అప్పలరాజు

1963 డిశంబరులో జరిగిన ప్రీ—ఒలింపిక్ ఫుట్‌బాల్ పోటీ మొదటి ఘట్టంలో భారతదేశం సిలోన్‌పై రెండు గోలుల తేడాతో (5—3) విజయం సాధించింది. తిరిగి బెంగుళూరులో జరిగిన రెండవ ఘట్టంలో భారతదేశం ఏడుగోలుల తేడాతోవిజయం చేపట్టింది. (7—0) మొదటి పోటీలో మూడు, రెండవపోటీలోనూ మూడు గోలులు చేసి ఒక ఆటగాడు భారతదేశపు విజయాలకు ప్రధానంగా తోడ్పడ్డాడు.

ఆసంవత్సరము ఏప్రియల్‌లో మలేసియాలో జరిగిన జూనియర్ ఫుట్‌బాల్ పోటీలో అతను చేసిన మూడు గోలులవల్లనే భారతదేశానికి మూడవ స్థానం లభించింది.

1962 లో కలకత్తాలో భారత పశ్చిమజర్మనీల మధ్య జరిగిన ఎగ్జిబిషన్ ఫుట్‌బాల్ పోటీలో భారతదేశం ఓడిపోయినా, భారత దేశానికి లభించిన ఒకే ఒకగోలు ఆ ఆటగాడే చేయడం జరిగింది.

ఐతే 1963 డిశంబర్ వరకు దేశానికి ప్రాతినిధ్యం వహిద్దామని అతను చేస్తోన్న తపస్సు ఫలించలేదు. 1964 లో ఇరాన్‌పై ప్రీ ఒలింపిక్ పోటీ రెండవ రవుండుకి అతనిని ఎన్నిక చేసినా అసలు పోటీలు సిలన్‌పై బ్రహ్మాండంగా ఆడిన అతనికి అవకాశం ఇవ్వలేదు. భారతదేశం ఇరాన్‌పై ఓడిపోయి ఒలింపిక్స్‌లో పాల్గొనే అర్హత సంపాదించలేకపోయింది. అతను భారత జట్టులో ఆడివుంటే గెలుపు భారతదేశానికిదక్కేదని దేశంలోని పత్రికలన్నీ ఆ ఆటగాడిని కీర్తించాయి. ఆ ఆటగాడిని మినహాయించడము పచ్చి మోసంగా ఫుట్‌బాల్ అభిమానులు భావించారు.

ఆ ఆటగాడు కోసూరి అప్పలరాజు. తనపూర్వపు ప్రతిభ ఏమాత్రమూ సన్నగిల్లక పోయినా అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య చేస్తోన్న అన్యాయానికి ఈరోజున 'బలి' అయి పోతున్నాడు.

1965 లో భారతదేశం పర్యటించిన రష్యా జట్టుతో పోటీచేసిన భారత జట్టుకి భిలాయ్‌లో జరిగిన పోటీలో నాయకత్వం వహించాడు. ఆ సంవత్సరమే కలకత్తాలో చెకోస్లోవేకియా-ఇండియన్ ఫుట్‌బాల్ ఎసోషియేషన్ (ఐ. యఫ్. ఏ.) జట్ల మధ్య జరిగిన పోటీలో 'ఐ. యఫ్. ఏ. జట్టు తరఫున చరిత్రాత్మకమైన గోలు అప్పలరాజు చెయ్యడం జరిగింది. చెకోస్లోవేకియా 'వరల్డ్‌కప్ పోటీలో పాల్గొని విశేషమైన కీర్తి గడించింది. పాపుల్‌హర్ స్టావర్‌గా వున్న ఆ చెకోస్లోవేకియా జట్టుపై గోలుచేయడం ఎవరికైనా కలలోని విషయం!

ఎనిమిది సంవత్సరాల వయస్సులో ఫుట్‌బాల్ ప్రారంభించిన అప్పలరాజుకి చిన్నప్పుడే పెద్ద ఆటగాడు అవాలనే కోరిక వుండేది. అందుకు తగిన క్రమశిక్షణ అలవర్చుకొన్నాడు. స్థిర సంకల్పము, ఏకాగ్రత అతనిని తీర్చిదిద్దాయి. మిసెస్ ఏ. వి. యన్. కళాశాలకు చెందిన పాఠశాల విద్యార్థిగా గ్రిగ్ పోటీలలో తన జట్టుకి రెండు సంవత్సరాలు నాయకత్వం వహించి గెలిపించాడు.

ఆతర్వాత విశాఖపట్నానికి చెందిన పోలార్‌స్టార్ జట్టు సభ్యుడుగా నాలుగు సంవత్సరాలు దక్షిణాదిని జరిగే ప్రధాన పోటీలలో పాల్గొనే అవకాశం కలిగింది. ఆ సమయంలోనే ఆటలో అనేక మెలకువలు తెలుసుకోగలిగాడు అప్పలరాజు. ఆ నాలుగు సంవత్సరాలు అప్పలరాజే పోలార్‌స్టార్ క్లబ్! పోలార్‌స్టార్ క్లబ్బే అప్పలరాజు!.

1957 లో ప్రప్రథమంగా జాతీయ పోటీలలో పూర్వాంధ్ర రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ పాల్గొన్నాడు అప్పలరాజు. 1959 లో బి. యన్. రైల్వేలో ఉద్యోగిగా ప్రవేశించి భారతదేశంలో ఫుట్‌బాల్‌కి మెక్కా అనదగ్గ కలకత్తాలో తన ఆటని సానపెట్టుకొన్నాడు. మొట్టమొదటిసారి కలకత్తా లీగ్‌లో ఆ సంవత్సరము పాల్గొంటూ 24 గోలులు చేశాడు. అది ఆ సంవత్సరపు రికార్డు. అంతవరకూ తెలుగువారికి కలకత్తాలో ఘనకీర్తి తీసుకువచ్చిన కాకినాడ అప్పారావుతో సమానుడనిపించుకొన్నాడు. నాటినుంచి నేటిదాకా కలకత్తాలో ఆబాలగోపాలానికి అభిమాన ఆటగాడుగా ప్రకాశిస్తున్నాడు.

1963 జాతీయ పోటీలలో జరిగిన ఒక సంఘటన అప్పలరాజు ఆటలోని వేగం గుర్తుకు తెస్తుంది. బీహార్ గోల్‌కీపర్ అప్పలరాజు ఎడమ కాలితో ఫిరంగి గుండువలె పంపిన బంతిని పట్టుకొని బంతి వచ్చిన వేగానికి ఆగలేక బంతితో సహా నెట్ వరకూ వెనక్కి వెళ్లిపోయాడు. మద్రాసులో ఆ జాతీయ పోటీ చూసిన ప్రేక్షకులు ఈ రోజునా ఆ సంఘటన చెప్పుకుంటారు.

టెలెవివ్‌లో (ఇస్రాయిల్) 1964 లో ఆసియా కప్ పోటీలలో దక్షిణ కొరియాపై అప్పలరాజు రెండు గోలులు చేసి భారతదేశానికి విజయం చేకూర్చాడు. ఆ పోటీలలో భారతదేశానికి రెండవ స్థానం లభించింది.

'లెఫ్ట్— సెంటర్ ఫార్వర్డ్' స్థానంలో దేశంలో తనకి తిరుగులేదని నిరూపించుకొన్న అప్పలరాజు భారతదేశానికి అంతర్జాతీయ పోటీలలో నాయకత్వం వహించక పోవడం తెలుగుదేశపు దురదృష్టం కాదు! భారతదేశపు దురదృష్టం!! ఆ విషయం అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్యకు తెలియకపోయినా దేశానికి తెలుసు.

అతనికి ప్రజల అభిమానం వుంది. అతని ప్రతిభ తగ్గలేదు. 'లెఫ్ట్— ఇన్ ఫార్వర్డ్' స్థానంలో దేశంలో అతనిని మించిన ఆటగాళ్ళు లేరు. అతనికి అవకాశం ఇస్తే దానిని సద్వినియోగం చేసుకోగలడు. తన స్థానాన్ని పదికాలాలపాటు వదిల పరచుకోగలడు.

—శాజీ ప్రసాద్

నాన్నే నమ్మించి వంచించగల దిట్ట. ఎక్కడికో వెళ్ళింది. ఈ పాటికి వస్తూ ఉంటుందనుకుంటాను. ఆమె ఈ విషయంలో నాకు సహాయపడుతుంది దేవస్మిత మీకు అవలీలగా లొంగేట్టు చేస్తుంది.'

కామార్తులయినవారు ఆ మాటలకు కుదుటబడి ఆశ్రమంలో ఉండిపోయారు.

ఈలోగా సిద్ధికరి ఆశ్రమానికి తిరిగి వచ్చింది. వైశ్య యువకులు ఆమెకు నమస్కరించారు. యోగ కరండిక తన శిష్యురాలికి సంగతి సందర్భాలు వివరించింది.

ఆనాడే యోగకరండిక సిద్ధికరితోపాటు దేవస్మిత భవనానికి బయలుదేరింది. సేవకులకు, ఇతరులకు అవసరమయితే బహూకరించడానికి మోదకాలు మొదలయిన తినుబండారాలుకూడా వెంట తీసుకొనివెళ్ళింది. గుహసేనుని భవనం చేరింది. తలవాకిట్లో ద్వారపాలకుడు కావలి ఉన్నాడు. అతనిని చూడగానే, కపటప్రేమ నటిస్తూ, ఎంతో ఉత్కంఠతో అతనిని కౌగిలించుకొని, 'నీవు నా జన్మాంతర మిత్రుడివి. ఆ సంగతి నిన్ను చూడగానే నా కళ్ళే తెలిపాయి.' అంటూ అతనికి తను తెచ్చిన మోదకాలు ఇచ్చింది. అతడు మోసపోయి, వారిని భవనంలోకి పోనిచ్చాడు. లోపల కావలి కుక్కకూ తినుబండారాలు వేసింది.

యోగకరండిక, ఇంట్లో ఎవరు ఎక్కడ వుంటారు, ఏమిటి ప్రవేశించడానికి మార్గం మొదలయినవన్నీ పరికిస్తూ భవనంలో ప్రవేశించింది. మొదట మధ్యగదిలో వున్న గుహసేనుని తల్లివద్దకు వెళ్ళింది. ఆమెకు యోగకరండిక మాయలు తెలియవు. నిజమైన తాపసి అనుకొని గౌరవ సత్కారాలు చేసింది.

తర్వాత ఆ వృద్ధతాపసి దేవస్మిత గదిలోకి వెళ్ళింది. పతివ్రత అయిన దేవస్మిత పతివియోగంతో దిగులుపడి తెల్లబారి ఉంది. సూర్యునికి కూడ కనిపించక ఎవరి కంటా బడని రహస్యమందిరంలో కాలం గడుపుతూవుంది. యోగకరండిక రాగానే దేవస్మిత నమస్కారం చేసింది. తాపసి ఆమెను ఆశీర్వదించి ఆశ్రమానికి మరలింది.

దేవస్మితను లోబరచుకోడానికి సిద్ధికరితో వివిధోపాయాలు ఆలోచించింది యోగకరండిక. మరుసటిదినమే మళ్ళీ దేవస్మిత భవనానికి బయలుదేరింది. ఈసారి

...బృహత్కథామంజరి

(10వ పేజీ తరువాయి)

కుక్కకు వేయడానికి మాంసం బాగావండి వెంట తెచ్చింది. దూరాలోచనతోనే దానినిండా మిరియాలపొడి ఎక్కువగా చల్లింది.

యోగకరండిక దేవస్మిత భవనం చేరిన తర్వాత ద్వారపాలకుణ్ణి మునుపటిలాగే సంతృప్తిపరచి, కుక్కకు మిరియాలపొడి హెచ్చుగా వేసిన మాంసం వేసింది. అది ఎంతో ఆశతో మాంసం ముద్దను కరచుకొనిపోయి తినసాగింది. (ఇంకా వుంది)

ఆటలు

డేవిస్‌కప్‌లో సిలోన్‌పై ఇండియా గెలుపు



షిల్లాంగ్‌లో జరిగిన డేవిస్‌కప్ 'బి' సెక్షన్ ఫైనల్స్‌లో ఇండియా బొటా బొటిగా గెలిచి 1966లో ప్రపంచబిరుదుని పొందిన ఆస్ట్రేలియాని సవాలుచేస్తూ ఫైనల్స్‌కి వచ్చింది.

ఆర్. కృష్ణన్ అందుబాటులో లేడు. ప్రేమ్‌జిత్‌లాల్ మణికట్టు విరగగొట్టుకోవడంవల్ల జయదీప్ ముఖర్జీ రెండునెలలుగా పోటీలలో పాల్గొనకపోయినా కూడా ఆడాల్సి వచ్చింది. ముఖర్జీ ఒకే ఒక మాచ్ ఆడాడు. మొదటి సెట్ పోగొట్టుకున్న తర్వాత పి. ఎస్. కుమరాని ఓడించాడు. అతని ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉండటంవల్ల డబుల్స్ కానీ, రివర్స్ సింగిల్స్ కానీ ఆడలేదు.

కొత్తగా వచ్చిన 20 ఏళ్ల శశి మినోత్రా ఆట అంతగా ఆకట్టుకోలేక పోయింది. తన ప్రత్యర్థి ఫెర్డినాండ్స్‌పై ఫైనల్ సెట్‌లో 8–6 వద్ద విజయాన్ని సాధించగలిగాడు. ఫెర్డినాండ్స్ 15 ఏళ్ళుగా డేవిస్‌కప్ పోటీలలో ఆడుతున్నాడు. మినోత్రా రెండవ సింగిల్స్‌లో కుమరాపై ఘోరంగా ఓడిపోయాడు.

నేషనల్ జూనియర్ ఛాంపియన్ 16 ఏళ్ల ఆనంద్ అమృత్‌రాజ్, మాజీ ఇండియా కాప్టెన్ సుమంత్ మిశ్రా కుమారుడు 18 ఏళ్ల గౌరవ్ మిశ్రాలు అతిముఖ్యమైన డబుల్స్‌లో అనుభవశాలురైన కుమరా, ఫెర్డినాండ్స్‌లపై విజయాన్ని సాధించడం ముదావహం. ఈ బాలురిద్దరికీ అవకాశం కల్పించడం అన్నది ధైర్యంతో కూడుకున్న పనే. కానీ వారు మూడు సెట్లలో క్లిష్టమైన ఆటని గెలవడం అందరూ కొనియాడారు.

ఆ మర్నాడు అమృత్‌రాజ్ సింగిల్స్‌లో ఫెర్డినాండ్స్‌పై ఓడిపోయాడు. తర్వాతి ఆటలో అభివృద్ధి చూపించాడు కానీ పొరపాట్లుచేసిన కారణంగా ఆట పోగొట్టుకున్నాడు.

అనుభవశాలురైన ఆటగాళ్ళముందు జూనియర్‌లు అయినవారు తమ శక్తిని ప్రదర్శించాలన్నట్లు అతిగా ఆడకూడదు. ఎస్. పి. మిశ్రా, రాబి వెంకటేశన్‌లని విస్మరించడం అన్నది ఎన్నిక చేసినవారి పొరపాటుని ఎత్తి చూపుతున్నది. వారిద్దరిలో ఎవరూ ఏ పోటీలోనూ సిలోన్‌తో ఓడిపోలేదు. వారికి డేవిస్‌కప్‌లో మంచి రికార్డు ఉంది.

వ్యాపార కారణాలవల్ల అందుబాటులో లేని కృష్ణన్ సెప్టెంబర్‌లో జరిగే ఫైనల్స్‌కు జపాన్‌తో కానీ, ఫిలిప్పైన్స్‌తో కానీ ఆడటానికి ఆమోదాన్ని తెలపటం ఎంతో ధైర్యాన్ని కలిగిస్తున్నది. దానికి సిద్ధమవుతున్నట్లుగా యిప్పుడు యూరోప్‌లో ఓపెన్ వింబుల్డన్ ఆడుతున్నాడు. ఇండియా యింకా అభివృద్ధి సాధించడానికి యిది దోహదం చేస్తుంది. భారత్ టెన్నిస్ రంగంలో ఇంతకంటే సంతోషకరమైన వార్త యింకేముంటుంది?

—కె. ఎస్. నరసింహన్

పుస్తకాలు

మార్క్సిస్ట్ తత్వ శాస్త్రం

రష్యన్ మూలం: వి. అఫనాసియేవ్. అనువాదం: వై. విజయకుమార్, నిడమర్తి ఉమారాజేశ్వరరావు, బి. రామ చంద్రరావు., ప్రచురణ: విశాలాంధ్ర ప్రచురణాలయం: వెల రు 5—00 .

మార్క్సిస్ట్ తత్వశాస్త్రం సంగతిని తెలుగులో తెలుసుకొనదలచే వారికి బాగా ఉపయోగపడే చక్కటి గ్రంథమిది. "పదార్థం ప్రధానమైనదని, చైతన్యం అప్రధానమైనదని, చైతన్యం పదార్థము నుండి ఉద్భవించిందని భావించే తత్వవేత్తలు భౌతిక వాదులు"వంటి నిర్వచనాలు పాఠకులకు ఉపయోగ పడతవి. ఆలోచింప చేస్తయ్. "చైతన్య మనేది పదార్థం యొక్క చారిత్రికాభివృద్ధి ఫలితం. అది అసామాన్య, క్లిష్ట, పదార్ధ గత వస్తువైన మానవుని మెదడుయొక్క ధర్మం (11 వ పుట) ఇటువంటి నిర్వచనాలు పాఠకులకు అర్ధమవుతవా? ఇంతకంటే సులభంగా యీ నిర్వచనాల ననువదించే ఉపాయం లేదా?

మార్క్సిజమ్ ఒక శాస్త్రమని అంగీకరించే తెలుగు పాఠకులందరూ చదవ తగిన గ్రంథమిది. తత్వశాస్త్రంలో తరుచు వచ్చే ఇంగ్లీష్‌మాటలకు ఈ రచయితలు కొన్ని తెలుగు మాటలను ఉపయోగించారు. ఇందుకు వారిని ప్రశంసించుతున్నాను. aspects (ఆస్‌పెక్ట్స్) అంటే దృగంశాలన్నారు. essence (ఎస్సెన్స్) అంటే అంతస్సత్యం అన్నారు. సబ్‌జక్టివ్ అయిడియల్టిస్ట్=స్వీయాత్మక భావవాదులు. ఇటువంటి మాటలను తెలుగులోకి అనువదించేప్పుడు తెలుగులో మనం ఉపయోగించే మాటలకు మన తత్వశాస్త్రంలో గల ప్రత్యేకార్థాలను దృష్టిలో పెట్టుకొనడమవసరం కాదా! ఒక అర్థంలో ఒకమాటను ఉపయోగించే సందర్భంలో ఆ అర్ధమేమిటో వివరించడం సమంజసం కాదా? "దాని దృష్టిలో (గతి తార్కిక శాస్త్రం దృష్టిలో) ఏదీ కూడా పరమరూఢం (ఆబ్సల్యూట్) కాదు......ప్రతి దాని యొక్క పరిణామ శీలాన్ని, ప్రతి దానిలోనూ అంతర్భూతమై యుండే పరిణామ శీలాన్ని అది వెల్లడి చేస్తుంది. (17వ పుట) ఇటువంటి వాక్యాలు ఇంగ్లీష్‌రాని తెలుగు పాఠకులలో ఎంతమందికి అర్ధమవుతయ్? ఈ వాక్యంలో "ప్రతిదాని" అని ఉన్నది. దాని? అంటే యేమిటీ!

"భావవాదం వలెగాక గతి తార్కిక భవుతికవాద సత్యం బాహ్యాత్మక మైనదని చెబుతుంది. సత్యం బాహ్యాత్మక అస్థిరత్వాన్ని కలిగిన ప్రపంచాన్ని ప్రతిబింబిస్తుంది గాన దానిలోని వస్తువు (కన్‌టెంట్) మానవుని చైతన్యంపై ఆధారపడదు.. సత్యంలోని విషయం అది ఏబాహ్యాత్మక క్రమాలకైతే ప్రతిబింబిస్తుందో వాటిని బట్టే పూర్తిగా నిర్ణయించ బడుతుంది. (247వ పుట) ఇంగ్లీష్ భాషా పరిజ్ఞానముండి, రాజకీయాలలో పనిచేస్తున్న తెలుగు వారిలో ఎంతమందికి అర్ధమవుతుంది. ఈవాక్యం.

ఇక శ్రామిక నియంతృత్వం గురించి 411వ పుటలో ఉన్న వాక్యాలను సహృదయుల ముందు పెడుతున్నాను. "పెట్టుబడిదారీ విధానపుశృంఖలాలను ఛేదించ డానికి జరిగే పోరాటంలోనూ వీటిని ఛేదించే క్రమంలోనూ, సాధించిన విజయాన్ని నిలబెట్టుకుని సుస్థిరం చేసుకునేందుకు సాగే పోరాటంలోనూ నూతన సోషలిస్టు వ్యవస్థను సృష్టించే కృషిలోనూ, వర్గాలనుసంపూర్తిగా రద్దు చేసే మొత్తం పోరాటంలోనూ, ఒకే ఒక ప్రత్యేకమైన వర్గం అంటే పట్టణ కార్మికులు, సాధారణంగా ఫ్యాక్టరీ పారిశ్రామిక కార్మికుల శ్రమశీలురైన యావత్తు పీడిత ప్రజలకునాయకత్వం వహించ గలరు.' మార్క్సిజంను ఒక్కటే ఆధునిక తత్వశాస్త్రమని అభిప్రాయపడేవారందరూ గమనించ వలసిన నిర్వచనమిది.

ఎ న్యూ లుక్ ఎట్ మార్క్స్ అనే చిన్న పుస్తకంలో ఫెలిజు స్ప్రాట్ ఇలా వ్రాశారు. "ది థియరీ ఈజ్ నాట్ సైన్స్. మార్క్స్ బిలీవ్డ్ దట్ హీవజ్ సైంటిఫిక్ థింకర్ అండ్ ఎంగెల్స్ క్లెయిమెడ్‌ఫర్ హిమ్ ఎ ప్లేస్ బిసైడ్ డార్విన్. దట్‌వజ్ పార్‌టూ మోడెస్ట్. నో సైంటిఫిక్ మాన్ హాజ్ హడ్ సచ్ ఎన్‌ఇన్‌ఫ్లుయెన్స్ అపాన్ ఎఫెయిర్స్ ఏజ్ హి. మార్క్స్‌స్ ఇన్‌స్పిరేషన్ వజ్ నాట్ సైంటిఫిక్ బట్ డ్రమెటిక్: హి ఈజ్ వన్ ఆఫ్ ది గ్రేట్ మిత్—మేకర్స్. హి మస్ట్‌బి క్లాసిఫైయిడ్ విత్ ది ఫౌండర్స్ ఆఫ్ రెలిజియన్స్ ఎమాంగ్‌ది చీఫ్ ఆర్కిటిక్ట్స్ ఆఫ్ హిస్టరీ"


—వి. ఎస్. అవధాని

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Chief Editor; S. Sambhu Prasad.



మీ చర్మాన్ని పుష్పదళం లాగ మెత్తగా, మృదువుగా యౌవనంగా వుంచుకోండి...

ఇందుకు మీ చర్మమందలి స్వాభావిక తేమను మీరు నిలబెట్టుకోవాలి. పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్‌లోగల ఒక ప్రత్యేకమైన పదార్థము 'హ్యూమెక్టెంట్' చర్మపు తేమను నిలబెట్టి మీ చర్మాన్ని దుమ్ము, వాతావరణమునుండి రక్షిస్తుంది. తేలికైన, మంచువంటి పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్ మిమ్మలిని సొగసుగా కనబడేటట్టు వుంచి మీ చర్మాన్ని ఎల్లప్పుడు అందంగా, మృదువుగా, యౌవనంగా వుంచుతుంది. పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ మాత్రమే రాసుకొంటే మీ ముఖము సహజ మనోహరత్వముతో వుంటుంది. లేకపోతే అది రాసుకొన్న తరువాత పౌడర్ అద్దుకోవచ్చును. అప్పుడు పౌడర్ గంటల కొలది ఏక రీతిగా అంటుకొని వుంటుంది. పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్: ప్రపంచమంతటా అందకత్తెలు వాడే క్రీమ్!



పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్ పౌడర్ అద్దుకొనుటకు ఉత్తమమైనది

చీస్‌బ్రో-పాండ్స్ ఇన్‌కార్పొరేటెడ్ (పరిమితమైన బాధ్యతతో యు.ఎస్.ఎ.లో స్థాపించబడినది)


సబ్బులన్నియు శుభ్రపరచును కాని...
...విస్మయకరమైన చర్మసౌందర్యం నిమిత్తం
జి-11తో గూడియున్న సింథాల్
మీకు కావలెను.
సింథాల్ యందు గల జి.11 (హెక్సాక్లోరోఫీన్) చర్మ పోషణను
కలిగించే హానికరమైన క్రిములను చంపుతుంది.
CINTHOL